
# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

**2**



మాస్టర్ పార్వతీకుమార్



# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

## (అరణ్య, కిష్కింధకాండలు)

## 2

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 07-11-2020 ప్రతులు : 1,000
(మాస్టర్ పార్వతీకుమార్‌గారి
75 వసంతముల పరిపూర్తి సందర్భముగా)

వెల : రూ॥ 100-00

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రతులకు :

**ధనిష్ఠ ఫౌండేషన్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-59-3

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

విశాఖపట్నం - 530016.
ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

ఆది కావ్యమగు "శ్రీమద్రామాయణము" అన్ని లోకముల యందును కీర్తింపబడుచున్నది. రామకథా మాధుర్యము ఎంత పొగడినను తనివి తీరదు. కోకొల్లలుగ రామకథను వివరించిన వేదవేత్తలు, ధర్మవేత్తలు, జ్ఞానులు, యోగులు, భక్తులు కలరు. రాముని మహిమ ఎన్ని విధములుగ కొనియాడినను అసంపూర్ణమే! పదహారు గుణములతో ప్రకాశించు శ్రీరామునికన్న ఉత్తమ మగు మానవుడు భూత భవిష్యత్ వర్తమాన కాలములలో గోచరింపడు.

రామునికి రాముడే సాటి. సౌకుమార్యమునందు గాని, సౌందర్యమునందు గాని, ధైర్య స్థైర్యములందు గాని, మానవత్వము నందు గాని, పరాక్రమమునందు గాని, సత్యమునందు గాని, ధర్మమునందు గాని, సమభావమునందు గాని, మిత్రత్వమునందు గాని, కరుణ దయాది గుణములయందు గాని, వినయమునందు గాని, విద్యయందు గాని రామునికి రాముడే సాటి. ఏ మానవుడైనను తనను తాను ఉద్ధరించుకొనవలె నన్నచో రాముని ఆదర్శముగ భావించి ఆరాధించవలెను.

రామకథకు చిన్నతనముననే ఆకర్షింపబడుట రామానుగ్రహము. రామగానము చేయుట కూడ రామానుగ్రహమే. శ్రీరాముడు ఇలవేల్పుగ నున్న గృహమున జన్మించుటకన్న మించిన అదృష్ట ముండదు. భక్తి వాతావరణమున తిరుగుట కూడ అదృష్టమే. పామరుడుగనే రామకథను గానము చేయుట, ఆరు సంవత్సరముల పాటు రామాయణము వివరించుట జరిగినది. రామరసము వ్యసనమై, రామచింతన వీడుట అసాధ్యమై, రాముని గూర్చిన రచన ఏదియో ఒకటి సాగుచు నుండవలెనని, అట్టి యజ్ఞమున రామచింతన నిరంతర స్వస్థత కూర్చునను సౌఖ్యచింతనతో రామాయణము నందలి ఘట్టములను భక్తితో పరిశీలించుచు, అందలి సున్నితమగు ధర్మములను వివరించుట ప్రారంభమైనది. అరణ్యకాండ, కిష్కింధకాండల యందలి ఘట్టములను 98 శీర్షికలుగ ఈ పుస్తకమందు అందించుట జరిగినది.

సోదరులు, సహృదయులు అయిన **శ్రీ జె. రామేశ్వరయ్య గారు** (నాగర్ కర్నూల్) ముద్రణా సహకారము అందించిరి. జగద్రక్షకుడైన శ్రీరాముడు వారి కుటుంబమును రక్షించుచూ, సర్వతోముఖాభివృద్ధిని అనుగ్రహించుగాక !

**- పార్వతీకుమార్**

శ్రీ శార్వరి ఆశ్వయుజ శుద్ధ దశమి
విజయదశమి

# విషయసూచిక


1. దండకారణ్యము 11
2. వనవాస ప్రయోజనము 13
3. ధర్మ స్వరూపము 16
4. రాముని అభయము 19
5. రాజ ధర్మము 21
6. రాజ ధర్మము-2 23
7. వ్యసన త్రికూటము 24
8. ఆయుధము - అగ్ని 27
9. మహర్షి ధర్మము 29
10. పంచాప్సర సరోవరం 31
11. ఋషి సాంగత్యము 35
12. విశిష్ట వివేకము 37
13. ఉపాయము 40
14. ఏకోపాయము 42
15. అగస్త్య ప్రశంస 44
16. రసక్రీడ 48
17. దైవ ఘటన 50
18. ధర్మ రహస్యము 52
19. అగస్త్య సందర్శనము 55
20. శ్రీరామ-అగస్త్య సమాగమము 57
21. విధి 59
22. అంతరాత్మ 61
23. దైవ సంకల్పము 63
24. మలుపు 65
25. పరతంత్రము-స్వతంత్రము 67
26. లక్ష్మణుని కౌశలము, భక్తి 70
27. విషయ చాపల్యము 75
28. అనుజ స్మరణము 78
29. రాముని భాషణా ధర్మము 81
30. సత్యము - నిర్దోషిత్వము 84
31. వివాహ ధర్మము 90
32. ప్రత్యక్ష దైవములు 84
33. అసుర లక్షణము 92
34. రూపము - గుణము 94
35. చెప్పుడు మాటలు 97
36. ముక్కు - చెవి 100
37. ఇంద్రియ మాలిన్యము 103
38. ఖర, త్రిశిర, దూషణుల వధ 105
39. అకంపనుని విశిష్టత 108
40. శ్రీరామ ప్రశంస 110
41. వైచిత్రి 112
42. శ్రీరాముని కర్తవ్య దీక్ష 114
43. విధి నిర్ణయము 117
44. తరణోపాయము 120
45. లక్ష్మణుని స్థితప్రజ్ఞత్వము 123
46. వాస్తవికము 126

| | | |
|---|---|---|
| 47. | నిస్సహాయత | 129 |
| 48. | రాముని లోదృష్టి | 131 |
| 49. | మారీచుడు | 134 |
| 50. | మారీచుడు-2 | 136 |
| 51. | జటాయువు నీతి వాక్యములు | 138 |
| 52. | గురువాక్యము | 139 |
| 53. | దైవము | 141 |
| 54. | లక్ష్మణుని ప్రోత్సాహము | 143 |
| 55. | జటాయువునకు మోక్షము | 146 |
| 56. | జటాయువు మరణము | 148 |
| 57. | మానవత, దుర్బలత | 151 |
| 58. | కబంధుడు - దహనము | 153 |
| 59. | రామకృత్యము | 155 |
| 60. | శాపము - అజ్ఞానము | 157 |
| 61. | శబరి | 160 |
| 62. | రాముని కుశలప్రశ్నము | 162 |
| 63. | శబరి రామ దర్శనము | 164 |
| 64. | కిష్కింధకాండ ప్రాశస్త్యము | 166 |
| 65. | నిర్మోహత్వం | 168 |
| 66. | అంతః బహిః రూపములు | 170 |
| 67. | రామదాసు | 172 |
| 68. | రామ దర్శనము | 174 |
| 69. | లక్ష్మణుని సత్యభాషణము | 176 |
| 70. | హనుమంతుని విశిష్టత | 179 |
| 71. | హనుమ విజ్ఞత | 181 |
| 72. | వానరులు | 183 |
| 73. | పర స్త్రీ దర్శనము | 185 |
| 74. | శకునములు | 187 |
| 75. | యాదృచ్ఛిక దుష్కృత సుకృతములు | 189 |
| 76. | యాదృచ్ఛిక దుష్కృత సుకృతములు-2 | 191 |
| 77. | వాలి - సుగ్రీవులు | 194 |
| 78. | రామ - సుగ్రీవ మైత్రి | 196 |
| 79. | నివృత్తి మహిమ | 199 |
| 80. | సత్వము-సత్య దర్శనము | 201 |
| 81. | శ్రీరాముని క్షమాగుణము | 203 |
| 82. | హనుమంతుని రామదర్శనము | 205 |
| 83. | సుగ్రీవుని విజ్ఞత | 208 |
| 84. | దైవ చిహ్నము | 210 |
| 85. | సత్వగుణ ప్రాధాన్యత | 213 |
| 86. | వాలికి రాముని సమాధానము | 215 |
| 87. | హనుమ ఉపదేశము | 219 |
| 88. | ధర్మ రహస్యము | 221 |
| 89. | తార సాత్వికత | 223 |
| 90. | శ్రీరాముని బోధ | 225 |
| 91. | లక్ష్మణుని అశోక సూక్తము | 227 |
| 92. | మిత్ర సూక్తము | 228 |
| 93. | పునః సమాగమము | 230 |
| 94. | సుగ్రీవుని ప్రతిభ | 233 |
| 95. | దైవ విలాసం | 236 |
| 96. | దైవము తోడ్పాటు | 238 |
| 97. | జాంబవంతుని ప్రశంస | 240 |
| 98. | హనుమద్రూపము | 243 |

# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

## 1. దండకారణ్యము

దండకుడను రాజు పెంచినదగుటచే అరణ్యమునకు దండకారణ్యమని పేరు కలిగినది. శుక్రుని శాపము వలన ప్రవేశించుటకు వీలుకాని దుర్గమమగు అరణ్యముగ మారినది. సాధనాపరముగ చూచినచో దండకారణ్యమును మానవ శరీరముతో పోల్చవచ్చును. దండక యందు రాక్షసులు, క్రూరమృగములు, మునిజనులు, తపస్విజనులు యున్నారు. మానవుని యందు కూడ అట్టి అనుగుణ భావము లున్నవి. పశుభావ మున్నది. అసురభావ మున్నది. దైవీ భావము కూడ యున్నది. తదనుగుణ ప్రజ్ఞ లున్నవి. అట్టి శరీరమందు జీవుడు ప్రవేశించినాడు. అతడు పురుషుడు. అతనిని నడిపించు పురుషోత్తముడు కూడ పురుషునితో పాటు దేహమును చేరినాడు.

దండకారణ్యమున తపస్విజనులు, మునిజనులు, సాధుజనులు, అటవీజనులు, క్రూరమృగములు, పక్షులు, రాక్షసులు యున్నారు. జీవ సమూహము 'దండక' అను శరీరమున యున్నారు. అందు రాముని ప్రవేశము ఒక విశేష ఘట్టము, పుణ్య ఘట్టము. జీవుని యందు దైవము మేలుకాంచి, చొరవతో సంచరించుట జీవ సౌభాగ్యమునకు

దండక అరణ్యమున గల తపస్విజనులను అనుగ్రహించుటకు, రక్షించుటకు రాముడు చరించినాడు. మహాలక్ష్మియగు సీతమ్మతో, కాల స్వరూపుడగు లక్ష్మణునితో శ్రీరాముని దండకారణ్య ప్రవేశము సాధనాపరముగ దర్శించినచో అందొక శాశ్వత కథ కనిపించును.

మానవుని జీవితము రజస్తమస్సులతో పెనవేయబడి స్వస్వరూపమును మరచిన స్థితిలో యుండును. సత్వము సన్నగిల్లుట వలన తనలో తనను నియమించువాడొక డున్నాడని మరచును. చేయునదంతయు తానే యనియు, తన ప్రీతికొరకేయని భావించుచు, స్వార్థ ప్రవృత్తితో అహంకారముతో జీవుడు విజృంభింపగా అతని నుండి అసురభావములు జనించును. అట్టి మానవులే అసురులగు చున్నారు. అసుర భావముతో కలహించుట, హింసించుట, చంపుట, ధ్వంసము చేయుట చేయుచు నుందురు. ఇట్టి వారివలన సత్వగుణ ప్రధానులైన జీవులకు అశాంతి కలుగును. వేదన లేర్పడును. దుఃఖము కలుగును. అసురులను నిర్జించి, సాధుజనులను రక్షించుటకే శ్రీరాముడు దండ కారణ్యమున చరించెను. తపస్విజనుల ఆరాధనా ఫలముగ సీతా లక్ష్మణులతో కూడి రాముడు దండకలో ప్రవేశించినాడు. అట్లే సాధకుని ఆరాధనా ఫలముగ అతనిలోని ఈశ్వరుడు కాలమును, దైవీ ప్రకృతిని తోడ్కొని జీవుని పరిరక్షించుటకై మేల్కొనును. ఆత్మారాముడు మేల్కొనగనే క్రమముగ అరణ్య జీవనము వనజీవనమై ప్రశాంతమగును.

# 2. వనవాస ప్రయోజనము

ప్రకృతి శక్తులను జీవుడు స్వార్థమునకై వినియోగించుకొనినపుడు లోకమున హాని కలుగుచుండును. అదే ప్రకృతి శక్తులను ధర్మముతో కూడిన అర్ధకామములకై వినియోగించిన లోకమున శాంతి, సంపద, సమృద్ధి యుండును. స్వతంత్రించి తమ స్వార్థము కొరకే శక్తియుక్తులను వాడు వారు క్రమముగ అసుర భావము పొందుదురు. శక్తియుక్తులను సంఘహితమునకై వినియోగించువారు ఘర్షణలేని జీవితమును పొందుదురు. భగవదనుగ్రహము గలవారు అసుర ప్రభావము నుండి తప్పించుకొనుటకు, సుఖజీవనము గడుపుటకు లోకమును పోషించుచు, తమను పోషించుకొందురు. వీరిలో కొందరు ధార్మికులై, సాధుజనులై, మునిజనులై తపశ్శాలులగుచుందురు. ఇట్టి వారిని రక్షించుటకు పెచ్చు పెరుగుచుండు అసురభావమును నిర్జించవలెను, శిక్షించవలెను. అసుర భావము కలవారు తమ స్వార్థము కొరకై ధర్మపరులను, తపశ్శాలురను హింసించినపుడు భగవంతుడే తమని రక్షింపవలెనని వారు కోరుదురు. తమను తాము రక్షించుకొనుటకు ప్రయత్నింపరు. తనయందే భారముంచిన తపస్విజనులను రక్షించుటకై అసురకోటి మధ్యకు తానే స్వయముగ వచ్చిన ఘట్టము శ్రీరాముని దండకారణ్య ప్రవేశము.

శ్రీరామునకు కర్మ సంబంధ మేమియు లేదు. అతడు సంసారమున ప్రవేశించినపుడు కూడ అతనిని కర్మ అంటదు. దండక

ప్రవేశము సంసార ప్రవేశము వంటిది. అందు రజస్తమస్సులు, రాగ ద్వేషములు, స్వార్థము, అహంకారములతో గూడిన జీవులు కూడ వర్తించు చుందురు. వారి వర్తనమును బట్టి వారికి ఆయా కర్మ ఫలములు లభించు చుండును. తదనుగుణమగు సుఖశాంతులు పొందు చుందురు. అట్టి దండకారణ్యమునగల తపస్విజనులు మాత్రము దైవము కొరకే జీవించుచు, తమ రక్షణ భారము దైవమునకే సమర్పించినపుడు దైవము దిగిరావలసిన అగత్య మేర్పడును. రాముడు అసురులను శిక్షించి, తాపసులకు సుఖము చేకూర్చుటకే దండకమున ప్రవేశించినాడు.

నార చీరలు కట్టినను, మునులవలె శిరోజములను ముడి కట్టినను తపస్విజనులు రాముని దిగివచ్చిన దైవముగనే గుర్తించిరి. వారు దివ్యజ్ఞాన సంపన్నులగుటచే, భగవానుడే తమ ననుగ్రహించు టకు వచ్చినాడని తెలిసి సంతోషించిరి. మోక్షప్రాప్తి కలిగి సత్యలోక నివాసమునకు అర్హులైనవారు కూడ రాముని రాకకై దండకమున వేచి యుండిరి. వారు రాముని కెదురేగి అర్ఘ్యపాద్యాదుల నిచ్చి, వారి వారి ఆశ్రమముల లోనికి ఆహ్వానించుట జరిగినది.

శ్రీరాముని అవతార ఘట్టములలో అసుర సంహార మెంత ప్రాముఖ్యము వహించినదో అంతే ప్రాముఖ్యము ఋషిజనుల ననుగ్రహించుటలో గోచరించును. పదునాల్గేండ్ల వనవాసదీక్షయే అవతార ప్రయోజనమును నిర్వర్తింపజేసినది. జగత్ పరిపాలకుడగు శ్రీమహా విష్ణువునకు అయోధ్యా రాజ్యముపై అధికారము నివ్వ జూచుట, తత్కార్యమునకు విఘ్నము కలుగుట మహత్తర ప్రయోజనము కొరకే. ఆపద కలిగినపుడెల్ల జీవితము మలుపు

తిరుగుట సహజము. దివ్య పురుషుల జీవితము నందు అట్టి మలుపు అత్యుత్తమై జీవన ప్రయోజనమును ఆవిష్కరించును. ఈ కారణముగ లౌకిక పాత్రధారుల నెవ్వరిని తప్పుబట్టుట విజ్ఞత కానేరదు. ఇది రామాయణము తెలుపు ఒక శాశ్వత సత్యము.

# 3. ధర్మ స్వరూపము

ఈ జగత్తు సర్వము ధర్మముపై ఆధారపడి నడచుచున్నది. ధర్మసారమే ఈ జగత్తు. ధర్మము వలన లభించినదే ఆనంద మిచ్చును. ధర్మ పాలనమున లభించిన అర్థము సుఖము నిచ్చును. జీవుడు ధర్మకాముడై యుండవలెను. అతడికి కలుగు ప్రతి సంకల్పమును ధర్మతూకమున తూచి ధర్మ సూత్రముల ఆధారముగనే కామమును నిర్వర్తించుకొనవలెను. అట్టి కామము సుఖమును, వైభవమును కలిగించును. ధర్మముతో కూడని సంకల్ప నిర్వహణము కాల క్రమమున తప్పక దుఃఖమును కలిగించును.

కర్మ క్షేత్రమగు సృష్టియందు సారభూతమైనది ధర్మము మాత్రమే. ధర్మము నెరుగవలెను. ఎరిగిన ధర్మము నాచరించవలెను. ధర్మము నెరిగినవారు పెక్కురు గలరు. కాని ఆచరించువారు అరుదుగ నుందురు. ఆచరించుట వలన జ్ఞానము కలుగును. మోక్షము కూడ కలుగును. ధర్మము తెలిసిననూ ఆచరించని వానికి జ్ఞానము మాటు పడును. మోహము జ్ఞానమును కప్పివేయును. ఆచరించినపుడే జ్ఞానము కలుగును. ఆచరించుచు నున్నంత కాలము మోక్షస్థితి యుండును. శాశ్వత సుఖముండును. ఆచరణము కుంటుపడినచో మోక్షస్థితి నుండి పతనము చెందుట, జ్ఞాన మజ్ఞానముచే కప్పబడుట జరుగును. ధర్మాచరణము లేని వానికి జ్ఞానమూ లేదు మోక్షమూ

లేదు. జగత్తున బంధనమే యుండును. కామ మోహితుడై అనేక యోనులయందు జన్మలెత్తుచు నుండును.

ధర్మము నిర్వహించుటకు యమనియమములు ఆవశ్యకమై యుండును. ప్రయత్నము అనునిత్యము సాగవలెను. జీవునకు కలుగు ప్రతి సంకల్పమును ధర్మ ద్వారము నుండి గ్రహించి నిర్వర్తించుట ముఖ్యము. తనకు తోచినవే ధర్మములని భావింపరాదు. పెద్దల వలన ధర్మ మెరుగవలెను. పెద్దలనగా ధర్మము తెలిసి, ఆచరించువారు. శాస్త్ర ప్రమాణము వారికే తెలియును. రాముని వనవాస దీక్ష నుపసంహరింప జేయుటకై అనేకానేకములగు ధర్మ సిద్ధాంతములను అయోధ్య యందలి మంత్రులు ఆశ్రయించిరి. రాముడు ధర్మ పరాయణు డగుటచే, తికమక సిద్ధాంతము లన్నిటిని పరిష్కరించి సూటిగ ధర్మమేమో తెలిపినాడు. ఆచరించు వానికే ధర్మము గోచరించును. అట్టివా డాత్మనియతుడై యుండును. నిపుణతతో ధర్మమును నిర్వర్తించును.

ధర్మమును నిపుణతతో నిర్వర్తించు వానికే శాశ్వత సుఖము కలుగును. అనగా అంతరంగమున శాంతి స్థిరమై యుండును. అంతరంగ శాంతియే స్థిరమగు సుఖము. మనస్సు, ఇంద్రియములు, శరీరముతో కర్మల నాచరించునపుడు అవి ఫలముల నిచ్చి తీరును. ఫలములయం దాసక్తి లేక ధర్మము నాచరించుట నైపుణ్యము. అట్లే కలుగుచున్న సంకల్పములను దైవ ప్రేరణగ గుర్తెరిగి, తాను కర్త కాదని, సర్వేశ్వరుడే కర్తయని యెరిగి, తానొక పనిముట్టని యెరిగి నిర్వర్తించువాడు ధర్మమును నైపుణ్యముతో నిర్వర్తించిన వాడగు చున్నాడు.

**ధర్మాదర్థః ప్రభవతి ధర్మా ప్రభవతే సుఖమ్,**
**ధర్మేణ లభతే సర్వం ధర్మసార మిదం జగత్,**
**ఆత్మానం నియమై స్తై స్తైః కర్మయిత్వా ప్రయత్నతః,**
**ప్రాప్యతే నిపుణైర్ధర్మో నసుఖాల్లభ్యతే సుఖమ్.**

ధర్మము వలన అర్థము లభించుచున్నది. అర్థము వలన సుఖము లభించుచున్నది. ధర్మము వలన సర్వము లభించుచున్నది. ఈ జగత్తు ధర్మసారము. యమనియమములతో ధర్మము నాచరించు ప్రయత్నమున నుండవలెను. నైపుణ్యముతో ధర్మము నాచరించుట లభించినచో శాశ్వత సుఖ ముండును. రామాయణ సారమిది. భారతీయ వాఙ్మయ సారమిది.

# 4. రాముని అభయము

రక్షణార్థము రాముని శరణువేడిన తాపసులకు శ్రీరాముడు నిర్ద్వంద్వముగ అభయమిచ్చినాడు. అసురుల నుండి తమను కాపాడ వలెనని, రాక్షసుల బాధనుండి రక్షించి, వారి తపస్సులకు తగిన వాతావరణము కల్పింపవలెనని మహర్షులు శ్రీరాముని కోరినారు. త్రికరణశుద్ధిగ రక్షణార్థము శరణు జొచ్చినారు. శ్రీరాముడు పరాక్రమ శాలియని, క్షత్రియులలో శ్రేష్ఠుడని, అతనికన్న వేరు దిక్కులేదని నిర్ద్వంద్వముగ తెలిపినారు.

ఆ తాపసు లందరును వానప్రస్థులు. సత్వగుణ సంపన్నులు. ఏ ప్రాణికిని హాని తలపనివారు. అరణ్యమందలి రాలిన ఆకులు, పండ్లు భుజించుచు బ్రహ్మజ్ఞానమునకై తపించుచు జీవించువారు. అట్టి సాధుజీవులను నిష్కారణముగ రాక్షసులు హింసించుచు, మహాఘోరముగ వధించుచు, మితిమీరిన మదముతో కన్ను మిన్ను ఎరుగక చెలరేగి ప్రవర్తించుచున్నారు.

శ్రీరాముడు జన్మతః క్షత్రియుడు. ధర్మ రక్షణమే ప్రయోజనముగ జీవించువాడు. శిష్టులను రక్షించుట, దుష్టులను శిక్షించుట క్షత్రియ ధర్మము. మహాత్ములు తనను వేడుకొన్నరీతిలో దైవికమగు ఆదేశమును శ్రీరాముడు గమనించినాడు. నిజమునకు ఋషుల ప్రార్థనల యందు సన్నిహితమగు ఆదేశమే యున్నది. తాను పితృాజ్ఞ పరిపాలన కొరకు

వనమున కేతెంచినను, తన స్వధర్మమును తాను నిర్వర్తించి తీరవలసినదే. రాక్షసులు పగబట్టి వనములో మహర్షుల యెడ చేయు ఘోరకృత్యములు క్షాత్రధర్మము ననుసరించి నిర్జించవలసినదే. ఉపేక్షించవలసిన విషయము కానేకాదు. ఈ ధర్మము తన ద్వారా నిర్వర్తింపబడవలెనని దైవము సంకల్పించినాడని రాముడు భావించెను. అతడు మహర్షులకు నమస్కరించుచు, వారి పని నెరవేర్తునని మాట ఇచ్చినాడు. అతిక్రమించి వర్తించు రాక్షసులను లక్ష్మణునితో కూడి తప్పక సంహరింతునని వాగ్దానము చేసినాడు. మహర్షులు నిమిత్త కారణముగ రాక్షస సంహరణమునకు రాముడు పూనుకొనినాడు. లోకములన్నియు శ్రీరాముని సంకల్పమునకు పులకించినవి. భూమిపై రాముని అవతరణమునకు ప్రధానమగు ప్రయోజనము మహర్షుల ద్వారా సిద్ధించినది. సమస్త లోకములందలి ఋషులతోపాటు, సమస్తదేవతలు హర్షపులకాంకితులైరి. అనిర్వచనీయమగు ఆనందము సత్యలోకము నందు, వైకుంఠము నందు, కైలాసము నందు వెల్లివిరిసినది. రాముని అవతారమునకు నాంది పలికిన ఈ ఘట్టము అతి విశిష్టమైనది.

# 5. రాజ ధర్మము

ప్రభువైనను, ప్రభుత్వమైనను ప్రజలను కన్నబిడ్డల వలె కాపాడవలెనని రామాయణము బోధిస్తుంది. అట్లు పరిపాలింపని ప్రభువులకు అధోగతి తప్పదని నిర్ద్వంద్వముగ, నిశ్చయముగ రామాయణము ప్రకటించుచున్నది.

ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడుటకు తగిన రక్షణ, జీవన సౌకర్యము లేర్పరచుటకు ప్రభువు ప్రజలపై పన్ను విధించు అధికార మున్నది. కాని ఆ పన్ను ప్రజల ఆదాయములో ఆరవ వంతు మాత్రమే యుండవలెను. అంతకుమించి యుండరాదు. అనగా దాదాపు పదహారు శాతమే పన్ను యుండవలెను. అంతకుమించి ప్రజల యొద్ద నుండి పన్నులు వసూలు చేయుట అధర్మము. నిపుణతతో పరిపాలనము చేయు ప్రభువు అట్టి పన్నుతోనే సకల సౌకర్యములు ఏర్పరచగలడు. రక్షణ కూడ కల్పించగలడు. ఇది సాధ్యము గాని ప్రభువు అసమర్థుడు. అసమర్థుడగు ప్రభువునకు అధోగతి తప్పదు. సమర్థుడగు ప్రభువునకు ఉత్తమ గతులు తప్పవు. కావున పాలనాధి కారము కత్తిమీద సాము వంటిది. పాలకులవలె నుండవలెనని తహ తహ లాడుట వెర్రితనము.

భారతీయ సంప్రదాయమున, వాఙ్మయమున జీవులకు జన్మల పరంపర యున్నదని నిశ్చయముగ తేల్చి తెలుపబడినది. ప్రస్తుతము

జీవుడొనర్చు కార్యముల నిపుణత శ్రేష్ఠతను బట్టి అతని ఉత్తరగతు లుండును. భవిష్యత్తున గతి సుగమము, ఉత్తమము అయి యుండ కోరినచో ప్రస్తుతమందు కార్యములను శ్రద్ధాభక్తులతో నిర్వర్తించవలసి యున్నది. పాలకులు అధికార మదాంధులై, పాలనమును సవ్యముగ నిర్వర్తింపనిచో భవిష్యత్తున అధోగతి తప్పదు.

ఆధునిక కాలమున ఉత్తరగతులను గూర్చి గాని, ఉత్తమ గతులను గూర్చిగాని భావించు శ్రద్ధాళువులు అతి స్వల్పమే. కనుకనే కలి తాండవము చేయుచున్నాడు.

సమకాలిక జీవనమున గ్రుడ్డివారిని, కుంటివారిని, వికలాంగు లను, మూగవారిని, అన్నమునకు నోచుకొనని వారిని, కటిక పేదరికము ననుభవించు వారిని చూచినపుడైనను నరులకు తమ ఉత్తరగతులు జ్ఞప్తికి రావు. జన్మతః పై తెలిపిన విధములలో దుఃఖము లకు లోనైనవారిని చూచినపుడు ప్రకృతి వారినెందుకట్లు సృష్టించినదో భావించు మేధస్సు యుండవలెను.

గత జన్మ ఫలములే ఈ జన్మయందు అనుభవించునపుడు, ఈ జన్మ కార్యములు పై జన్మకు ఫలములై సిద్ధించును అని రామాయణము బోధించుచున్నది.

# 6. రాజ ధర్మము-2

రాజ్యమందలి తపస్వి జనులను, వనవాసి జనులను రక్షించుట కూడ రాజధర్మము. ఈ వర్గపు జనులు ఆకులు, ఫలములు, కందమూలములు భుజించి జీవింతురు. వారి నుండి పన్నులు వసూలు చేయుట అధర్మము. వారికి ప్రత్యేకముగ ఆదాయమేమియు యుండదు గనుక పన్నులు కట్టవలసిన బాధ్యత కూడ లేదు. ఇట్టి వారిని కాపాడుటవలన వారి పుణ్యములో నాల్గవ భాగము పరిపాలకునకు లభించును. వారిని రక్షించు బాధ్యత విషయమున పాలకులు ప్రత్యేకమగు శ్రద్ధ వహించవలెను.

ఆధునిక కాలమున ఆదివాసీలను, వనవాసీలను మోసము చేయుట, వారి ధనమానములను కొల్లగొట్టుట నిరాటంకముగ సాగుచునే యున్నది. దాని ఫలము దేశముపై దుష్ఫలితముల రూపమున కబళించు చున్నది. పై తెలిపిన వనవాసులను రక్షింపక పోగా దోచుకొనుట సాగుచున్నది. ఇట్టి వారిని ఆదరించి, గౌరవించి కాపాడుకొనుట రాజ్యపాలనా ధర్మములలో ఒకటి. తపస్విజనులెట్లును దుర్గమ మగు వనములలో నుందురు. వారు ప్రభువుల రక్షణ కొరకై ప్రాకులాడరు. వనవాసులను మాత్రము కాపాడు బాధ్యత సక్రమముగ నిర్వర్తింపబడవలెనని శ్రీమద్రామాయణము బోధించు చున్నది.

# 7. వ్యసన త్రికూటము

శ్రీమద్రామాయణము మూడు విధములగు వ్యసనములను వర్జించవలసినదిగ శాసించినది. అపుడే జీవునకు ధర్మము సంప్రాప్త మవుతుందని తెలిపినది. అవి, వరుసగా

1. మిథ్యా భాషణము, 2. పరదారాభిగమనము, 3. అకారణ మగు కోపము.

మిథ్యాభాషణము దాదాపు సామాన్యులందరిని ఆవరించి యుండును. వాక్ సౌలభ్యము మానవునకే యున్నది. అదియును ప్రకృతి ఉచితముగనే యిచ్చినది. ఉచితముగ లభించిన సౌకర్యమును బాధ్యతతో వినిమయము చేయుట ఉత్తమ సంస్కారము. తానుగ ఆర్జించిన సంపదను సముచితముగ వినియోగించుట సంస్కారము కాగా, తానార్జింపకయే తనవద్దకు చేరిన సంపదను సద్వినియోగము చేయుట విశేషమగు సంస్కారము. ప్రకృతి వాత్సల్యముతో యిచ్చిన వాక్కును దుర్వినియోగము చేయుట వ్యసనముగ రామాయణము పేర్కొనుచున్నది. మానవులు పోచుకోలుగ చాలా మాటలు వ్యక్తము చేయుచుందురు. వ్యర్థమగు భాషణము వ్యసనమని ఎందరికి తెలియును? సన్నిహితులు కూడినపుడు వ్యర్థ ప్రలాపములే ఎక్కువగ నుండును. పండుగలు, పబ్బములు, సమావేశముల యందు కూడ వ్యర్థ భాషణ మెక్కువగ నుండును. వాక్కును దుర్వినియోగము చేయుట వలన జీవుడు తెలియకయే అధర్మములోనికి ఈడ్వబడుట జరుగును.

కనుకనే శాస్త్రము లన్నియు మితభాషణమును సూచించినవి. అతి వాగుడు వర్జనీయమని తెలిపినది. అవసరములేని మాటలు అసత్యము లగు ప్రమాదమున్నది. అసత్యదోషము గల భాషణము మానవుని అధర్మము లోనికి నెట్టును. సత్యమునే పలుకుట, మితముగ పలుకుట, ప్రియముగ పలుకుట వలన భాషణా వ్యసనమునకు లోనుగాక జీవుడు తరించును. సౌకర్యమున్నదిగదా యని దానిని వృథాగా వినియో గించుట జీవుని అధర్మములోనికి నెట్టును. సంస్కారహీనుని చేయును.

అటులనే పరదారాభిగమనము ఒక నికృష్టమగు వ్యసనముగ శాస్త్రము తెలుపుచున్నది. ఇతరుల భార్యల యెడల మాతృదృష్టియే తప్ప, ఇతరమగు దృష్టి గల జీవుడు అధోగతిపాలగుట తథ్యము. తపస్వి జనులు కూడ ఈ వ్యసనమునకులోనై భంగపడిన కథలు కోకొల్లలు. ఇతరుల స్త్రీలను, సంపదను దొంగిలించుట, వానికి ఆకర్షింపబడుట నిస్సందేహముగ జీవుని పతనమునకు కారణ మగును. రామాయణమందలి ప్రధానమగు సందేశమే ఇది. పది తలలుగల అమిత పరాక్రమవంతుడగు రావణుని పతనమునకు కారణము పరదారాభిలాష.

మూడవదగు వ్యసనము అకారణమగు రౌద్రము లేక కోపము. కోపమువలన ప్రాణిహింస జరుగును. భావము, భాష, వర్తనము కోపముతో కూడియున్నపుడు అకారణమగు హింస తప్పదు. కారణము లేని కోపము తప్పక హింసాత్మకమై యుండును. ప్రతి మానవునకు అతడి కోపమే శత్రువై, వైరములను శత్రువులను సృష్టించుకొనును. కోపము, హింస కవల పిల్లల వంటివి. కోపిష్ఠి చుట్టును ఎవ్వరును చేరరు. కోరి హింసకు లోనగువారు ఎవ్వరుందురు? అకారణమగు

కోపము గలవాడు సమస్తమును కోల్పోవును. ఎచ్చట అహింస చక్కగ పాటింపబడునో, అచ్చటనే కోరి జీవులు చేరుదురు. ప్రకృతి సంపద కూడ చేరును. కోపము ఒక ఆయుధము వంటిది. నిష్కారణముగ ఆయుధమును వాడుటవలన పర్యవసానము అశుభమై యుండును. కనుక అకారణ కోపము ఒక వ్యసనముగ తెలుపబడినది.

పై మూడు వ్యసనములు జీవునకు పతన కారణములని రామాయణము సీతమ్మ వాక్యములుగ మనకందరికిని అందించినది. ఈ వ్యసనముల విషయమున హెచ్చరికగ యుండవలెను. అకారణ మగు కోపము, అతిభాషణము వ్యసనములని, పతన కారణములని సామాన్యముగ మానవు లెరుగరు. వాటిని పరిపాటిగనే వినియోగింతురు. అట్టివారు జారుడు నేలపై నడచుచున్నట్లే అని తెలియవలెను.

# 8. ఆయుధము - అగ్ని

ఆయుధ సంబంధము అగ్ని సంబంధము వంటిది. ఆయుధము హస్తగతమై యున్నపుడు జీవుడు రజోగుణ ప్రేరితుడై నిష్కారణముగ దానిని వాడుట జరుగును. చిన్న పిల్లలకు కత్తి అందుబాటులో నున్నపుడు పరిసర వస్తువులను కోయుటకు ప్రయత్నింతురు. కత్తెర చేతిలో యున్నపుడు అవి నివి కత్తిరించ యత్నింతురు. పెన్సిలు చేతిలో నున్నపుడు గోడలపై వ్రాయుదురు. అందుబాటులో నున్న పనిముట్టును అకారణముగ వాడు రజోగుణ ప్రవృత్తి జీవులయందు సామాన్యముగ నుండును.

ఆయుధమే అందివచ్చినపుడు దానిని వాడుటకు రజోగుణము ప్రేరణ యిచ్చును. రజోగుణ ప్రేరితమగు వస్తువుల చుట్టును యున్నపుడు జీవుడు రజోగుణ వశుడై యుండును. ఎండు కట్టెలు యున్నచోట అగ్నిహోత్రుడు విజృంభించినట్లు ఆయుధమున్నచోట రజోగుణుడు విజృంభించును. కనుక ఆయుధములను ధరించుట, అందుబాటులో నుంచుకొనుట ప్రమాదకరము. ఈ సత్యమును బోధించు కథ రామాయణమున సీతమ్మ వాక్కుగ మనకందింప బడినది.

ఒకానొకప్పుడు ఒక ఋషి తపస్సు చేసుకుంటూ యుండేవాడు. అతడు పరిశుద్ధుడు, సత్యసంధుడు. అతని తపస్సును భగ్నము చేయటానికి దేవేంద్రుడొకనాడు ఒక భటుని వేషము ధరించి ఋషి

వద్దకు వచ్చి తన వద్ద ఉన్న ఖడ్గమును ఋషి వద్ద ఉంచి, తాను మరల వచ్చువరకు దయతో ఖడ్గమును కాపాడమనెను. ఋషి భటుని యందు దయతో ఖడ్గమును తనవద్ద నిక్షేపముగ నుంచుట కంగీకరించెను.

ఋషి తపస్సు చేసుకొనుచున్నపుడు ఖడ్గమును తనవద్దనే ఉంచుకొనెడివాడు. స్నానాదులు చేయునపుడు, ఫలమూలాదులు సేకరించునపుడు, నిద్రించునపుడు కూడ ఖడ్గమును తనతోనే ఉంచుకొనుట ఆరంభించినాడు. అహర్నిశలు ఖడ్గము తనతోనే యుండుటచే సహవాసదోషమున బుద్ధి చలించి ఖడ్గమును వినియోగించుటకు ఉద్యుక్తుడైనాడు. ఆ ఉద్యుక్తత, ఉన్ముఖత వలన సత్వగుణము నుండి తెలియకయే రజోగుణములోనికి జారినాడు. ఖడ్గము వాడుట యందు ఆసక్తి పెరిగి కొమ్మలు నరకుట, ఫలములను కోయుట, వనమున గల మృగములను హింసించుట ఆరంభించినాడు. అతనిని అధర్మము ఆవరింపగ తపస్సు మరచి రౌద్రాభిరతుడై బుద్ధి కృశించి నరకమున చేరినాడు. స్వర్గమును చేరుటకై సంకల్పించిన ఋషి శాంతుడై తపస్సు చేయుట మాని రౌద్రుడై నరకమును చేరినాడు. ఆయుధ సాంగత్య మహిమ అట్టిది.

# 9. మహర్షి ధర్మము

**దం**డకారణ్యమున తపస్సుచేయ చేరిన మునులందరును ధర్మాత్ములు. వారు కందమూలములను భుజించుచు, సత్యదర్శన అభిలాషులై తపస్సు చేసుకొనుచు జీవించువారు. వారికి తపస్సే ప్రధానము. తపస్సు సిద్ధించువరకు దేహముల ఆవశ్యకత యున్నది. అన్ని ధర్మసాధనలకు దేహ మావశ్యకము. తపస్సు ధర్మములలో అత్యుత్తమమగు ధర్మము. అట్టి ధర్మమును పాటించునపుడు ధర్మము సిద్ధించువరకు దేహముండవలెను. అనగా దేహమును రక్షించుకొనుచు తపస్సు సాగింపవలెను. అందులకే ఫలమూలాదులు భక్షించుట. దేహము ప్రాణముతో నిలబడి యుండుటకే ఆహార పానీయముల స్వీకరణ జరుగుచుండును. దేహ రక్షణకు అరణ్యములో క్రూరమగు మృగము వలన అపాయము సంభవించవచ్చును. దానికి వలసిన కట్టుబాటు గావించుకొని మునులు తపస్సులు గావించుచుండిరి. ఊహించని రాక్షస బాధొకటి వారికి దండక వనమున ఏర్పడినది. వారి తపోబలముచే రాక్షసులందరిని నిర్జించగల్గినప్పటికిని దాని వలన, అట్లు చేయుటవలన రజోగుణ దోషము స్పృశించి, తపస్సును భంగపరచును. చేసిన తపము వృథా యగును. తపస్సు అందరును చేయగలిగినది కాదు. లక్షలాది జీవులలో ఏ ఒక్కరో, కర్మలనుండి విముక్తి చెంది తపస్సున కుపక్రమింతురు. వారికంతరాయము కలిగి

నపుడు స్వయముగ తపశ్శక్తిని వినియోగింపక రక్షకునికై వెతకుట ధర్మము.

దైవవశాత్తు వారికి రాముడు లభించెను. అతడు జన్మతః రక్షకుడు. కనుక తాము స్వయముగ రాక్షసులను నిర్జించుటగాక, రామ రక్షణలోనికి జొచ్చి తపస్సు గావించుకొనుట ఉత్తమమగు ఉపాయముగ వారు తలచిరి. అట్లు చేయుటలో వారి తపస్సునందలి పుణ్యార్జితములో నాల్గవ భాగము రక్షకునికి పోయినప్పటికిని సత్వము నుండి జారుట జరుగదు. సత్వగుణము నుండి జారినపుడు తపస్సే సాగదు గనుక సత్వము నిలబెట్టుకొనుటకు రక్షకుని వెతకుదురు.

బ్రహ్మర్షియగు విశ్వామిత్రుడు ఇదే ధర్మము ననుసరించి తన యాగ రక్షణమునకు రాముని రక్ష కోరెను. స్వయముగ తానే రాక్షసులను సంహరించగల మహిమాన్వితుడు విశ్వామిత్ర మహర్షి. సంహార క్రియ రజోగుణ దోషమును కలిగించును కనుక ఆ కార్యమును క్షత్రియున కప్పగించి, తన యజ్ఞమును సఫలము గావించుకొనెను.

తపస్వి జనులు ఈ సూత్రమును అవగాహన గావించుకొనవలెను. ఆస్తి తగవులు, దాయాదులతో పోరాటములు, కోర్టుకేసులు ఇత్యాదివి ఏర్పడినపుడు కొంత నష్టముకైనను వానిని పరిష్కరించుకొన్నచో ఆరాధనలు, ప్రార్థనలు, ధ్యానములు సాగును. లేనిచో ఆరాధనా సమయమున పై తెలిపిన చిల్లర విషయములే మనసున బాధించును. ఘర్షణను తక్షణమే పరిష్కరించుకొను మార్గము వెతకికొనుట జిజ్ఞాసువులకు ప్రధానమని ఈ ఉదంతము తెలుపుచున్నది.

# 10. పంచాప్సర సరోవరం

**దం**డక వనమందు సీతారామ లక్ష్మణులు సంచరించు చుండగ వారికొక విశాలమగు సరస్సు గోచరించినది. అది చాల రమ్యముగ కన్పట్టినది. తెల్లతామరలు, ఎఱ్ఱతామరలు విరబూసి సరస్సంతయు సొగసుగా యున్నది. సరస్సుపై హంసలు, పక్షులు ఆనందాతిశయముతో సాగుచు నున్నవి. జలములు నిర్మలముగ నున్నవి. ఆశ్చర్యమేమనగ సరస్సులోనుండి శ్రావ్యమగు సంగీతము, జంత్ర తంత్రీ వాద్యములు వినిపించుచున్నవి. శ్రీరామునకు ఆ సరస్సు విశేషము తెలుసుకొనవలెనని, పరిసరముల యందు పరికించి చూడగ అతనికి ధర్మభృత్ అనే మహర్షి గోచరించినాడు.

శ్రీరాముడు ధర్మభృత్‌ను ఆ తటాకము యొక్క అద్భుతమేమో తెలుపమని ప్రార్థించినాడు. రాముని ప్రార్థనలో ఒక సంస్కారము గోచరించినది. అతడు మహర్షితో తటాకమును గూర్చి తెలుసుకొన వలెనని అమితమగు కుతూహలము తమకు ఉన్నదని తెలుపుతూ, చెప్పకూడనంత రహస్యమైనచో చెప్పవలదనియు, అట్లు కానిచో తెలియపర్చ వలెనని కోరెను. మానవులకీ సంస్కారము చాల ముఖ్యము. మనస్సు అనేకానేక విషయములందు కుతూహల పడుచుండును. కుతూహలమును భాషణము ద్వారా వ్యక్తము చేయుచుండును. మన కుతూహలము నుండి పుట్టిన ప్రశ్న ఎదుటివారు సమాధానము చెప్పుటకు అనుకూలమైనదో కాదో మన మాలోచించము.

కుతూహలము కొద్దీ అడుగుట జరుగును. దానివలన ఎదుటివారికి యిబ్బంది కలిగించినవార మగుదుము. "మీ కెంతమంది పిల్లలు?" అని ప్రశ్నించుటకుముందు ఎదుటివారికి పిల్ల లున్నారో లేదో ఆలోచించవలసి యుండును. "మీకెందుకు వివాహము కాలేదు?", "ఎందుకు ఉద్యోగము రాలేదు?" ఇట్లనేకములగు ప్రశ్నలు కేవలము కుతూహలముతో అడుగుట జరుగును. ఎదుటివారిని ఇబ్బందిపెట్టు ప్రశ్నలు తెలియక అడుగుట కూడ కుసంస్కారమే అని రామాయణము తెలుపుతున్నది.

సరస్సు లోపలి నుండి సంగీతము వినబడుట ఒక అద్భుతము. అది అసామాన్యమగు విషయము. దానిని గూర్చి తెలుసుకొనవలెనను భావము సహజము. అయినప్పటికిని శ్రీరాముడు ధర్మభృత్ మహర్షిని అడిగిన విధానము ఉత్తమ సంస్కారమును సూచించును. సరస్సు నందలి సంగీతమును గూర్చి తెలుసుకొనవలెనను కుతూహల మున్నను, అది చెప్పకూడని రహస్యమైనచో చెప్పవలదని తెలుపుటలో రాముని విశిష్టత గోచరించును. అతనికి గల నిర్లిప్తతను గూడ తెలియపరచును. తెలుపరాని విషయమైనపుడు తెలుసుకొనగోరు కుతూహలమును తక్షణమే విసర్జించగలవాడు రాముడు. ఎట్లైనను తెలుసుకొనవలసిన అవసరము తనకు లేదని కూడ తేటపరచినాడు.

తెలియకూడని విషయములను తెలుసుకొనవలెనని కుతూహల పడుట ప్రమాదకరము. ఇరుగుపొరుగు ఇండ్లలో, బంధుమిత్రుల ఇండ్లలో, దాయాదుల ఇళ్ళలో ఏమి జరుగుచున్నదో యను కుతూహలము కుసంస్కారమని గుర్తించవలెను. మన కవసరమగు విషయములు మనకు ప్రకృతి తెలియజేయునని, అవసరము కాని

విషయములందు కుతూహలపడుట వర్జనీయమని సున్నితమగు సందేశము రాముని భాషణమున తెలియజేయబడినది. తన కర్తవ్యము నందు తానుండుటయేగాని, చిల్లర విషయములం దాసక్తి గలవాడు మార్గము మళ్లి చిక్కులలో పడును.

రాముని ప్రశ్నకు సమాధానముగ ధర్మభృత్ మహర్షి ఇట్లు పలికెను.

"ఈ తటాకము పేరు పంచాప్సరము. ఇందుండి ఎప్పుడును సంగీత వాయిద్య ధ్వనులు వినబడుచూ నుండును. దీనిని మాండకర్ణి అను మహర్షి నిర్మించినాడు. అతడు పదివేల సంవత్సరములు తీవ్రమగు తపస్సుచేసి, అటుపై ఐదుగురు అప్సరసలు దర్శనమీయగ వారి అందచందములకు లోబడి తపస్సు విడిచి వారితో తాను నిర్మించిన ఈ తటాకములోపల రమించుచు నున్నాడు. తన తపో బలముతో ఏర్పరచుకొన్న తటాకమునందు తన తపస్సును భగ్నము చేయుటకై విచ్చేసిన అప్సరసలకు లోబడి క్రీడించుచు నున్నాడు. తటాకములోపల జరుగు నృత్యగానముల కోలాహలమే ప్రతిధ్వనించి వినబడుచున్నది."

పై వృత్తాంతము విని రామలక్ష్మణులు నిర్లిప్తముగ ముందుకు సాగిరి. ఇక ఆ సరస్సును గూర్చి ఎట్టి ప్రసక్తి వారు చేయలేదు. తమ కవసరమగు విషయము కాదని తెలియుటచే దానిని గూర్చి విచికిత్స చేయక, ధర్మభృత్ సమయమును వృథా కానీయక ముందుకు సాగినారు. ఆర్యు లనగా నిజముగ నిట్టివారే. అక్కరలేని విషయము

లందు ఊకను దంచినట్లుగ చర్చలు చేయుచు కాలము వృథా చేయు వారందరికిని రాముని ప్రవర్తనము ఒక చక్కని గీటురాయి.

పంచాప్సర సరోవరము మానవ శరీరమే. అందుండు ఐదుగురు అప్సరసలు పంచేంద్రియములే. అప్సరసలనగా సృష్టి యందలి తళుకు బెళుకులను దర్శింపజేయు ప్రజ్ఞలు. అవి అమితా కర్షణముగ నుండును. ఆకర్షణముగ కన్పట్టు విషయములను ఐదు ఇంద్రియములతో జీవుడు గ్రహించును. వినుట, చూచుట, రుచి చూచుట, స్పర్శించుట, వాసన చూచుట ఇత్యాదివి నిరంతరము సాగుచు నుండును. వీనికి లోబడి జీవు డింద్రియలోలుడై తనను తాను మరచి శరీర భోగమున మునిగి యుండును. అట్టివాడే మందుడు. అనగా బుద్ధి మందగించినవాడు. ఇంద్రియము లన్నిటి యందు ఉత్తమమైనది వినికిడి గల చెవి. విని లోబడుట మాంద్యము నకు గరిష్ఠస్థాయి. చూచి లోబడుటకన్న చెప్పుడు మాట విని లోబడుట వలన రావణుడు పతనము చెందినాడు. చెప్పుడు మాటవిని పెడ త్రోవను పట్టుట సర్వసామాన్యము. దానిని చెవిమాంద్య మందురు. మాండకర్ణి యనగా, వినుట మందగించినవాడు. అనగా బుద్ధి కోల్పోయినవాడు.

బుద్ధి కోల్పోవుట వలన జీవు డింద్రియ వ్యాపారములకు లోనై శరీరమున బంధింపబడుటయే మాండకర్ణి కథ. అట్టి వారి యందెట్టి ఆసక్తి లేనివాడు రాముడు. కనుకనే మారు పలుకక సీతా లక్ష్మణులతో వనమున పురోగమించినాడు.

# 11. ఋషి సాంగత్యము

శ్రీరాముని పదునాలుగు సంవత్సరముల వనవాస దీక్షలో పదమూడు సంవత్సరముల కాలము ఋషి సాంగత్యముననే గడచినవి. నిజమునకు మునులను, ఋషులను అనుగ్రహించుటకే వనవాసము దైవికముగ శ్రీరామునికి అబ్బినది. జన్మతః క్షత్రియుడే అయినను శ్రీరాముడు తపస్సు, దేవతారాధనము, ముని సాంగత్యము మిక్కుటముగ కోరినాడు. ఈ విషయమున సీతమ్మ దృక్పథము గూడ అట్టిదే. శ్రీరామ పట్టాభిషేకానంతరము కూడ సీతారాములు వన వాసము, మునిసాంగత్యమే కోరినారు. వారికి ఐహిక సుఖముల కన్న ఆముష్మిక తత్త్వమునందే ధ్యాస మెండుగ నుండెడిది.

బాల్యమున వశిష్ఠ మహర్షి ఆశ్రమమున, కౌమార మందు విశ్వామిత్ర మహర్షి సాంగత్యమున, అటుపైన గృహస్థుగ వనవాస మంతయు ఋషి సాంగత్యముననే జరిగినది. మునులు, ఋషులు వారి తపస్సులయందు అంతర్హితముగ ఏ పరదైవమును ఆశ్రయింప గోరిరో, ఆ పరదైవమే, ఆ బ్రహ్మమే రామబ్రహ్మమై రూపుగట్టుకొని, ప్రకృతి, కాలము సీతా లక్ష్మణులుగ వెంటరాగ, మునుల ననుగ్ర హించుటకు వనవాసము నిమిత్తమైనది. వనమందలి సజ్జనులకు శ్రీరామ దర్శనము అనుగ్రహింపబడెను. మునులకు ఋషీంద్రులకు దర్శనముతో పాటు, స్పర్శన భాషణములు కూడ అనుగ్రహింపబడెను. విశేషించి వారందరికిని సహవాసమును సంతర్పణము చేసిరి. ఇట్టి

విశేషమగు లీల మరి ఏ అవతారమందును నిర్వర్తింప బడలేదు. రామునితో రమించుటయే కైవల్యముగ ఋషులందరును పరితృప్తి చెందిరి.

సాధుల హృదయమన్న భగవంతునికి అత్యంత ప్రీతి. అందు వసించుటకే అతడిచ్ఛగించును. రామబ్రహ్మమునందు వసించుటకు ఋషు లిచ్ఛగించిరి. పది సంవత్సరముల పాటు శ్రీరాముడు దండక వనమున గల తేజోవంతులైన ఋషులతో వారి వారి ఆశ్రమము లందు వసించినాడు. ఆశ్రమ మండల మంతయు తన తేజస్సుతో నింపి రక్షణ కవచ మేర్పరచినాడు. దివ్య అనుగ్రహము, దివ్య రక్షణ దండకవనమున ఋషుల కనుగ్రహింప బడినది. ఋషులు కోరిన విధముగ వారి కభయ మిచ్చుటయే గాక విశేష సాన్నిధ్యమిచ్చెను. సహవాసము నెరపెను.

చక్రవర్తులైనను ఋషులను, మునులను, తపోజనులను సేవించుట, పూజించుట, పోషించుట, రక్షించుట నిర్వర్తింపవలెనని ప్రమాణము చూపెను. రామునికన్న మించిన రాజు లేడు. పాలకుల కథలే మార్గదర్శము.

# 12. విశిష్ట వివేకము

మహాత్ములు ఆరంభ పరిత్యాగులు. తామే సంకల్పింపక, కాలమును దేశమును బట్టి తారసపడిన కర్తవ్యములను నిర్వర్తించుచు నుందురు. దానివలన కర్మ క్షయమగును. నూతనముగ పర్యవసానము లేర్పడవు. నిర్వర్తించవలసిన కర్తవ్యములు నిర్వర్తించుచు జీవించుటయే గాని ప్రత్యేకమగు అభిలాష లుండవు. ఉత్సాహముండును గాని కుతూహల ముండదు. శ్రీరాముని చరిత్ర యంతయు ఇట్లే గోచరించును.

బాల్యమున వశిష్ఠాశ్రమమునకు విద్యాభ్యాసము కొరకై తలిదండ్రుల ఆదేశము మేరకు చనెను. విద్యానంతరము మరల అయోధ్యా నగరముచేరి మిన్నక యుండెను. విశ్వామిత్ర మహర్షి కోరిక మేరకు, తండ్రి ఆజ్ఞ మేరకు ఆ మహర్షి ననుసరించెను. అతడు తాటకను వధింపమని శాసించినపుడు అట్లొనర్చెను. మిథిలా పురమున ధనుస్సు నెక్కుపెట్టమని విశ్వామిత్రుడు కోరగ ఎక్కుపెట్టెను. పెద్దలు మైథిలి నిచ్చి వివాహము గావింతుమని పలికినపుడు తండ్రి యగు దశరథునితో సంప్రదింతుననెను. అట్లే వనవాసదీక్ష, పాదుకా పట్టాభిషేకము ఇత్యాదివి సాగినవి. తానుగ సంకల్పించిన వేమియు గోచరించవు.

అట్టి సర్వారంభ పరిత్యాగియగు రాముడు తానుగ కోరిన దొక్కటియే గోచరించును. అది అగస్త్యాశ్రమ దర్శన అభిలాష. వన

మందు రాముడు అనేకానేక ఆశ్రమములలో చరించు చున్నపుడు దండక వనముననే అగస్త్య మహర్షి ఆశ్రమమున్నదని మరల మరల వినుట జరిగినది. అసురుల నుండి ఋషులను రక్షించుట కర్తవ్యముగ పది సంవత్సరములపాటు ఋషుల ఆశ్రమమున వసించినాడు. అగస్త్యుని గూర్చి పదే పదే వినుట వలన రామునికి అంతః చేతనలో అగస్త్యుని చూడ అభిలాష కలిగినది. ఆ మహర్షిని దర్శించవలెనని, సేవించవలెనని, భాషింపవలెనని బలీయముగ తోచినది. అది కారణముగ తనకు కలిగిన భావమును సుతీక్ష్ణ ఋషిముందు వెల్లడించినాడు.

రాముని ఈ నడత మనకాదర్శము. యోగసాధకుడు సంకల్ప సన్యాసి అయి యుండవలెను. తనకై పూనుకొని చేయుట అనునది యోగి కుండదు. కాలమును దేశమును బట్టి సన్నివేశములందు ప్రతిస్పందించుటయే యుండును. కాని అంతఃచేతనయందు బలీయ ముగ ఒక భావము కలుగుచున్నపుడు, తరచు కలుగుచున్నపుడు పెద్దలను సంప్రదించవలెనని రాముని నడత తెలుపుచున్నది. శ్రీరాముడు తన అభిలాషను తెలిపిన వెనువెంటనే సుతీక్ష్ణుడు ఆనంద పడి తన హృదయమున కూడ అట్టి భావమే యున్నదని తేటతెల్లము చేసినాడు. ఋషులందరి హృదయములందు కూడ శ్రీరాముడు అగస్త్య మహర్షిని దర్శింపవలెనను అభిలాష యున్నది. వారందరు యోగు లగుటచే మిన్నకుండినారు. రాముడు ప్రకటింపగనే అందరి హృదయములు పొంగినవి.

ఆధునిక కాలమున యోగవిద్య మిక్కుటముగ ప్రచారములో నున్నది. కాని యోగజీవనము అతికొద్ది మందియే నిర్వర్తించుకొనుచు

నుందురు. రామాయణమున ఈ ఉదంతమునందు సంకల్ప సన్యాసము, అంతః సంకల్పమునకు పరిష్కారము రెండునూ తెలుపబడినవి. నిత్యము సంకల్పములతో సతమతమగు వారికి యోగము లేదు. సంకల్ప సన్యాసి శ్రీరాముడు కూడ అంతఃచేతనయందు సంకల్పము కలిగినపుడు తనకు తానుగ నిర్ణయించుకొనక, పెద్దలకు విన్నవించి, వారి నిర్ణయానుసారము నిర్వర్తించినాడు. యోగ జీవనము అత్యుత్తమము, అతి సున్నితము, అతి సుందరమైన జీవనము.

# 13. ఉపాయము

మానవునకు నిరంతరము భావనలు కలుగుచు నుండును. అందెక్కువ భాగము నిత్యనైమిత్తికములు. అపుడపుడు విశేష భావములు కలుగుచుండును. అనగ తరచు కలుగు భావములు కాక, కాలము పరిస్థితులతో సంబంధము లేక అపుడపుడు కొన్ని భావములు కలుగుచుండును. బుద్ధిమంతులు వీనిని గ్రహించి, వివేకించి సద్విషయములైనపుడు వెంటనే ఆచరించుటకు ప్రయత్నించ వలెను. దానివలన విశేషమగు అనుభవము, అనుగ్రహము కలుగును.

ఒక్కొక్కమారు భగవద్గీతాది సంద్గ్రంథములు పఠించవలెనని భావములు కలుగవచ్చును. అట్లే స్తోత్రములను, సూక్తములను లేక పద్యములను కంఠోపాఠము చేయవలె ననిపించవచ్చును. లేదా పరిసరములనున్న సత్పురుషునొకని దర్శింపవలెనని భావన కలుగ వచ్చును. ఇట్టి భావములను అతి శీఘ్రముగ ఆచరణయందుంచుట శ్రేష్ఠమే కాక క్షేమంకరము కూడ. అట్లే పుణ్యతీర్థములు, పుణ్య క్షేత్రములు యాత్ర చేయుట కూడ. సద్భావములు మనకు కలిగినవే కాని మనము సంకల్పించుకొనినవి కావు. అట్లు కలుగగనే పెద్దలను సంప్రదించి ఆచరించుట మేలు. కాలము ననుసరించి జీవుని క్షేమముకై ప్రకృతి కలిగించినవే అట్టి భావములు. వాటి నశ్రద్ధ చేయరాదు. అశ్రద్ధ చేయక నిర్వర్తించినపుడు, కలుగబోవు కొన్ని కష్టనష్టములు హరింపబడును. కొంత అదృష్టము కలిసివచ్చును.

మాతృమూర్తియైన ప్రకృతి జీవుల క్షేమమునెరిగి కొన్ని సద్భావములను స్ఫురణకు గొనివచ్చును. అట్టివాటిని విచికిత్సకు బలిచేయక ఆచరించు టయే మేలు.

ఉదాహరణకు దూరదేశమున నున్న సంతానమునకు బలీయ ముగ తల్లినో, తండ్రినో చూడవలె ననిపించినపుడు వెనువెంటనే చనుట మేలు. అట్లు కానపుడు మరణవార్త వినుట, ఆపై స్ఫురణ కలిగినను చూడలేకపోతినే అని బాధపడుట ఇత్యాదివి మిగులును.

శ్రీరామునికి అగస్త్య మహర్షిని చూడవలెను అని అనిపించి నపుడు వెనువెంటనే అచటనేయున్న అగస్త్యుని శిష్యుడగు సుతీక్ష్ణునికి తెలిపెను. సుతీక్ష్ణుడు కూడ రామునితో "కించిత్ ఆలస్యము కూడ చేయక శీఘ్రమే చనుమని" ప్రోత్సహించినాడు. "అగస్త్యుని చూడవలె నని బుద్ధి పుట్టినది గనుక ఇక ఏ మాత్రము ఆలస్యము చేయక ఇపుడే బయలుదేరుమని" హెచ్చరించినాడు.

# 14. ఏకోపాయము

మానవులు సామాన్యముగ అర్థకామములచే నడిపింప బడుతుంటారు. సుఖము కొరకు అర్థకామములను సమర్పించుకొనే ప్రయత్నంలో ఉంటారు. అర్థమువల్ల తమకు గల కోరికలను అనుభవించ వచ్చు. కామమునకు అర్థము మూలమని భావించి మానవులర్థార్థులై తీరుబడిలేక శ్రమపడుతు, మరణిస్తూ మరల పుడుతుంటారు. అర్థము కొరకై అర్థించుటలో నిపుణతను సంపాదించు కుంటారు. అర్థ సముపార్జనకు ఉచ్చనీచములను కూడ మరుస్తారు. అర్థమందాసక్తి ఎందులకని ప్రశ్నించినచో, కామ పరితృప్తికై అర్థమావశ్యకమని తెలుపుతారు. అరకొరగ కోరికలు సమకూరినను సుఖము లభింపదు. సుఖము కోసము అర్థకామముల నాశ్రయించుట కరుడు గట్టిన అజ్ఞానము. అర్థము నుండి గాని, కామము నుండి గాని సుఖము లభింపదు.

సుఖపడుటకు మార్గమొక్కటియే పెద్దలు నిశ్చయించి చెప్పినారు. అది ధర్మాచరణము. ధర్మము వల్లనే ఇహపరములందు సౌఖ్యము లభించును. ధర్మమాధారముగనే జననమరణ వలయము నుండి మోక్షము గూడ లభించును. ధర్మమును వదిలినవాడు కష్టనష్టములకు గురియగుట తప్పదు. ధర్మము నాశ్రయించినవారికి కష్టము కష్ట మనిపించదు. నష్టము నష్టమనిపించదు. ధర్మాచరణమే సుఖానుభూతి

నిచ్చును. ధర్మము వదిలిన వారికే కష్టనష్టాదులు, తదనురూపమైన భయము ఉండును.

లోకమందలి ద్వంద్వములను కేవలము ధర్మపరుడే దాట గలడు. ఇతరులు దాటలేరు. ఈ జగత్తంతటికి ధర్మమే మూలము. అందువలన సమర్థులగువారు ధర్మము నాశ్రయించిరిగాని, ధనమును కామమును పదవిని కీర్తిని ఆశించలేదు, ఆశ్రయించనూ లేదు.

"ధనం మూల మిదం జగత్" అనునది మ్లేచ్ఛుల సూక్తి. *"ధర్మమూల మిదం జగత్"* అనునది ఋషుల సూక్తి. ధర్మము సంపాదించుకొనుటకై ఋషులు అనేకానేక నియమములు పాటించిరి. వ్రతముల నాచరించిరి. ఉపవాసాదులు కూడ చేసిరి. ధర్మము కొరకై దేహత్యాగమును కూడ చేసిరి. ధనత్యాగము, పదవీత్యాగము ఇక చెప్పనవసరము లేదు. జన్మమున కర్థము ధర్మాచరణమే అనునది ఋషివాక్యము. ధర్మాచరణమిచ్చు సుఖము ఏ భోగములనుండియు పొందలేము. ఈ సత్యము తెలిసిన జీవుడు కృతార్థుడు కాగలడు. అర్థకామములకై పతనము చెందడు. ఎందరో మహానుభావులు ధర్మము నాచరించి తరించినారు. వారందరికి సీతారాములు తలమానికమగు పుణ్యదంపతి.

# 15. అగస్త్య ప్రశంస

రామాయణమందు అగస్త్య ప్రశంస విశేషమై గోచరించును. శ్రీరాముని భాషణముగ ఈ ప్రశంస వాల్మీకి మహర్షి రచనము గావించినాడు. సత్యవాక్కు గలవారే ఋషులు. కనుక వాల్మీకి మహర్షి రచించిన ప్రశంస నిక్కముగ రాముని భాషణమే. అతని ప్రశంసయే. భరద్వాజ మహర్షి ఆదిగ శ్రీరాముడు ఎందరో ఋషులను వన వాసమున సందర్శించి చివరకు అగస్త్య మహర్షిని దర్శించినట్లుగ శ్రీమద్రామాయణము తెలుపుచున్నది.

అగస్త్య మహర్షి మహర్షులకే మహర్షి. సాక్షాత్తు శివస్వరూపుడు. అతనిని ఋషులు కూడ భగవంతునిగ కీర్తింతురు. అనేక సందర్భము లలో సృష్టి సంకటమున పడినపుడు రక్షించిన వాడాయన. అట్టి అగస్త్య మహర్షిని శ్రీరామచంద్రుడు, సీతా లక్ష్మణులతో సందర్శించి నాడు. మరల శ్రీకృష్ణుడుగ భూమిపై చరించినపుడు కూడ ఆ మహర్షిని ప్రత్యేకముగ సందర్శించినాడు. అతనిని గూర్చి రాముడు పలికిన పలుకులు పాఠకులు స్మరించుట వలన అనుగ్రహపాత్రులు కాగలరు. శ్రీరాముడు ఇతర ఋషుల నెవ్వరిని అగస్త్యుని ప్రశంసించినట్లుగ ప్రశంసించలేదు. కనుక రాముని ఋషి ప్రశంస ప్రత్యేకముగ గమనింపవలసి యున్నది. అగస్త్య మహర్షిని గూర్చి రాముని ప్రశంస ఈ విధముగ నున్నది.

1. అగస్త్యుడు మృత్యువును నిగ్రహించిన మహర్షి.

2. లోకములకు మేలు చేయవలెనను ఉద్దేశ్యముతోనే అతడు శరీరధారియై భూమిపై వసించి యున్నాడు.

3. దక్షిణ దేశమును గూడ నివాసయోగ్యము చేసిన మహర్షి యతడు.

4. అగస్త్య మహర్షి దక్షిణవాసము కారణముగ అసురులు దక్షిణ దిక్కును వీడినారు. వారికి దక్షిణ దిక్కు భయావహమై పోయినది.

5. అదుపులేకుండ పెరుగుచున్న వింధ్య పర్వతమును "ఇక పెరగవద్దు!" అని అగస్త్య మహర్షి శాసించినాడు. వింధ్య ఇక పెరగ లేదు. కనుక ఈ మహర్షిని అగస్త్యుడని దేవతలు కీర్తించినారు.

6. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, పరమ ఋషులు ఆహారాన్ని నిగ్రహించి అగస్త్యమహర్షిని ఉపాసిస్తూ ఉంటారు.

7. అబద్ధాలు చెప్పేవారు గాని, వంచకులు గాని, విశ్వాస ఘాతకులు గాని, క్రూరుడు కాని, శాస్త్ర నియమాలు పాటింపని వాడుగాని అగస్త్య మహర్షి సమక్షమున బ్రతుకలేడు.

8. భూలోకంలో అగస్త్య మహర్షి యంతటి ప్రసిద్ధ కర్ముడు మరియొకడు లేడు.

9. అగస్త్య మహర్షి చిరంజీవి.

10. అగస్త్యాశ్రమంలో దేవతలు, యక్షులు, నాగులు మొదలైన

వారేకాకుండ పశువులు, పక్షులు కూడ ధర్మాన్ని పాటిస్తూ ఉంటాయి. నియతాహారముతో నివసిస్తూ ఉంటాయి.

11. అగస్త్యాశ్రమమును చేరి మహర్షులు సైతము సూర్య సమాన కాంతితో కల నూతన దేహములను ధరించి, రక్తమాంసాదులతో కూడిన దేహమును త్యజించి దివ్యలోకాలకు పోతూ ఉంటారు.

12. అగస్త్య సాన్నిధ్యంలో ఆరాధనలు చేయుచున్న మునుల ననేకమందిని దేవతలు అనుగ్రహించి అనేకానేక వరముల నిచ్చినారు.

13. అగస్త్య మహర్షి సాక్షాత్తు బ్రహ్మమే. భగవంతుడే. అయినను విధి విధానముగ ధ్యానము తపస్సులతో పాటు దేవతారాధనను కూడ ఆశ్రమమందు నిర్వహిస్తూ ఉంటాడు.

14. అగస్త్యాశ్రమమందు సమస్త జీవులు సామరస్యంతో మెలుగుతుంటాయి. క్రూరజంతువులు సైతము క్రూరత్వాన్ని త్యజిస్తాయి. పంచభూతములు తపస్సున కనుకూలముగ వర్తిస్తాయి. ఋతువులు ఆహ్లాదంగా ఉంటాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఆరాధనా పీఠాలు, హోమగుండాలు దివ్యకాంతితో తేజరిల్లుతుంటాయి. అన్ని జీవులకు ఆహారము పరిపుష్టమై ఉంటుంది. అందరు యమ నియమములతో కూడి ఉంటారు.

15. అగస్త్యాశ్రమంలో పదునెనిమిది ఆరాధనా పీఠములు, హోమగుండములు ఉంటాయి. దేవతల నందరి నుద్దేశించి నిత్యారాధన, హోమములు జరుపబడుతుంటాయి. అగస్త్యపీఠంలో

గోచరించే దేవతాపీఠములు, హోమగుండములు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. అగ్ని, 2. విష్ణువు, 3. బ్రహ్మ, 4. ఇంద్రుడు, 5. సూర్యుడు, 6. చంద్రుడు, 7. భగుడు, 8. కుబేరుడు, 9. ధాత, 10. విధాత, 11. వాయువు, 12. శేషుడు, 13. అనంతుడు, 14. వశువు, 15. వరుణుడు, 16. గాయత్రి, 17. కార్తికేయుడు, 18. ధర్ముడు (యముడు).

# 16. రసక్రీడ

దండక వనమున, ఋషుల ఆశ్రమములందు పది సంవత్సరముల కాలము సీతాలక్ష్మణ సమేతుడై శ్రీరామచంద్రుడు సంచరించినాడు. అనేకానేకములగు సద్గోష్ఠులు జరిగినవి. మునుల సాన్నిధ్యమున రామబృందము పులకించినది. ఋషులును రామసాన్నిధ్యమున పులకితులైనారు. ఋషులందరికిని శ్రీరాముడు పరంధాముడని తెలియదు. కాలము లక్ష్మణునిగ, ప్రకృతి సీతామాతగ, పరంధాముడగు దైవము రాముడై ఋషులకు సాన్నిధ్యమిచ్చి వారిని తరింపజేసినాడు. ఋషులు దండకమున రాముని రాకకై దీర్ఘకాలము నుండి తపస్సు చేయుచు ఎదురుచూచుచు నుండిరి. దైవము రామునిగ ఏతెంచి సాన్నిధ్య మిచ్చునని గురుపరంపరాగతముగ ఎరిగిన ఋషులు దండకవనమున అనేకానేక సంవత్సరములు తపస్సు చేయుచు నుండిరి. వారందరును తపస్సిద్ధులగుటచే సంకల్ప మాత్రమున దేహములు త్యజించి దివ్యదేహములతో సత్యలోకమును, వైకుంఠమును చేరగల ధీమంతులు. కాని పరమే ఇహమునకు అతి సుందరముగ రూపుకట్టుకొని వచ్చునని, మునులకు ఋషులకు సాన్నిధ్యమిచ్చి ఆదరించునని, స్పర్శన భాషణాదులు అనుగ్రహించునని తెలిసిన పిమ్మట, వారందరును ఉపవాసముచే, తపస్సుచే కృశించిన దేహములందే యుండుటకు సిద్ధపడినారు. రామ దర్శన, స్పర్శన, భాషణ అనంతరమే పరమున కేగవచ్చని కృతనిశ్చయులై, దేహములు

కృశించినను ఆ దేహములనే ఉపాధిగ అంటిపెట్టుకొని యున్నారు. వారి భక్తి, దర్శనాభిలాష వర్ణనాతీతము. వారందరికిని రాముడే ఇహపరదైవము. వైకుంఠమే దిగివచ్చి సమీపించినపుడు తాము వైకుంఠము పోనేల? రాముడుండు చోటునే వైకుంఠముండును. వైకుంఠము రామునివీడి, విడిగా నుండజాలదు. రాముడే వైభవము. రాముడు భూమిపై నడయాడుచుండగ తాము వైకుంఠమున కేగుట అవివేకము.

అట్టి ధీమంతులగు ఋషుల హృదయములను లాలించి పాలించుటకే శ్రీరామచంద్రుడు పదునాలుగు సంవత్సరముల వనవాస కాలములో పది సంవత్సరములు ఋషులనడుమ కాలము, ప్రకృతి తోడుగ క్రీడించెను. దైవమునకు భక్తుల హృదయమే ఆనందమునిచ్చు నివాస స్థానము. ఋషుల సహవాసమున జరిగిన వనవాసము ఋషులందరికిని శాశ్వత పరమపద నివేశమును అనుగ్రహించినది. ఇది ఒక రసక్రీడ. రసస్వరూపుడు రాముడు. క్రీడించినవారు ఋషులు.

# 17. దైవ ఘటన

శ్రీరాముని హృదయమున అగస్త్యమహర్షిని చూడవలెనను సంకల్పము కలిగెను. ఋషుల హృదయమున కూడ అట్టి సంకల్పము పూర్వమే ఏర్పడి యున్నది. సుతీక్ష్ణుని హృదయమున కూడ ప్రగాఢముగ అట్టి సంకల్పమే యున్నది. విచిత్రమేమనగ అగస్త్య మహర్షి హృదయ మునకూడ శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై వేంచేయునని సుస్పష్టముగ యున్నది. కాని శ్రీరాముడు వ్యక్తపరుచు నంతవరకు ఋషులెవ్వరును ఈ ప్రస్తావన చేయలేదు. కాలము తీరెరిగినవారు ఋషులు. తగిన సమయము వచ్చువరకు వేచియుండ గలవారు ఋషులు. తమకై తాము తొందరపడనివారు ఋషులు. జగన్నాటక మున ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగవలెనో దైవమే నిర్ణయించునని తెలిసి నిబ్బరముగ జీవించువారు ఋషులు. వారందరును కార్యోన్ముఖులే. అప్రమత్తులే. కాని నిబ్బరముతో వేచి యుండువారు. జగత్కర్మ కాలము ననుసరించియే జరుగునని, కాలమునకు ముందు వెనుకలు లేవని, కాలమే దైవమని ఋషులందరు వేచియుండగ, కాలము జగత్కర్మ కలిసిరాగ, రాముని నుండి జగత్కళ్యాణము నిర్వర్తింపబడుటకై దివ్య సంకల్పము అతని యందు పశ్యంతిగ భాసించి, మధ్యమగ వికసించి, వైఖరిగ వ్యక్తమైనది. దైవఘటన ఇట్లుండును. అది సకాలమున వ్యక్తమై వడివడిగ నిర్వర్తింపబడును. అవరోధములు, ఆటంకములు, అడ్డంకులు యుండవు. కాల

మనుగ్రహించినపుడు ఇక ఎవ్వరును ఘటనను ఆపలేరు. కనుకనే రాముని సంకల్పమునకు సద్యోసిద్ధి కలిగెను. అనగా కాలము, ప్రకృతి తోడ్పడి అగస్త్యాశ్రమమునకు చేరు యత్నము అనాయాసమై నిలచినది. కాలమును దేశమును ఎరిగి దివ్య సంకల్పము వ్యక్తమగుటయే దైవ ఘటన. దైవఘటన జీవన ప్రయాణమునకు ఒక క్రొత్త మలుపు నిచ్చును. శుభపరిణామము కలిగించును. అందుకు ఋషులు సహాయ కారులుగ నిలుతురు. వారు కాలజ్ఞులగుటచే వేచియుందురు గాని త్వరపడరు. వదలరు. ముందుగ తెలిసినను సమయము కానపుడు వ్యర్థ భాషణము చేయరు.

అగస్త్యాశ్రమ సందర్శనమే రావణ సంహారమునకు నాంది. అగస్త్యుడు సాధనముగ శ్రీరాముని జీవన ప్రయోజనము వైపునకు కాలము దారి చూపెను.

# 18. ధర్మ రహస్యము

సత్పురుషులు కర్తవ్య నిర్వహణమునందే నిమగ్నమై యుందురు. అట్టి కర్మ నిర్వహణమున ధర్మము నాశ్రయించి యుందురు. కర్మము, ధర్మము నావకు రెండు తెడ్లవలె వినియోగ పడుచు, కాల ప్రవాహమున జీవనము సాగుచు నుండును. వేరొక సంకల్పము లేక అందివచ్చు కర్తవ్యమునే ధర్మముతో కూడి నిర్వర్తించు చుండుట వారి లక్షణము. ఇట్టి వారి నుండే క్రమముగ దివ్య సంకల్పములు నిర్వర్తింపబడును. ధర్మజీవనమే ఆశయముగ జీవితము సాగును గాని ప్రత్యేకమైన ఆశలు, కోరికలు యుండవు.

శ్రీరాముని జీవితము ధర్మ, కర్మ ఆచరణముగనే సాగుట శ్రద్ధాళువులు గమనింపవలసిన విషయము. అతడేదియును ఆశించలేదు. దేనిని గూర్చి ఆశపడలేదు. కాలక్రమమున తన వద్ద కేతెంచిన కార్యములలో కర్తవ్యము నెరిగి నిర్వర్తించినాడు. నిర్వర్తించు టలో ధర్మమును పరిపూర్ణముగ ఆశ్రయించినాడు. వనములలో ఋష్యాశ్రమ ప్రాంతములలో పది సంవత్సరములు తిరుగాడుటలో ఋషులకు రక్షణ నొసగినాడు. తాను జన్మతః క్షత్రియుడగుటచే వనవాసుల రక్షణ భారము తన కర్తవ్యమని ఎరిగి నిర్వర్తించినాడు.

శ్రీరాముడు అగస్త్యాశ్రమమును సందర్శించుటకు ప్రత్యేక కారణమేమియు లేదు. గురుజన దర్శనము, సేవనము సత్పురుషుల సంస్కారము. మహాత్ములను దర్శించుట, భాషించుట, వారి సాన్నిధ్య

మున అవకాశమును బట్టి వసించుట జీవ సంస్కారమును అప్రయత్న ముగ పెంచును. అయస్కాంత సన్నిధి నున్న ఇనుము ఎట్లయిస్కాంతీ కరించబడునో, అట్లు సాన్నిధ్యము జీవులను ప్రభావితము చేయును. ప్రమేయము లేకయే ప్రభావము చూపును. శ్రీరాముని సంకల్పము కేవలము సత్పురుష సాంగత్యముననే వ్యక్తమైనది.

కాని దైవసంకల్పము తోడై అగస్త్య దర్శనము అనుగ్రహమై భాసించినది. తలవని తలంపుగ శ్రీరామునికి రాక్షస సంహారమున కుపకరించెను. దివ్య ధనుస్సు, అక్షయ సాయకాలు ఉన్న రెండు తూణీరాలు, ఒక దివ్య ఖడ్గము లభించినవి. కోరకయే లభించిన దివ్యాయుధము లవి. ధనుస్సు శ్రీ మహావిష్ణువుది. అత్యంత ప్రభావితము కలది. ఆ ధనుస్సునకు బంగారము తొడుగు, రత్నములు అలంకరింపబడి యున్నవి. అక్షయ తూణీరములు కూడ ధనుస్సుతో పాటుగ శ్రీమహావిష్ణువు రాక్షస సంహారమునకు వినియోగించినాడు. అట్లే ఖడ్గము కూడ అపురూపము దివ్యము అయినటువంటిది. బంగారు పిడితో నున్నది. అది దేవేంద్రుని ఖడ్గము. సత్పురుషులను దర్శించినపుడు కోరికలు గలవారికి కోరికలు ఫలించును. కోరికలు లేనివారికి అనుగ్రహము లభించును. అనుగ్రహము జీవుని పరిపక్వతకు తోడ్పడును. శ్రీరాముడు నిర్వర్తించవలసిన అసామాన్య మగు రాక్షస సంహారమునకు వలసిన దివ్యాయుధములు అతడు కోరకయే లభించుట సృష్టి రహస్యములలో నొకటి.

నిజమునకు రాక్షస సంహారమునకు వలసిన ఆయుధములను గూర్చి రాముడెన్నడును తలపోయనే లేదు. తాను ధర్మమున నిలచి, కర్తవ్యమును నిర్వర్తించుట యందు అప్రమత్తుడై యున్నపుడు ధర్మమే

తనను రక్షించునను ధీరత్వము కూడ యుండవలెనని రాముని నడక బోధించు చున్నది. ధర్మమునకు కూడ కర్తవ్యమున్నది. ధర్మాత్ముని రక్షించుకొనవలసిన బాధ్యత ధర్మమునదే. కనుక ఆయుధములను గూర్చి, కవచములను గూర్చి, వాహనములను గూర్చి ఆలోచించుట, సమకూర్చుకొనుట వంటివి ధర్మాత్మునకు అవసరము కాదు. "ధర్మో రక్షతి రక్షితః". దీనిని నిశ్చయముగ నిర్వర్తించి చూపినవాడు శ్రీరాముడు. కనుక అతడే ధర్మ విగ్రహుడు.

# 19. అగస్త్య సందర్శనము

బ్రహ్మర్షి, సాక్షాత్ భగవత్ స్వరూపుడు అగు అగస్త్య మహర్షి శ్రీరాముని చూచుటకై శిష్యులతో కూడి హుటాహుటిని అత్యంత ప్రేమతో, కుతూహలముతో వడివడిగ ముందుకు సాగినాడు. శ్రీరాముని చూడవలెనని ఉత్కంఠ అమితము కాసాగినది. సీతారామ లక్ష్మణులు సర్వలోకములందు పూజనీయులు. శ్రీరాముడు నర రూపము ధరించిన పరతత్త్వము. సీతమ్మ శ్రీమహాలక్ష్మియే. పరా ప్రకృతియే. లక్ష్మణుడు కాలమూర్తి. పరమే ప్రకృతి కాలములతో కూడి అగస్త్యాశ్రమము చేరుట అననేమో తెలిసినవాడు అగస్త్య మహర్షి. అది అపురూపము, అపూర్వమగు సంఘటన. భూత భవిష్యత్తులందు నిర్వర్తింపబడ వీలులేనిది. అగస్త్యాశ్రమమునకు అదియొక అద్భుత సంఘటనగ అగస్త్యమహర్షి భావించినాడు.

అగస్త్యునకు రాముడు పరుడే అని తెలియును. నరుడై సంచరించుచున్న నారాయణుడని తెలియును. కేవలము తన ననుగ్రహించుటకే ప్రకృతి, కాలము వెంటరాగ, తన ఆశ్రమ ప్రవేశము చేసినాడు. కనుకనే స్వభావమున తొట్రుపాటులేని బ్రహ్మర్షి సీతారామ లక్ష్మణుల ఆగమనమునకు హృదయమున పొంగి, వారిని తన అనుచరులు సరాసరి లోనికేల కొనిరాలేదని, వారత్యంత పూజనీయు లని, హుటాహుటిని ఆసనము నుండి లేచి అనుయాయులతో ముందుకు సాగగా, అనుయాయు లందరును సంభ్రాంతులైరి.

ఎదురుగ సాగివచ్చుచున్న అగస్త్య బ్రహ్మమును రామబ్రహ్మము చూచినాడు. ప్రదీప్తమగు బ్రహ్మర్షి తేజస్సును చూచి పరమానంద భరితుడై వెంటనే తమ్ముని హెచ్చరిక చేసినాడు. అగస్త్య మహర్షి రాముని చూచి పొందిన ఆనందము, శ్రీరాము డగస్త్యుని చూచి పొందిన ఆనందము వర్ణనాతీతము. ఇరువురును బ్రహ్మానందభరితులై ఒకరినొకరు చేరవచ్చు చుండగ అప్రమత్తుడైన ధర్మమూర్తియగు రాముడు వడివడిగ అగస్త్యుని చేరి అతడి రెండు పాదములను, రెండుచేతులలో పట్టుకొని మనసారా నమస్కారము చేసినాడు. సూర్యవంశమునకే మకుటాయమానమగు శ్రీరామచంద్రుడు, రఘుకులమునకే రత్నదీపము వంటి రాముడు పాదములు పట్టి నమస్కరించు చుండగ సూర్యతేజమే రూపముగట్టి నిలుచున్నట్లుగ అగస్త్యుడు నిలబడి యున్నాడు. ఇది వాల్మీకి మహర్షి దర్శనము. ఇందు రాముని తేజము, అగస్త్యుని తేజముగ చూపరులకు గోచరించు నది ఒకే బ్రహ్మతేజము. ఇరు రూపములందున్నది ఒకే తేజము. ఒకే తత్త్వము. ఒకటి రెండుగ నేర్పడి ఒకదానినొకటి చూచి పరమా నందభరితమై నిలచినది. సృష్టియందిట్టి ఘట్టములు అరుదుగ సంభవించును.

# 20. శ్రీరామ - అగస్త్య సమాగమము

అగస్త్య మహర్షి భావనతో శ్రీరాముని మనస్సు నిండుటయే గాక అతని దర్శనాపేక్షచే బాగుగ పొంగసాగినది. అగస్త్యునివంటి ప్రసిద్ధ కర్ముడు మరియొకడు లేడని, అట్టివానిని దర్శించు చున్నానని రాముని హృదయము పొంగసాగినది. అగస్త్యునివలె సృష్టియందు విపత్తులు పరిష్కరించిన మహర్షి మరియొకడు లేడని, అతను వాతాపి ఇల్వలులను దమించుట, వింధ్య గర్వము నణచుట, సముద్రజలముల నన్నింటిని ఔపోసన పట్టుట, తన సహధర్మచారిణిని తానే సృష్టించు కొనుట, తన కుమారుల నిద్దరిని హరిహరులకు సమర్పించుట– ఇత్యాది కృత్యములు అనితర సాధ్యములు. అగస్త్యున కగస్త్యుడే సాటి. అట్టి మహాత్ముని దర్శించుచున్నానన్న భావమే ఆనందభరితమై వనవాస శ్రమ గూడ మరపునకు వచ్చినది.

ఇంతగ శ్రీరాముడు పొంగిన సందర్భము మరియొకటి గోచరింపదు. అతడెంతగ పొంగినా డనగ, "తమ్ముడా! నే నగస్త్య మహర్షి నారాధిస్తూ, మిగతా వనవాస కాలమంతము గడపదలచి నాను" అని పలికినాడు. ఇచ్చట ఆశ్రమవాసులు సామాన్యులు కారు. ఇందు దేవతలున్నారు, గంధర్వులున్నారు, సిద్ధులున్నారు, పరమఋషు లున్నారు. అగస్త్య సాంగత్యమున వీరందరును అధికముగ తపస్సునందే నిమగ్నులైనారు. వీరు అగస్త్యునే ప్రత్యక్ష బ్రహ్మముగ

ఉపాసించు చున్నారు. ఈ ఆశ్రమమున యుండుట పరమ పదమున నుండుట వంటిదే అని తలపోసినాడు.

అగస్త్యుని చూడబోవు రాముని భావమిట్లుండగ, రాముని చూడబోవు అగస్త్యుని భావము కూడ తత్తుల్యముగనే యున్నది. అగస్త్యమహర్షికి శ్రీరాముడు కేవలము ధర్మము ననుసరించు క్షత్రియుడు కాదు. కేవలము భూమిపై రాజు కాదు. అతనికి శ్రీరాము డనగ సమస్తలోకములు పరిపాలించు శ్రీమహావిష్ణువే. కనుకనే "రామా! నీవు సమస్త లోకాలకున్నూ ప్రభువై యున్నావు. ధార్మికు లందరిలో పరమ ధార్మికునిగ వెలుగొందు చున్నావు" అని పలికినాడు. అంతేకాక శ్రీమహావిష్ణువు యొక్క దివ్యమగు ధనుస్సు ఉత్తమ శరములతో సహా, తూణీరములతో సహా శ్రీరామునికి ఆతురతతో, ఆనందభరిత హృదయముతో సమర్పించినాడు. దేవేంద్రుడిచ్చిన వజ్ర సమానమగు ఖడ్గమును బంగారు పిడితోను, వరతోను కూడిన దానిని రాముని కిచ్చినాడు. తద్వారా రాబోవు కాలమున అసుర సంహారము నకు వలయు దివ్యాస్త్రములను ముందుగనే సమర్పించినాడు. సున్నితముగ రామునికి రాక్షస సంహారము కర్తవ్యమై యున్నదని, తపస్సునకిది సమయము కాదని హెచ్చరిక గావించినాడు.

# 21. విధి

విధి విధానమును తెలియుట అసాధ్యము. జరిగిన వెనుక ఇట్లు జరిగినదని చెప్పుకొనవచ్చును. అట్లెందుకు జరిగినదో విచికిత్స చేయవచ్చును. కాని జరుగుచున్నపుడు ఎవ్వరును తెలియజాలరు. సమర్థించుకొనుటకు, ప్రశంసించుటకు జరిగిన వెనుక పాత్ర ధారులకు ముందే తెలియునని పండితులు సిద్ధాంతీకరణము చేయుదురు. వెంటనే మరియొక వర్గము వారు ఆ సిద్ధాంతమును తిరస్కరింతురు. జరుగుచున్నప్పుడు పాత్రధారులకు తెలియుట అంతంత మాత్రముగనే యుండును. తామొకటి తలచిన దైవము మరియొకటి తలచునను వాక్యము నిత్యసత్యమై జీవుల జీవితమున గోచరించును.

అగస్త్యాశ్రమమును ప్రవేశించబోవు శ్రీరాముడు తమ్ముడగు లక్ష్మణునితో "నేను అగస్త్యమహర్షిని ఆరాధిస్తూ, మిగిలిన వనవాస కాలము అంతా ఈ ఆశ్రమములో గడప దలచినాను" అని పలికి నాడు. ఆశ్రమమును ప్రవేశించి అగస్త్యమహర్షిని దర్శించి, నమస్క రించి అతనిచే ప్రశంస లందుకొనినాడు. అతిథిగ పూజింపబడినాడు కూడ. అటుపైన విష్ణు ధనుస్సును, తూణీరములను బ్రహ్మదేవుని శరమును, ఇంద్రుని ఖడ్గమును కూడ పొందినాడు. అగస్త్యమహర్షి కూడ సీతారామ లక్ష్మణులను తన ఆశ్రమమునందే ఉండవలసినదిగ తెలిపినాడు.

రాముని భావము, అగస్త్యుని భావము ఒకటియై నిలచినది. అగస్త్యాశ్రమమునందే యుండవలెనని రాముడు భావించెను. తన ఆశ్రమమునందే యుండుమని అగస్త్యుడు కోరెను.

ఇంతలో రాముని మనసున మరియొక సంకల్పము చోటుచేసు కొన్నది. అతడు తటాలున "నేను మరి ఎక్కడనైన ఆశ్రమ పథము ఏర్పరచుకొని ఏకాగ్రచిత్తముతో సుఖముగ ఉండవలె ననుకొను చున్నాను. జలసమృద్ధము, వనసమృద్ధము అయిన ప్రదేశమేదైన నాకు సెలవివ్వండి" అని పలికినాడు. ఇది దైవ ఘటన. ఇదియే విధి. విధియే రాముని నుండి పలికినది. రామావతార ప్రయోజనమే ఆది నుండి రాముని నడిపించినది. తానుగ సంకల్పము చేయని రాముని నుండి తటాలున వ్యక్తమై పంచవటి వాసమునకు మార్గ మేర్పరచినది.

రాముడు కోరినదే అగస్త్యుడు కూడ కోరినాడు. కాని రాముని నుండి మరియొక సంకల్పము వెలువడినది. వెంటనే మహర్షియగు అగస్త్యుడు అందలి ఆంతర్యము నెరిగి పంచవటికి దారిచూపెను. దివ్య సంకల్పము మరియొక విధముగ నుండునని గుర్తించిన మహర్షి, ఆ సంకల్పమునకు అనుగుణముగ వర్తించెను. సత్పురుషులను, ధర్మాత్ములను దైవము వారి జీవన ప్రయోజనము పరిపూర్ణము అగుటకు వలచిన రీతిగ నడిపించునని ఈ ఘట్టము మరల తెలియ జేయును. శ్రీరాముని కథయందు కైకేయి వరమొక మలుపు. అగస్త్య మహర్షి సూచన మరియొక మలుపు. రెండును రామావతార ప్రయో జనమునకే నిర్వర్తింపబడినవి. ఇందు కైకేయి చేసినది ఆమె వశమున లేక జరిగినది. అగస్త్య మహర్షి నిర్వర్తించినది దైవ సంకల్పము నెరిగి చేసినది. విధివిధానము విడ్డూరముగనే యుండును.

# 22. అంతరాత్మ

సత్పురుషులు అంతఃకరణ పరిశుద్ధులు. లోకమున సత్పురుషులుగ కొనియాడబడు వారలలో అరుదుగ అంతఃకరణ పరిశుద్ధత కలవారై యుందురు. బహిరంగమున సమాజము కొరకై సదాచారము పాటించు చున్నను, అంతరంగము అమలముగ నుండుట సాధారణముగ సాధ్యపడని విషయము. అంతరంగమందు ఈర్ష్యాసూయలు, రాగద్వేషములు, కామక్రోధములు, పరదారాభిలాష, పరధనాభిలాషల వంటి భావములు కలిగియుండి, బహిరంగమున సదాచార వేషణము భాషణము పైపూతలుగ, మైపూతలుగ పులుము కొని తిరుగాడువారు ఎందరో యుందురు. కపట సన్యాసులు, కపట గురువులు తమను తాము ఉత్తమముగ భావించుచు, ఇతరులను మభ్యపెట్టువారు ఎందరో యుందురు.

నిజమగు సత్పురుషులు బహిరంగమందలి గుర్తింపునకుగాని, ప్రశంసకుగాని ఉన్ముఖులు కాక తమవంతు కర్మమును ధర్మమును నిర్వర్తించుచు జీవింతురు. అంతఃకరణ శుద్ధి వారికి ప్రధానము. బాహ్యాడంబరములు అప్రధానములు. వారు సత్య తపోనిష్ఠులై యుందురు. లో చూపు, లో వినికిడి కలిగి అంతరాత్మ ప్రబోధమును అనుసరించుచు వారు జీవింతురు. లోకశ్రేయస్సునకు మాత్రమే భావము, భాషణము, వర్తనము యుండును. శ్రీరాము డట్టివాడు. అగస్త్య మహర్షియు అట్టివాడే. ఇరువురును అంతరాత్మ ప్రబోధము

ననుసరించువారే. ఇరువురును సత్యతత్త్వ నిష్ఠులే. వారొకరి నొకరు సందర్శించు సమయమున సహజమగు ఆనందాతిశయములకు లోనైరి. కనుకనే అగస్త్య దర్శనమునకు పూర్వమే రాము డగస్త్యాశ్రమ మున వనవాస శేషకాలమును గడిపెద ననెను. అగస్త్యమహర్షి కూడ అట్లే తలపోసి పలికెను.

దర్శనము, స్పర్శనము, భాషణము, అతిథి సత్కారము ఇత్యాది కృత్యములతో శ్రీరాముడు శమించెను. అట్టి శమమున అంతరంగము నుండి అతనికి అంతరాత్మ ప్రబోధముగ భావికార్యముల కుపయుక్త మగు ప్రదేశమున నుండవలెనని తోచును. అంతరాత్మ బోధ ననుస రించి శ్రీరాముడు తన భావమును ప్రకటించెను.

అగస్త్య మహర్షి గూడ ముహూర్తకాలము కనులు మూసి అంతరంగమున అంతరాత్మ ప్రబోధమును, జరుగవలసిన కార్యమును గ్రహించి తదనుగుణమగు ప్రదేశము సూచించెను. సత్పురుషుల యందే ఇట్టి ప్రక్రియ సంభవించును. వారికి లోకమర్యాదకన్న లోకశ్రేయస్సే ప్రధానము. వారంతరాత్మ ననుసరించువారేగాని లౌకిక వాదములకు, తర్కమునకు లోబడువారు కాదు.

# 23. దైవ సంకల్పము

విష్ణు ధనుస్సు, బాణములు, అక్షయ తూణీరములు, శ్రీరాముని అగస్త్య మహర్షి సందర్శనమునకు పూర్వమే అగస్త్యాశ్రమము చేరినవి. అట్లే దేవేంద్రుని ఖడ్గము కూడ అగస్త్యాశ్రమము చేరినది. బ్రహ్మర్షియగు అగస్త్యునకు ఆయుధములతో పనిలేదు. కాని దేవతల సంకల్పముగ అవి అగస్త్యాశ్రమమును చేరినవి. అట్లుచేరి చాల సంవత్సరములైనవి. శ్రీరాముని చూచిన అగస్త్యునకు ఆ ఆయుధములను శ్రీరామున కీయవలెనని ప్రేరణ కలిగినది. ఆ ఆయుధములను ధరించగల ధీమంతుడు శ్రీరాముడే అని భావించి వాటిని అతనికి సమర్పించి సంతృప్తుడయ్యెను.

విశేషమగు విలువగల వస్తువులు తమ కక్కరలేకయే తమ వద్ద చేరిపుడు వానిని నిరాకరించక అంగీకరించి, వాని యందు బాధ్యత పడి అర్హత గలవారు తటస్థించినపుడు వారికి సమర్పించుట సముచితమగు ధర్మముగ అగస్త్యుని ప్రవర్తనమున దర్శింపవచ్చును. ఇది విశేష ధర్మము.

ఎవరైనను మనకేదైన వస్తువును బహూకరించునపుడు మనకవసరము లేనిదైనను, భగవత్సంకల్పముగ ఆ వస్తువు మనవద్దకు చేర్చబడుచున్న దనియు, దానియందు మనకు తెలియని బాధ్యత యొకటి యున్నదనియు తెలిసి, దానిని స్వీకరించి అటుపైన పాత్ర తెరిగి మరియొకరికి సమర్పింపవలెను. దైవము మనలను వాహికలుగ

వస్తువులను, సంపదలను లోకుల కందజేయుచు నుండును. సృష్టియందు వస్తువినిమయము ఒక విజ్ఞానము. అవి చక్కగ నిర్వర్తింపబడవలెను. ఉదాహరణకు కేదారనాథుని దర్శించి తిరిగి వచ్చు స్నేహితులుకాని, బంధువులు కాని మనకొక స్ఫటిక లింగము నిచ్చిరనుకొనుడు. దానికి నిత్యము శివారాధన చేయు సత్తా మనవద్ద లేనప్పుడు శివలింగమును స్వీకరించి, శివభక్తుడు తారసపడునపుడు ఆ స్ఫటిక లింగము వానికిచ్చుట వలన, తదనుగుణమగు ఆశీర్వచనము మనకు తప్పక లభించును. అట్లుగాక ఇవ్వబడుచున్న శివలింగమును నిరాకరించుట అవివేకమగును.

బ్రహ్మర్షి అగస్త్యునికి ఎట్టి ఆయుధముల ఆవశ్యకత లేదు. అయినను దైవ సంకల్పముగ భావించి వానినంగీకరించి భద్రపరచినాడు. సరియగు సమయమున, సరియగు వ్యక్తికి వాని నందించినాడు. అనాయాసముగ ఒక వస్తువు మనవద్దకు చేరినపుడు దానిని గూర్చి బాధ్యతపడి ప్రయోజనమున్న చోటుకి దానిని చేర్చుట మన కర్తవ్యమని, ధర్మమని అగస్త్యుని వర్తనమున మనకు తెలియనగును. దివ్యాయుధములకు నిర్దిష్టమగు ప్రయోజన ముండునని తెలియని వారెవ్వరు?

# 24. మలుపు

శ్రీరాముడు అగస్త్యాశ్రమము చేరుటకు మునుపు వనవాస శేషకాలము అగస్త్యాశ్రమమునందే గడపదలచుకొనెను. అట్లే అగస్త్యుడు కూడ భావించి పలికెను. ఈ అంశము ముందు తెలిపిన ధర్మ కుసుమములలో తెలుపబడినది. ఒకరి నొకరు సందర్శించుకొని, సన్మానించుకొన్న పిదప శ్రీరాముడు అంతరంగ ప్రబోధము కారణ ముగ అగస్త్యాశ్రమమున నుండక సమీప ప్రాంతమున నుండుటకు నిర్ణయించుకొనెను. అగస్త్య మహర్షియు అంతర్ముఖుడై రాముని సంకల్పమును సమర్థించెను.

ఒకరినొకరు సందర్శించుకొనుటకు మునుపు ఇరువురి యందు ఒకే భావ మున్నది. సందర్శన అనంతరము ఇరువురి భావముల యందు ఒకే మార్పు కలిగినది. ఇది నిజముగ గమనించినచో ఒక చిత్రము. సందర్శ పూర్వోత్తరముల నడుమ జరిగినవి పరస్పర సమ్మానము మరియు ఆయుధ మార్పిడి. అగస్త్యుని నుండి రాముని వద్దకు ఆయుధములు చేరినవి. ఈ చేరికయే రాబోవు అశేష అసుర సంహారమునకు నాంది పలికినది. శ్రీరాముడు చిత్రకూటమున ఋషుల కిచ్చిన అభయమును సంపూర్తి చేయుటకు దోహదమైనది. దివ్యాయుధము లందలి అసుర సంహారక చైతన్యము, రాముని సంకల్పమునకు మరికొంత ప్రేరణ నిచ్చినవిగా తోచును. శ్రీమహా విష్ణువు, మహేంద్రుడును ప్రధానముగ నిర్వర్తించినవి అసురులను

నిర్జించుట, సంహరించుట. సృష్టియొక్క స్థితికి భంగము వాటిల్లకుండ రక్షించుటయే వారి కర్తవ్యమై యున్నది. వారి ఆయుధము లందు అదే కర్తవ్యము నిక్షిప్తమై యుండును. రాముని చేరుటయే ఆ ఆయుధములకు పరమ ప్రయోజనము. ఈ కార్యము సున్నితముగ జరిగినను దైవ సంకల్పమునకు కావలసిన మలుపు యిందు గోచరించ దగును.

ఇట్లు మహత్తరమగు మలుపులు జీవితమున మౌనముగను, సున్నితముగను, ఊహించని విధముగను జరుగునను ధర్మము గ్రహించవలెను.

# 25. పరతంత్రము - స్వతంత్రము

సీతారామ లక్ష్మణులు అగస్త్యుని సూచనలాధారముగ పంచవటి చేరినారు. మనోహరమైన ఆ ప్రదేశమును చూచి రాము డుప్పొంగినాడు. అచట నివాస మేర్పరచుకొనుటకు సంకల్పించి, తమ్ముని పిలిచి ఇట్లనినాడు– "తమ్ముడా! ఈ పంచవటి ప్రాంతమున ఏ ప్రదేశమున మనము ఆశ్రమము నిర్మించుకొనవలెనో నీవు నిర్ణయించుము. ఈ అడవి అంతా పరిశీలించి, యోగ్యమగు స్థలమును నిర్ధారించుము. అచటనే మన మాశ్రమ మేర్పరచు కొందుము. అట్టి స్థలమును నిర్ధారణ చేయుటలో నీవే సమర్థుడవు" అని పలికెను.

రాముడు ఇంకను ఇట్లు పలికినాడు– "నీవు నిర్ణయించు ప్రదేశము సీతాదేవికి సంతోషముగ నుండవలెను. అచ్చట చెట్లు రమణీయముగ నుండవలెను. నేల ఇసుకతో కూడి సమమట్టముగ నుండవలెను. వర్షించినను బురదగ నుండకూడదు. పూవులు, దర్భలు, సమిధలు సమీపములో దొరుకునట్లుండవలెను. నీటి వసతి కూడ చేరువలో నుండవలెను. అట్టి ప్రదేశమును నిర్ణయించుటకు నీవు సమర్థుడవు."

లక్ష్మణుడు సర్వ లక్షణ లక్షణుడు. అతడు ధీరుడు, ప్రజ్ఞాశాలి. చిన్నతనము నుండి రామునితో పాటు సర్వవిద్యలు నేర్చినవాడు. రాముని అంటిపెట్టుకొని సరిసమానముగ రామునితోపాటు అన్ని

అనుభవములను పంచుకొనినవాడు. పరాక్రమవంతుడు కూడ. కాని శ్రీరామునికి భృత్యుడుగ ఉండుటకు నిర్ణయించుకొనినాడు. తనను తాను రాముని సోదరుడుగ భావింపలేదు. అనుజన్ముడిగ పలకనే లేదు. కింకరునివలె రామాజ్ఞను నిర్వర్తించుటకే జీవించుచు నుండును. తన జీవన సర్వస్వమును రామునికే సమర్పణము చేసి స్వతంత్రుడు కాక రామతంత్రుడై నిలచెను. రామునికి అంగమువలె నుండెను.

దేహాంగములు స్వతంత్రించి ఏ పనియు చేయవు. అట్లు లక్ష్మణుడు స్వతంత్ర బుద్ధిని వీడి, సమర్పణ బుద్ధితో రామాంగమై నిలచినాడు. కనుకనే సీతారాములకు నమస్కరించుచు ఇట్లు పలికినాడు.

"ఓ కాకుత్స తిలకుడా! నేను పరతంత్రుడను. నే నేమి చేసినను అది మీ ఆజ్ఞ ననుసరించి చేయువాడను. మరి నూరు సంవత్సరము లైనను అట్లే యుండెదను. నీవు సర్వస్వతంత్రుడవు. నిర్ణయము నీదిగ యుండవలెను. నీ నిర్ణయమునకు కట్టుబడి కాయకమగు కర్మము నేను చేసెదను" అని పలికెను. ఇది పరిపూర్ణ శరణాగతి భావము.

జీవుడు నిజమునకు స్వతంత్రుడు కాడు. అతడు పరతంత్రుడే. స్వార్థము, స్వతంత్రము అనునవి అజ్ఞానము. పరార్థము, పరతంత్రము అనునవి జ్ఞాన లక్షణములు. దైవ సంకల్పము ననుసరించుటయేగాని, స్వంతమగు సంకల్పములు చేయుట జ్ఞానమార్గము కాదని తెలియ వలెను. జీవు డెప్పు డేపని చేసినను అందు పరులకు ప్రయోజనముండ వలెను. పరార్థమై, పరహితమై, ఈశ్వర సమర్పణమై సాగు జీవితము తరించును. పరార్థమే పరమ ప్రయోజనమై జీవితము నడచునపుడు,

అట్టి జీవితము పరతంత్ర జీవితమని పిలువబడును. లక్ష్మణుడు తనను తాను స్వచ్ఛందముగ పర తంత్రమునకు, అనగా రామ తంత్రమునకు సమర్పణ చేసుకొనిన పరమ భక్తుడు. దీనిని ప్రప్రథమ ముగ గుర్తించినవాడు, అతి శీఘ్రముగ గుర్తించినవాడు ఆంజనేయుడే! అతడు భక్తాగ్రగణ్యుడు. భక్తులను భక్తులే గుర్తించగలరు.

# 26. లక్ష్మణుని కౌశలము, భక్తి

లక్ష్మణుడు అయోధ్య నుండి సీతారాములతో కూడి వన వాసమునకు వచ్చుటకు ఆ పుణ్యదంపతిని అనేక విధములుగ ప్రార్థించెను. సీతారాములు హృదయము కరిగినవారై, లక్ష్మణుని వెంటగొని వనవాసమునకు చనిరి. లక్ష్మణుడు నిద్రను గూడ నిర్జించి దీక్షతో సేవకునివలె అహర్నిశలు సీతారాములకు సేవకుడుగ నిలచెను. లక్ష్మణుడు రామ సహోదరుడు. రామానుజుడు. రామునితో సరి సమానమైన పరాక్రమము కలవాడు. రాముని వలెనే ధార్మికుడు. వారిరువురును స్కంద విశాఖులవలె ప్రకాశించుచు నుందురు. అయినప్పటికిని లక్ష్మణుడు రామునికి దాసుడై యుండుటకే ఇష్ట పడెను. తనని తాను రామునితో ఎప్పుడును పోల్చుకొనలేదు. రాముడు తనకు స్వామి. అతనికి తాను దాసుడు అనెడి భావమును అతని హృదయమున స్థిరముగ నుండెడిది. తనతో సరిసమానమగు తమ్ముడు తనను స్వామిగ గుర్తించి, తాను దాసునిగ సేవలు చేయుట రామునికి అంతరంగమున అపారమగు ప్రేమనేగాక ఆవేదనను కూడ కలిగించెడిది. తమ్ముని యందు అన్నకు వాత్సల్యమే యుండును. పుత్ర భావముండును. తన దాసుడుగ తమ్ముని భావించుట సంస్కార వంతుడికి అసాధ్యము, అసంభవము అగు భావము. కాని లక్ష్మణుని దాస్యభావము పూర్ణముగ అంకితమై యుండుటవలన రాము డంగీక రించక తప్పలేదు. తాను పర్ణశాలను నిర్మింపుమని కోరినపుడు కూడ

లక్ష్మణుడు, తాను పరతంత్రుడనని, తానుగ స్వతంత్రముగ ఆశ్రమము నిర్మింపలేనని, రాముడే స్థల నిర్ణయము చేయవలెనని, పర్ణశాలకు రూపకల్పన చేయవలెనని కోరినాడు.

ఆజ్ఞాపించవలసినది, ఆదేశింపవలసినది రాముడేయని, అతని ఆదేశము తాను సర్వకాలముల యందు సర్వవిధములుగను పనిముట్టు వలె నిర్వర్తింతునని లక్ష్మణుని భావన. లక్ష్మణుడు స్వంత భావములు, స్వతంత్ర భావములు లేక, కేవలము రామసంకల్పమునకు క్రియా రూపుడై నిలచినాడు. సొంత తెలివిని వినియోగించలేదు. దైవమునకు పనిముట్టువలె లేక వాహనమువలె వినియోగపడవలె ననునది లక్ష్మణుని దీక్ష.

"అహం సర్వం కరిష్యామి" నేను అన్నియు చేయుదును. చేయుటయే నా వంతు. ఆజ్ఞాపించుట రాముని వంతు. రాము డాజ్ఞాపింపవలెను, తాను చేయవలెను. దైవము సంకల్పింపవలెను. తాను వాహికగ నిర్వర్తింపవలెను. మేధాశక్తి లేనివా రిట్లననుసరించుట సాధ్యపడునేమో కాని, స్వామితో సరిసమానమైన మేధస్సుగల లక్ష్మణుడు అట్లు దాస్యదీక్షను వహించుట అనితర సాధ్యము.

పంచవటియందు లక్ష్మణుడు నిర్మించిన పర్ణశాల అత్యంత ప్రశంసనీయమైనది. వాల్మీకి మహర్షి రచించిన రామాయణమున ప్రత్యేకముగ లక్ష్మణుని పర్ణశాల నిర్మాణము కొనియాడబడినది. లక్ష్మణుడు అతిశీఘ్రముగ, సులభముగ ఏమియు శ్రమపడనట్లు ఆశ్రమ నిర్మాణము పూర్తి చేసెను. అటుపైన గోదావరి నదికేగి స్నానము గావించి, శుచియై తామరపూలను సేకరించి ఆశ్రమమున

శాంతికొరకై దేవతా పూజలను చేసెను. పర్ణశాల నిర్మాణమున అతడు చూపిన కౌశలము నిరుపమానము. పర్ణశాల లోపల వెలుపల వాతావరణమును అతి సౌమ్యముగ ఏర్పరచెను. అటుపైన సీతా రాముల నాహ్వానించి చూపించెను. రాముడు పర్ణశాలను పరికించి అమితానందముతో లక్ష్మణుని గట్టిగ కౌగలించుకొనెను.

శ్రీరాముడు భరతుని కౌగలించుకొనుట, హనుమంతుని కౌగలించుకొనుట తరచుగ రామాయణ ప్రవచనముల విను చుందుము. కాని లక్ష్మణుని కౌగలించుకొనిన ఘట్టమునకు అంత వినికిడి ఏర్పడలేదు. రామునికి లక్ష్మణుడన్న అమితమగు ప్రీతి. రామునకు మరియొక దేహమే లక్ష్మణుడు. ఒకే ఆత్మకు రెండు శరీరము లున్నట్లు లక్ష్మణుడు రామునికి మరియొక దేహముగ ఏర్పడినాడు. తనను రామునిలో భక్తితో ప్రేమతో దాస్యదీక్షతో లీనము గావించుకొనినాడు. తనకు తాను లేడు. రాముడే యున్నాడు. రాముడే నిండి తాను లేని స్థితి యందుండువాడు లక్ష్మణుడు. అట్టి లక్ష్మణుడు అతి శీఘ్రముగ, అతి నైపుణ్యముతో అత్యంత మధురముగ పర్ణశాల నేర్పరచినపుడు, రాముని హృదయము అమితముగ పొంగినది. రాముని మాటలయందు ఇది చక్కగ వ్యక్తమైనది.

"లక్ష్మణా! చాల గొప్ప పనిచేసితివి. నీవు చేసిన ఈ ఆశ్రమ నిర్మాణము నాకు ప్రీతి కలిగించినది. దానికి తగిన కానుక ఏదైనను నీకు నేను ఒసంగవలెను. అది నీకు ప్రియమైనది, నాకు ఆనందము కలిగించునది కావలెను. అది కౌగలింత ఒక్కటియే! నీకు ఇప్పుడు నేను ఇవ్వదగినది యిదియే యని నేను భావించుచున్నాను. ఇంతటి చక్కని ఆశ్రమము నిర్మించినందుకు నీకు తగిన పారితోషికము ఏమి

ఇవ్వగలను? దానికి తగిన పారితోషికము ఏమియును లేదు. నా ఆలింగనమే తగిన పారితోషికమని ఒసంగుచున్నాను.

*భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ ।*
*త్వయా పుత్రేణ ధర్మాత్మాన సంవృత్తః పితామమ ॥*

లక్ష్మణా! మన తండ్రిగారు చనిపోయినారని విచారము ఇంత వరకు ఉండెడిది. ఇట్టి ఆశ్రమమును నీవు నిర్మించిన తరువాత తండ్రిగారు పోయిన లోటు నాకు లేదు. నాకు ఏ విధముగ అనుకూల ముగ ఉండునో, నా మనసును ఎరింగి నిర్మించెడి దశరథునితో సమానముగ నువ్వు గుర్తించితివి. నీవు ఆశ్రమమును నిర్మించుటలో చూపిన నేర్పుచే నీవు భావజ్ఞుడవు, ధర్మజ్ఞుడవు, కృతజ్ఞుడవు అని తెలియుచున్నది. 'పుత్' అను పేరుగల నరకము నుండి తండ్రిని కాపాడెడివాడు పుత్రుడు. తండ్రికి నా యందు ఎక్కువ ప్రేమ. నన్ను గూర్చి అడవిలో ఎట్లుండెదనో అని మన తండ్రిగారు బెంగపెట్టుకొని పరమపదించిరి. ఈనాడు ఈ ఆశ్రమ నిర్మాణముచే వారి బెంగను నీవు తీర్చినావు. ఆశ్రమ నిర్మాణములో సీతమ్మతో నేను రహస్యముగ ఏకాంతముగ ఉండుటకు ఒక గదిని నిర్మించితివి. అది నిర్మింపుమని నేను నీకు చెప్పలేదు కదా! కాని ఎల్లవేళల అందరి ముందు ఆమె ఉండుట ఆమెకు నాకు కూడ అభిమతము కాదు. తండ్రిగారు నా కొరకు భవనమును నిర్మించునపుడు ఎంతో జాగ్రత్త తీసుకొని తారాబల చంద్రబలాదులు చూచి ఏకాంతముగ ఉండుటకు, విశ్రాంతి తీసికొనుటకు, పెద్దలతో కూర్చుని మాటాడుటకు అనుకూలముగ ఎట్టి భవనమును నిర్మించినారో అట్లే నీవు కూడ నాకు అనుగుణముగ ఆశ్రమమును నిర్మించితివి. తండ్రిగారు నాకై

నిర్మించిన భవన నిర్మాణక్రమమును గుర్తు చేసిన వాడవు కనుక కృతజ్ఞుడవు. నాకు అవసరమైనవి అన్నియు కల్పించి, నీవు దాసుడుగ నా సేవ చేయుచు వెలుపల ఉండుటకు నిర్ణయించుకొని నీకు ఒక స్థానమును నిర్మించుకొనక పోవుటచే నీవు ధర్మజ్ఞుడవని నిరూపించి తివి. ఇట్లు నాకు సకల విధ సౌఖ్యములతో నిర్మించుటచే నా కొరకు బెంగపెట్టుకొని చనిపోయిన తండ్రిగారి మనసు బెంగతీరి హాయిగ ఉండును. తల్లి తండ్రులవలె నా మనసునకు ప్రీతికరమగునట్లు ప్రవర్తించుచు, నీవున్నావు కనుక తల్లిదండ్రులు చనిపోయినను చనిపోయినట్లు కాదు. ఈ నిర్మాణము తలచిన నాకు తండ్రిగారు చనిపోవనట్లు తోచుచున్నది. జీవించి ఉన్నంతకాలము మన తండ్రి గారు శ్రమించి నా కోరికలను తీర్చినారు. వారి తరువాత నాకు అనుగుణముగ అన్నిటిని కల్పించుటకు నిన్ను ప్రతిష్ఠించినారు. అందుచే తండ్రిలేని లోటు నాకు లేదు."

శ్రీరాముడు సత్యవాక్కునకు ప్రతిరూపము. అతడు లక్ష్మణుని గూర్చి పలికిన పలుకులు లక్ష్మణుని పరమ భక్తిని ఆవిష్కరించును.

# 27. విషయ చాపల్యము

శరత్కాలము ప్రారంభదశలో సీతారాములు లక్ష్మణునితో పంచవటీ ప్రాంతము చేరి, అచట పర్ణశాలను నిర్మించుకొని విషయ చాపల్యము లేకుండగ ఆనందించుచు సుఖముగ నుండిరని వాల్మీకి మహర్షి తెలిపియున్నాడు. ఫలసమృద్ధి, ప్రకృతి సమృద్ధి శరదృతువున ఇనుమడించి యుండును. రమణీయత అధికమై యుండును. కనుక ఇంద్రియార్థములు ఆకర్షణీయములై, ఇంద్రియములను బలీయముగ లాగుచుండును. ఇంద్రియములచే లాగబడిన జీవులు ఇంద్రియార్థ ముల చిక్కుబడి ప్రకృతి బద్ధు లగుదురు.

వనమున ఫలములు గోచరించునపుడు సామాన్యులు తప్పక భుజింతురు. ఊరకే లభించినపుడు అవసరమునకు మించి పొందుట లోకుల స్వభావము. అట్లే విరివిగ పుష్పములు గోచరించునపుడు వానిని కోయుట, త్రెంపుట, మాలలు కట్టుట, అలంకరించుకొనుట వంటి కృత్యములు చేయుదురు. నిజమునకు వివేకించినచో, వన మందలి ఫలములను గాని పుష్పములని గాని పొందు హక్కు మానవు లకు లేదు. ఆ ఫలములు, పుష్పములు ఏర్పడుటకు మానవులు చేసిన కృషి ఏమియు లేదు. కృషి సలుపక ఫలముల నాశించువారు తస్కరులు లేక దొంగలు. అట్టివారు ప్రకృతియందు తప్పక బంధింపబడుదురు. వనవిహారము చేయుచు ఆనందించవచ్చును. వనమున కేమియు

చేయక వనసమృద్ధిని వాడుకొనుట ధర్మము కాదు. శరీర పోషణము నకు వలసిన మేరకు అనుభవించవచ్చును.

సమృద్ధి యున్నపుడు ఇంద్రియములయందు ప్రజ్ఞ పుష్టిగ మేలుకొనును. అది కారణముగ వివేకము కోల్పోవు ప్రమాద మేర్పడును. అకారణముగ ఇంద్రియ పరితృప్తి గావించుట ప్రమాద కరము. సీతారామలక్ష్మణులు వివేకమందు పూర్ణముగ నిలచినవారు. వారు వనమున బాధ్యతతో, శ్రద్ధతో, భక్తితో జీవించిరి. వనమును దుర్వినియోగము చేయలేదు. ఏ విధమగు ఇంద్రియ చాపల్యమును పొందలేదు. పూవులను చూచి సంతసించిరే కాని స్పృశింపలేదు. ఫలములను చూచి సంతసించిరేకాని కోసి భుజించలేదు. ప్రకృతిని ప్రాణప్రదముగ భావించి, సున్నితముగ మెలగిరి. ఇది వారి సౌకుమార్య గుణము.

ఆధునిక కాలమున నాగరికు లనుకొను మానవులు నిర్జన ప్రదేశము లందలి ఫల పుష్పములను అనుభవించుటకు సందే హింపరు, జంకరు. అట్లనుభవించుట అధర్మమనిగాని, అనైతికమని గాని వారికి తెలియదు. అందినదెల్ల పొందుటయే ప్రస్తుతమున గల నీతి, ధర్మము. తనది కానిది తాను స్పృశింపనైనా స్పృశింపరాదను నీతిని నేర్పు విద్యలు మరుగైనవి.

ఉదాహరణకు పొరుగువాని ఇంటిలోని జామచెట్టుకొమ్మ తన ప్రాంగణము లోనికి విస్తరించి, అందు జామ పండ్లేర్పడినపుడు యథేచ్ఛగ వానిని కోయుట, తినుట చేయుదురే కాని, ఆ జామపండ్లు పండుటకు తమవంత కృషి ఏమియు లేదని గమనింపరు. అట్లే

పొరుగువాని ఇంటిలోని కొబ్బరిచెట్టునుండి కొబ్బరికాయ తమ పెరడులో పడినపుడు తమదిగనే భావింతురు. అట్లే ప్రభాత సమయ మున వ్యాహ్యాళికి వెళ్లు చదువుకొన్నవారు కూడ రోడ్డు ప్రక్కన ప్రహరీ గోడపై నుండి అందివచ్చు పూవులను కోసుకొని, గృహమున కేగి పూజావేదికపై అలంకరింతురు. అంతరాత్మ ప్రబోధ మనునది మచ్చునకైనను యిట్టి విషయమునందు గోచరింపదు.

రామాయణము చదివిన చాలదు, అందు రాముని ప్రవర్తనను ఉపాసించుటయే నిజమగు పఠనము. మనయందు ధర్మానుష్ఠాన బుద్ధి ఏర్పరచుటకే శ్రీమద్రామాయణము మన నడుమ జీవించుచు నున్నది.

# 28. అనుజ స్మరణము

పంచవటి ప్రాంతమున సీతారామలక్ష్మణులు శరత్కాలమున వనవైభవమును ఆనందించుచు నుండిరి. ప్రకృతి వైభవమును ధర్మ లోపములేక అనుభవించుచు, కుటీరమున దైవారాధనలు చేయుచు కాలము గడిపిరి. సర్వలక్షణ లక్షణుడు అగు లక్ష్మణుడు సేవ చేయు చుండగ సీతారాములు పంచవటీ ఆశ్రమమున సుఖముగ నుండిరి. నిత్యము గోదావరి నిర్మల నదీస్నానము వారికి ప్రత్యేకముగ ఆహ్లాదము కలిగించుచు నుండెడిది. ఇంతలో హేమంత ఋతువు వచ్చినది.

హేమంతము యొక్క చల్లదనము లక్ష్మణునకు అమితాహ్లాదము కలిగించినది. హేమంత స్పర్శ అతడికి రాముని స్పర్శవలె భాసించు చుండెడిది. శ్రీరాముడు కరుణాసముద్రుడు. దయాసాగరుడు. చల్లని మనసు కలవాడు. హేమంతము శరీరమునకు చల్లదనము నిచ్చును. గోదావరి నదీజలము కూడ చల్లని స్పర్శ నిచ్చును. ఉభయ సంధ్యల యందు చల్లదనము ననుభవించ వచ్చును. పగలు సూర్యుని కిరణ ములు కూడ ఆహ్లాదముగనే యుండునుగాని తాపము కలిగింపవు. లక్ష్మణునికి హేమంత ఋతు స్పర్శ రామ స్పర్శవలె గోచరించుట అతని భక్తి విశేషము. భక్తులకు ప్రకృతి యందు దైవమే దర్శన మిచ్చు చుండును. స్పర్శనము, భాషణము కూడ అందించుచు నుండును. కనుక హేమంతమును రామునితో పోల్చుకొని పరవశించు చుండెను.

లక్ష్మణుడు లేశమాత్ర మావేశపరుడైనను, అపారమగు ప్రేమ గలవాడు. అతడు ముమ్మూర్తుల రామానుజుడే. రామస్మరణ చేయు చుండగ హఠాత్తుగ భరతుడు జ్ఞప్తికి వచ్చెను. లక్ష్మణునివలె భరతుడు కూడ రామభక్తుడు. భరతుడును రామసమానుడే. రామానుజుడే. తాను రాముని వద్ద యున్నాడు. భరతుడు రామునికి దూరముగ అయోధ్యలో రాముని గూర్చి భక్తితో తపస్సు చేయుచు దుఃఖముతో కూడి యున్నాడు. రాముని వనవాసమునకు తాను నిమిత్త కారణ మగుట భరతునికి దాటరాని దుఃఖ కారణమైనది. అతడి దుఃఖము అనుజులగు రామలక్ష్మణులకు కూడ తెరలు తెరలుగ సోకుచుండెడిది. భరతుడు స్మరణమునకు రాగ, లక్ష్మణునకు దుఃఖము కలిగినది. అతడు భరతుని గూర్చి రామునితో ఇట్లు పలికెను.

“అన్నా! భరతుడు రాజప్రాసాదమున నున్నను ఈ చలి కాలమున రాజభోగములను, గర్వమును విడచి, మితమగు ఆహారమును స్వీకరించుచు, చల్లని నేలపై పరుండుచున్నాడు. సుఖముగ పెరిగిన భరతుడు మనతో సహవేదన ననుభవించుటకై సరయూ నదిలో చల్లని నీటియందు స్నాన మాచరించు చున్నాడు. సహజముగ సుకుమారుడైన భరతుడు రాచకార్యములు నిర్వర్తించుచు కూడ కఠినమగు వనవాసదీక్షను అనుసరించు చున్నాడు. నిన్ను గూర్చిన విరహముచే కృంగిపోయి జనులకు కనిపించుట కూడ తగ్గించుకొని, జంకుగ జీవించు చున్నాడు. భోగములను అనుభవింప దగ్గ అవకాశముండియు నీవలె యుండవలె ననియు, నిన్నే తలంచుచు మనసుతోను, చేతలతోను నిన్నే అనుసరించు చున్నాడు.

లక్ష్మణుడు పలికిన ఈ పలుకులకు రాముని హృదయము తల్లడిల్లినది. తన సోదరుల ప్రేమ పరస్పర అనుజధర్మము రాముని యందు కరుణను, శోకమును, ప్రేమను ఒక్కమారుగ ఆవరింప జేసినవి. అనుజ ధర్మమునకు రామాయణమే ప్రమాణము.

# 29. రాముని భాషణా ధర్మము

మానవ లోకమునందు భాషణము అత్యధికముగా నుండును. మానవునకొక్కనికే వాక్కీయ బడినది. వారు వైఖరీవాక్కు గలవారు. భౌతిక శరీరముండిననే గాని వైఖరీవాక్కు వీలుపడదు. దేవతలు పర, పశ్యంతి, మధ్యమ వాక్కుతో సరిపెట్టుకొనవలెను. దానికి కారణము భౌతికశరీరము లేకపోవుటయే. జంతువులకు భౌతిక శరీరమున్నను, కూతలు కేకలు తప్ప భాషణము లేదు. మానవులకు మాత్రమే శరీరమున భాషణమునకు తగు నిర్మాణము సృష్టియందేర్పడి యున్నది. దంతపంక్తి ఉభయ తాలువులందు షోడశాత్మకముగ సృష్టిశిల్పియగు విశ్వకర్మ ఏర్పరచియున్నాడు. నాలుక కేవలము రుచి చూచుటకే కాక అమృత తుల్యములగు వాక్కులను పలుకుటకు కూడ తగినరీతిన నిర్మాణము చేయబడి యున్నది. వాక్కువలన మానవుడు సమస్తమును జయింప వచ్చును. అట్లే వాక్కువలన సమస్తమును కోల్పోవచ్చును. అట్టి వాక్కును నియమముతో వినియోగించుట సాధ్యము కాకే మానవులు త్రిప్పలు కొనితెచ్చుకొను చున్నారు.

శ్రీరాముడు మితభాషి- అనగా మితముగనే భాషించును. అమిత భాషణము చేయడు – అతడు ప్రియభాషికూడ. ప్రియముగ పలుకును. అప్రియముగా పలుకడు. శ్రీరాముడు అన్నిటికి మించి సత్యభాషి. అతని భాషణము సత్యముతో కూడియుండును. సత్యము ప్రియము, మితము అగు భాషణమును మధురముగ పలుకు

స్వభావము గలవాడు రాముడు, మరియు శ్రీరాముడు పూర్వభాషి కూడ. అనగా ఇరువురు కలసినపుడు ముందుగ కుశలమడుగువాడు రాముడు. ఎదుటివారు పలుకరించినచో పలుకరింతుమని వేచి యుండక తానే ముందుగ పలుకరించును. అటుపైన మౌనముగ ఎదుటివారిని వినుటకు ప్రాధాన్యమిచ్చువాడు విజ్ఞుడు. మాటాడుటకు ప్రాధాన్యమిచ్చువాడు సామాన్యుడు.

శ్రీరాముడు లక్ష్మణుని భాషణము వినుచు నుండును. లక్ష్మణుడు హేమంతఋతువు వైభవమును రామునితో పోల్చి పలికెను. రాముడు వినెను. అటుపైన భరతుని సౌశీల్యమును, సద్గుణములను కీర్తించెను. రాముడు వినెను. ఆపిమ్మట లక్ష్మణుడు కైకేయిదేవిని దూషించుట ఆరంభింపగ రాముడు అతిశీఘ్రముగ దూషణ పూరిత మగు భాషణమును వారించెను. లక్ష్మణునితో ఇట్లనెను. "లక్ష్మణా! మన నడిమి తల్లియగు కైకేయిని నిందించుట తగదు. ఆమెలో దోష మేమియు లేదు. ఆమె చేసిన పని మనకు అపకారముగ తోచవచ్చును. దానివలన మనము శ్రమ ననుభవించ వచ్చును. అంతమాత్రమున ఆమెను దూషించుట తగదు". ఇట్లు పలుకుచు శ్రీరాముడు లక్ష్మణుని దూషణపూరిత భాషణమును నివారించెను.

శ్రీరాముని భక్తులమని అనుకొనినచో చాలదు. రామ పూజలు గావించినను చాలదు. రాముని పేర అనేకానేకములగు పుణ్య కార్యములు చేసినను చాలదు. రాముని అనుసరించవలె నన్నచో రామునివలె భాషించుట నేర్వవలెను. దానివలననే రామునికి కీర్తి కలుగును. ధర్మము నాచరించినచో ప్రీతి చెందువాడే గాని, రాముడు ప్రశంసలకు ప్రీతి చెందువాడు కాదు. అధర్మమును సహింపనివాడు

రాముడు. తనకు అత్యంత ప్రీతిపాత్రుడగు భక్తుడే అయినను లక్ష్మణుని అతిశీఘ్రముగ సరిదిద్దెను. తన తమ్ముడు అధర్మమునకు లోను కాకుండుగ అతని నివారించి రక్షించుకొనెను. అట్లే రామ స్మరణము చేయువారిని అధర్మవర్తనము నుండి ధర్మవర్తనములోనికి ఉద్ధరించి రక్షించువాడు రాముడు. ఇది రాముని వర్తనమున గుర్తింపవలసిన ధర్మసూక్ష్మము. రాజీపడని ధర్మమూర్తి రాముడు.

# 30. సత్యము – నిర్దోషిత్వము

రామాయణమందు కైకేయిదేవిని గూర్చి యథార్థ విషయము ఆవిష్కరింపబడగా, నానుడి యందు ప్రతినోట కైకేయిదేవికి దూషణమే లభించినది. హరికథలు చెప్పువారినుండి పండిత రచనల వరకు కైకేయిని ఒక అధర్మమూర్తిగా చిత్రీకరించిరి. నిజమునకు ఆమె ధర్మమూర్తియే! సూటియగు ప్రవర్తన కలిగినది. శ్రీరామునియందు అపరిమితమగు ప్రేమ, వాత్సల్యము కలిగినటువంటిది. దశరథుని ముగ్గురు భార్యలలో కైకేయి దశరథునికి ఎక్కువగా తోడ్పాటు గావించినది. దశరథునికి అనేకానేక విషయములలో సహాయ సంపత్తుల నిచ్చిన ప్రజ్ఞామూర్తి కైకేయి. కైకేయి వలననే దశరథునకు చక్రవర్తిత్వము ఏర్పడినది. యుద్ధములయందు కూడ దశరథ మహారాజునకు తోడ్పాటు గావించిన మూర్తి. ఆమెలో ఏ దోషమును లేదు.

తన దోషమేమియును లేకయే నిందలపాలైన ఏకైక పాత్ర రామాయణమందు ప్రధానముగ కైకేయి, అటుపైన జానకీదేవి. సీతమ్మ సమకాలికముగ మరియు తాత్కాలికముగా నిందపడినను, లోకమున అత్యంత పవిత్రమూర్తిగా ఆరాధింపబడుచు నున్నది. కాని కైకేయి నేటికిని అజ్ఞానులచే, పామర పండితులచే నిందింపబడుచునే యున్నది.

తన సంతతికి రాజ్యమిత్తునని వివాహమపుడే కేకయ మహారాజునకు దశరథ మహారాజు మాట యిచ్చెను. రామ జననమునకు ముందే జరిగిన విషయమిది. రామ జననము పిదప కైకేయి దేవితో సహా అందరును రామ మోహితులై సత్యము మరచిరి.

రాముని గుణగణములు అందరి హృదయములను దోచినవి. కనుకనే రాముని పట్టాభిషిక్తుని చేయవలెనను తలంపునకు ఎవ్వరునూ అభ్యంతర పెట్టలేదు. కైకేయి కూడ అభ్యంతర పెట్టలేదు. సత్యము నిప్పువంటిది. దానిని కప్పివేయుట సాధ్యపడదు. కనుక మంథర ద్వారా సత్యముద్భవించి, మోహితుల నందరిని కలవర పరచినది.

శ్రీరాముడు సత్యమే రూపుకట్టుకొని దిగివచ్చిన వాడు. అతడు సత్యమును మన్నించుటయే గాక, దానిని స్థిరపరచెను. కనుకనే వనవాసమున కేగెను. వనమున లక్ష్మణుడు కైకేయిని దూషించినపుడు శ్రీరాముడు స్పష్టముగ తన హృదయ భావమును ఆవిష్కరించెను. కైకేయిని నిందించుట తగనిపని యని లక్ష్మణుని హెచ్చరించెను. ఆమెలో దోష మేమియు లేదని పలికెను. అంతేకాక కైకేయిదేవి ఎన్నడును, ఎట్టి తప్పును చేయలేదని నిశ్చయముగ పలికెను.

అదే సమయమున శ్రీరాముడు మరియొక శాశ్వత సత్యమును కూడ పలికెను. “తప్పు చేసినట్లు మనకు తోచుట వేరు, తప్పుచేయుట వేరు”. లోకమున నిజమును గుర్తించు సూక్ష్మబుద్ధి అరుదుగ నుండును. స్థూలబుద్ధికి తోచినట్లు లోకులు తామెరిగిన నిజమును వ్యాప్తి చేయుచు నుందురు. పరివ్యాప్తి చెంది అసత్యమే సత్యముగ

స్థిరపడిపోవుచు నుండును. కాని సత్యవ్రతుల ద్వారా మరల మరల సత్యము ప్రస్ఫుటమగు చుండును. మనకు తోచినదే సత్యమనుకొనుట అజ్ఞానము. కైకేయి ద్వారా సత్యము ప్రకటింపబడినపుడు అయోధ్య యందంతయు ప్రకంపనములు కలిగినవి. అట్టి ప్రకంపనముల నడుమ ఇరువురే స్థిరముగ నిలబడిరి. ఒకరు కైకేయి. రెండవవారు సీతారాములు. సత్యము నందున్నవారు నిజముగ స్థితప్రజ్ఞులు.

# 31. రాముని రూపము

శ్రీరాముని రూపము అత్యంత సుందర రూపముగ ఎందరో కవులు ఎన్నో విధములుగా వర్ణించి యున్నారు. లోకోత్తరమగు రూపములలో శ్రీరాముని రూపము, శ్రీ కృష్ణుని రూపము మాత్రమే తెలియబడును. ఇతర రూపములేవియు ఆ రూపములతో సరి సమానము గల రూపములు కావని వాఙ్మయము తెలుపుచుండును. సౌందర్యమునకు మహాదేవుడే రాజని మహావిష్ణువు పలుకుచుండును. మహావిష్ణువు, మహాదేవుడు సశరీరులై భూమిపై చరించువారు కారు. రామకృష్ణులు భూమిపై సంచరించిన రూపములు. అందు రాముడు ముమ్మూర్తుల మానవుడుగ జీవించినవాడు. కృష్ణునివలె మానవాతీత తత్త్వమును ప్రదర్శించినవాడు కాదు. కనుక మానవులకు దక్కిన అత్యంత సుందరమగు రూపము రామ రూపమే!

రాముని పసితనముననే మోహించినవారు అయోధ్యయందలి అంతఃపురవాసులు. అంతఃపుర మంతయు రాముని జననానంతరము రామ మయమై నిలచినది. ఒక్కమారు రాముని చూచిన వారు ఆజన్మాంతము రాముని చూడవలెనని తపన చెందుచునే యుండెడి వారు. పసిబాలుడగు రాముని బ్రహ్మర్షి, రాజ పురోహితుడు అగు వశిష్ఠుడు కూడ మోహించినాడు. దశరథుని మంత్రులు కూడ మోహవసులైరి. తమ్ముళ్లు, తల్లులు కూడ మోహవసులైరి. ఋషుల

సంగతి తెలుప నవసరమే లేదు. అడవి మనుషులు సహితము మోహనాంగుడగు రాముని చూచి పరవశు లగుచుండెడి వారు.

అట్టి రాముని శూర్పణఖ చూచినది. పరవశ మందినది. ఆమెకు రావణ కుంభకర్ణులన్న ఇష్టము. విభీషణుడన్నచో చులకన. విభీషణుడు ధర్మాత్ముడు. అతని రూపము సౌమ్యము. రాముడు ధర్మాత్ముడు. అతని రూపము అతి సుకుమారము. విభీషణుడు నచ్చకపోవుట, రాముడు నచ్చుట విచిత్రమగు స్వభావము. ధర్మాత్ము లకు ధర్మాత్ములు నచ్చుదురు. అధర్మపరునకు అధర్మవర్తనులు నచ్చుదురు. శూర్పణఖ రాక్షస స్వభావము కలది. అధర్మ మామెకు నచ్చును. కనుక రావణ కుంభకర్ణులు నచ్చుదురు. విభీషణుడు ధర్మాత్ము డగుటచే నచ్చలేదు. మరి రాముడెట్లు నచ్చెనో?

సీతమ్మవారు అందమున గాని, గుణమున గాని రామునితో సరిసమాన మగును. కాని తోటి స్త్రీ అగుటచే నచ్చలేదు. శ్రీరాముని రూపము సకల జీవులకు మోహము కలిగించెడిదిగ నుండెడిది. ఇదియొక చిత్రము. ఏజాతి వారికి ఆ జాతివారు నచ్చుదురు. మానవులలోనే స్థూలముగ ఏడు జాతులున్నవి. అందొకరికి ఇంకొకరు నచ్చరు. అట్టిది మానవులకు, జంతువులకు, పక్షులకు, దేవతలకు, రాక్షసులకు, వానరులకు– ఇట్లన్ని జాతులకు ఒక రూపము ఆరాధ్యమై నిలచుట రాముని రూపమందలి ప్రత్యేకత. స్త్రీలకు, పురుషులకు, బాలురకు, వృద్ధులకు కూడ రామ రూపము ఒకే విధముగ తన్మయత్వము కలిగించెడిది.

ఇన్ని మాటలేల. హనుమంతుడు త్రికాల జ్ఞాని. అన్ని యుగము లందుండు వాడు. నిరుపమానమగు యోగి. ఎదురులేని పరాక్రమము

గలవాడు. నిరంతరము సమాధి స్థితియందుండు వాడు. వైరాగ్యము నకు మేరువు వంటివాడు. భక్తియందు, జ్ఞానము యందు నారదాదు లను కూడ మించిన వాడు. నిరంతరము విశ్వాత్మునితో కూడియుండు వాడు. అట్టి హనుమంతుడు కూడ రూపాత్మకముగ దైవమును చూడవలెనన్నచో రామరూపమును చూచుటకే ఇచ్ఛగించును. అతనియందు పరమ వాత్సల్యము కలిగిన పరమాత్మ, అతనితో భాషింపవలెనన్నచో రామ రూపమునే ధరింపవలసి వచ్చినది. రామ రూపమునకు రామరూపమే సాటి!

# 32. వివాహ ధర్మము

రామాయణమందు లక్ష్మణస్వామి వాక్కుగ వివాహ ధర్మ మొకటి ప్రకటింపబడినది. శూర్పణఖ కామపరవశయై శ్రీరాముని కోరినది. శ్రీరాముడు సున్నితముగ ఆమెను తిరస్కరించినాడు. కామ పరవశయై, కామవాంఛ మిక్కుటముగ నుండగ ఒక స్త్రీ తనను సమీపించినపుడు ఎట్లు వర్తింపవలెనో రాముని వర్తనమున గోచ రించును. శూర్పణఖను నిర్మొహమాటముగ, సూటిగ తిరస్కరించినచో ఆమె మనసు గాయ పడును. శ్రీరాముడట్లు చేయలేదు. అట్లు చేయుట రాముని స్వభావమునకు విరుద్ధము. అతడు సుశీలుడు. ఎవ్వరిని నొప్పించుట కిష్టపడడు. అందువలన ద్వేషభావముతోకాక, సాదర భావముతోనే శూర్పణఖతో సంభాషించినాడు. తాను వివాహితుడనని, అదియు కాక తన భార్య తనతోనే యున్నదని తెలిపినాడు. అంతియే కాక తాను శూర్పణఖ నంగీకరించినచో సవతిగ నుండవలసి వచ్చు నని, శూర్పణఖ వంటి స్త్రీలు సవతిగ నుండుట భావ్యము కాదని తెలుపుచు ఆమెకు లక్ష్మణుని ఉపాయముగ చూపినాడు. స్త్రీల నవమానించు స్వభావము లేశమాత్రమైనను రామునియందు గోచరించదు. అయోధ్యలో మంథర యందు గాని, అడవిలో శూర్పణఖ యందుగాని రాముని ప్రవర్తనము అసామాన్యము.

శూర్పణఖ రాముడందించిన ఉపాయము ననుసరించి

లక్ష్మణుని చేరినది. లక్ష్మణుడు వివాహ విషయమై ఒక ధర్మము నావిష్క రించినాడు. తాను శ్రీరామచంద్రుని దాసుడనని, అతని ననుస రించుచు జీవిత మాసాంతము అతనికి సేవ చేయుటయే తన ఆశయమని తెలిపినాడు. తనను వివాహమాడినచో శూర్పణఖ కూడ తనతోపాటు సీతారాములకు దాస్యము చేయుచు జీవించి యుండ వలెనని పలికినాడు.

వివాహము కొరకు వరుని అన్వేషించువారు వరుని అంద చందములు, విద్యావినయములు, ఆర్థిక సంపత్తి, సంస్కారము మాత్రమేగాక, అతని ఆశయములను కూడ తెలియవలెను. వరుని ఆశయములతో వధువు ఆశయములు ఏకీభావము చెందునపుడు వివాహమున కుపక్రమించవలెను. రామ దాస్య వృత్తి నెన్నుకొనిన లక్ష్మణుని ఎవరు వివాహ మాడగలరు? లక్ష్మణునివలెనే సీతారాముల యందు భక్తి కలిగినవారే వివాహ మాడగలరు. అట్లు కానిచో వివాహము బంధమే అగును గాని ఆనందము నీయదు. ఆనందము నీయని వివాహము అసంబద్ధము. కనుక లక్ష్మణుడు కూడ సున్నిత ముగ శూర్పణఖను తిరస్కరించెను. తిరస్కరించు సమయమున ఒక విలక్షణమగు ధర్మమును ఆవిష్కరించెను. ఈ ధర్మమును సామాన్య ముగ విస్మరింపబడుట వలననే వివాహ సంబంధముల యందు ఘర్షణ యుండును.

# 33. అసుర లక్షణము

ధర్మయుక్తము కాని కోరిక కలుగుట, కలిగిన దాని నుండి మనసు మరలించుకొన లేకపోవుట, తనకు తన వంశమునకు, తన దేశమునకు హాని కలిగినను అట్టి కోరికను విసర్జించ లేకపోవుట అసుర లక్షణము. మహా మహిమాన్వితమగు లంకా సామ్రాజ్యము ఈ అసుర లక్షణముననే కూలినది. దానికి ప్రధాన కారకులు శూర్పణఖ మరియు రావణుడు. ఇరువురును కామ పరవశులే. కామపిశాచ మావరించినపుడు ఉచ్చనీచము లుండవు. అభిమాన ముండదు. మితిమీరిన మదముండును. రూప మందముగ నున్నను స్వభావము వికృతముగ నుండును. అహంభావ మధికమై తమను గూర్చిన అంచనాలు అత్యధికమై యుండును. గర్వమధికము కాగ సత్యమును గ్రహించు వివేకము శూన్యమైపోవును.

రామ లక్ష్మణుల చెంతచేరిన శూర్పణఖ యందు పై లక్షణము లన్నియు గోచరించును. ఆమె ప్రథమముగ శ్రీరాముని కామక్రీడ కాహ్వానించెను. శ్రీరాముడు సున్నితముగ తిరస్కరించుచు లక్ష్మణుని చూపెను. అపుడామె లక్ష్మణుని కోరినది. లక్ష్మణుడు కూడ తిరస్క రించుచు, ఆమెను రామునివైపుకు మళ్ళించెను. అపుడామె మరల రాముని కోరెను. ఇట్టి ప్రవర్తన అరుదుగ గోచరించును. తనను హేళన చేయుచున్నారని గాని, తిరస్కరించు చున్నారని గాని ఆమె భావింపలేదు. అభిమానము వదలి కామోద్రిక్తతతో అటునిటు మూడు

మార్లు తిరుగాడినది. రాముని వద్దకేగి, రాముని సూచనమేరకు లక్ష్మణుని వద్దకేగి, లక్ష్మణుని సూచన మేరకు మరల రాముని వద్ద కేగెను.

దొరికిన వస్తువేదైనను, దానిని ప్రోగుచేసుకొని ఒకచోటకు చేర్చుకొని అనుభవించుటకు ప్రయత్నించు స్వభావము గలది కనుకనే ఆమె శూర్పణఖ అయినది. నఖము లనగ గోళ్ళు. శూర్పము లనగ చేటలు. ఆమె చేటలవంటి గోళ్ళుగల హస్తములు కలిగియున్నది. అనగా పది చేటలు గోళ్ళ రూపమున అందుబాటులో యున్నవి. ధర్మా ధర్మ విచక్షణ లేక దేనినైనను ప్రోగు చేసుకొనుటకు ఉపకరణములుగ పదిచేటలు గోళ్ళుగ కలిగియున్నది. అనగ దశేంద్రియములతోను విచక్షణలేక వికృతముగ, విలక్షణముగ ప్రోగుచేసుకొని అనుభవించ వలెనను బుద్ధి యుండునని సాముద్రికము తెలుపుచున్నది. చేటల వంటి గోళ్ళు కలవారు శూర్పణఖ వంటి స్వభావము కలిగియుందురని బుద్ధిమంతులు తెలియవలెను. అట్టి వారిని దరిచేర్చుకొనినచో అంతయు వినాశకరమే. లంకా నాశనమునకు శూర్పణఖయే దారి చూపినది.

ప్రోగు చేసుకొను స్వభావము కలవారు స్వహిత మనుకొనుచు తమకు తామే అహితము గావించుకొందురు. అర్థకామముల సముపార్జనలో విచక్షణను విసర్జించినచో వ్యక్తి తనకు, తనవారికి కూడ వినాశము కలిగించుననే ధర్మము శూర్పణఖ వృత్తాంతము నుండి తెలియుచుండును. ఆధునిక కాలమున విచక్షణా రహితముగ అర్థకామముల వెంటపడు వారందరు ఇట్టివారే. తామున్న చెట్టు కొమ్మను తామే నరుకుకొను వివేకహీనులు వీరు. భవిష్యత్తున తమ ప్రవర్తనము తమకు విపత్తు కలిగించునని తెలియనివారు.

# 34. రూపము - గుణము

రామాయణమున దేవతా లక్షణములు, అసుర లక్షణములు గుర్తించుటకు వలసిన ఉపాయములు తెలుపబడినవి. మానవుల యందే దేవతా స్వభావము, అసుర స్వభావము గలవారున్నారు. వారిని గుర్తించు ఉపాయము శ్రీమద్రామాయణ మిచ్చు చున్నది. ఉదాహరణకు రావణ సంతతి పుట్టుకచే బ్రాహ్మణ సంతతి. కాని రజస్తమస్సులు అత్యధికమై ఆవరించి యుండగ అసురులై క్రమముగ వికృతరూపములు పొందినారు. గుణముల బట్టియే రూపము సుందరముగ గాని, వికృతముగ గాని మారుచు నుండును. చిర కాలము ధర్మకార్యము లొనర్చుచు, దైవారాధనము చేయు వారియందు దేవతా కళలు పెరిగి శోభాయమానముగ గోచరింతురు. అట్లే చిరకాలము అధర్మము నాశ్రయించి, స్వార్థ ప్రవృత్తితో జీవించువారు కళలు తగ్గి, కళ తప్పి, కాంతి విహీనముగను, వికృతముగను గోచరింతురు. గుణమును బట్టి రూపము రూపాంతరము చెందు చుండును. కొందరి యందు కళలు పెరుగుచు నుండును. కొందరు సహజముగ నున్న కళను కూడ కోల్పోవుదురు. మానవుల భావములు, భాషణములు, చేతలు ఉన్నతి కలిగించుచున్నకొలది కళ పెరుగుచు నుండును. వానికి విరుద్ధమగు భావము, భాష, చేత యున్నప్పుడు కళ తగ్గుట జరుగును.

శూర్పణఖ బ్రాహ్మణ స్త్రీ. ప్రజాపతియైన పులస్త్య మహర్షి

మనుమరాలు. పులస్త్య మహర్షి అత్యంత తేజోవంతుడు, కాంతి వంతుడు. సృష్టి యజ్ఞమున తనవంతు కర్తవ్యమును యజ్ఞార్థముగ నిర్వర్తించువాడు. కాని అతని మూడవ తరమున రావణ కుంభకర్ణాది మనుమలు, శూర్పణఖాది మనుమరాళ్ళు వికృత రూపులైరి. కారణము వారి స్వభావమే. వారి గుణ సముదాయమే. రావణుని అనుచరులలో విభీషణు డొక్కడే కాంతి గలవాడుగ నిలచెను. కారణమతని సత్వ గుణము. జాతిచేత గాక గుణము చేతనే వర్ణాశ్రమ ధర్మములను తెలియవలెను. విభీషణుడు శిష్టుడు. ఆచార సంపన్నుడు. శూర్పణఖ దుష్ట. వికారము లన్నియు ఆమెను చేరినవి.

శూర్పణఖ రామాయణమున ప్రవేశించు సందర్భమున ఆమె రూపమును వాల్మీకి మహర్షి వర్ణించినాడు. అట్టి రూప చిహ్నములు కలిగినవారు అసురులని మనము తెలియవలెను. శ్రీరాముని రూపమును కూడ వాల్మీకి మహర్షి వర్ణించినాడు. ఆ చిహ్నములు దైవీ స్వభావమును సూచించును. దీనినే సాముద్రిక మందురు.

జాతితో కాని, కులముతోకాని, వయసుతో కాని చెదరని కళ గలవారు సంస్కారవంతులు. వార్ధక్యమున కూడ వయసుకు తగ్గ రూపము, కళ సంస్కారుల కుండును. కళ హెచ్చుట, తగ్గుట వయసుతో కూడి కాక గుణముతో కూడియుండును. ఉదాహరణకు హనుమంతుడు కోతిరూపమున నున్నను అమితమగు ఆకర్షణము కలిగి, అందము కలిగి, తేజస్సు కలిగి అద్భుతమూర్తిగ గోచరించును. కోతిరూపమైనను బ్రహ్మతేజస్సు ఉట్టిపడుట వలన అట్టి శాశ్వతమగు ఆకర్షణ కలిగి యున్నాడు. శూర్పణఖ అట్లుకాక అతి వికృతముగ మార్పు చెందినది.

శూర్పణఖ ముఖము చూచుట కెవ్వరును ఇచ్ఛగించరు. ఆమె దుర్ముఖి. ఆమె కడుపు బానకడుపు. ఆమె కన్నులు ఎట్టి ఆకర్షణ లేనివి, విరూపమైనవి కూడ. ఆమె వెంట్రుకలు రాగిరంగులో మెరయు చుండును. ఆమె కంఠమునందు ఎట్టి మృదుత్వము లేక స్వరము పురుష స్వరముగ వినిపించును. ఆమె మాటయందు సౌమ్యము తక్కువ. భావము, భాష వక్రముగ నుండును. నడక ఏనుగు నడకవలె యుండును. సాటి స్త్రీలలో ఆమెపై ప్రీతిగలవా రెవ్వరును లేరు.

పై చిహ్నములు ఏ రూపమున గోచరించినను వారియందు హెచ్చరికగ మెలగుట సంస్కారుల లక్షణము.

వనవాసమున రాముడు జటలు దాల్చి, నారవస్త్రములను ధరించి, ఎట్టి ఆభరణములు, శరీర పోషణము లేకున్నను అతడు ఋషి సమూహములలో చంద్రునివలె ప్రకాశించుచున్నాడని వాల్మీకి మహర్షి తెలిపెను. జీవుల తేజస్సు, కళ, కాంతి వారికట్టి ఆకర్షణ మును, అందమును ఇచ్చును. అది వారి ఉత్తమ పరిణామ స్థితిని తెలుపును. బుద్ధిశీలురు రూపము నుండి గుణమును గ్రహింతురు. ఇదియొక సూక్ష్మము.

# 35. చెప్పుడు మాటలు

తప్పు చేసినవారు తమ తప్పును తెలుసుకొనలేక లోకమున యాగీ చేయుదురు. అల్లరి చేయుదురు. వీధిన పడి గోల చేయుదురు. తమ కన్యాయము జరిగినదని, తమ ఎడల దౌర్జన్యము జరిగినదని, తమకు జరిగిన అన్యాయము నెవ్వరును గుర్తించుట లేదని, నెత్తిన నోరు పెట్టుకొని అదే పనిగ ఇతరులను దూషించుచు వాపోవుచు నుందురు. ధీమంతులు తమ కన్యాయము జరిగినచో మౌనముగ భరింతురు. వాదము లాడరు. రోదనము చేయరు. మౌనమును చేపడుదురు. ఎవ్వరిని నిందింపరు. ధర్మాత్ములకు, అధర్మపరులకు గల ఈ వ్యత్యాసమును బుద్ధిమంతులు గమనింపవలెను.

తప్పు చేసినవారే తమ తప్పును కప్పిపుచ్చుకొనుటకై అసత్య ప్రచారములను చేయుచు, అనేక గుమ్మములను ఎక్కి దిగుచు నుందురు. తప్పుచేయని వారియందు నిందారోపణ జరిగినపుడు వారు మౌనముగ భరింతురు. కాలమహిమ యని, నిలకడమీద నిజము తెలియునని తమవంతు కర్తవ్యమును తలవంచి నిర్వర్తించు కొందురు.

శ్రీరాముడు పట్టాభిషేకమున కుద్యుక్తుడగు సమయమున ఉపద్రవ మొకటి ఏర్పడి వనవాసమున కేగవలసి వచ్చెను. రాముడు మారుమాటాడక వనవాసమున కుద్యుక్తుడయ్యెను. అట్టి ధీరత్వము

మానవలోకమునకే పరాకాష్ఠ. అట్టి రాముని చేరి, సీతమ్మను నిందించుచు ఆమెను భక్షించి వేతునని, తనను వివాహమాడమని శూర్పణఖ సీతమ్మపై కురికెను. రాముడు శూర్పణఖను నివారించి లక్ష్మణుని హెచ్చరించెను. తత్ఫలితముగ లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను ఖండించెను.

సంస్కార మున్నచో శిక్ష నంగీకరించి అనుభవించినచో లక్ష్మణ ఖడ్గ స్పర్శ కారణముగ శూర్పణఖ ఉత్తమగతులను పొంది యుండెడిది. శూర్పణఖకు ఇదమిద్ధమని ఒక రూపము లేదు. కనుక ముక్కు చెవులు తెగినను మరియొక రూపము దాల్చగలిగిన మాయావి ఆమె. సంకల్ప మాత్రముచేత రూపములను మార్చగల్గిన ఆమె కేవలము అల్లరి చేయుటకే ఖరదూషణాదుల యొద్దకు, రావణుని వద్దకు వెళ్ళి తెగిన ముక్కు చెవులు గలదియై మిక్కుటముగ తన కవమానమైనదని ఏడ్చినది.

లోకమున శూర్పణఖవలె జాలిపుట్టునట్లు ఏడ్చువారు, ఇతరులపై ఆరోపణలు చేయువారు మెండుగ నుందురు. వారిని వినినపుడు వారు చెప్పుచున్నది సత్య మనిపించును. వారియందు జాలి కలుగును. వారికి సహాయపడవలె ననిపించును. ఇట్టివారి యెడల నిదానముగ వివేకించనిచో ఆపదలు కలుగును.

శూర్పణఖ తన అకృత్యమును తెలుపక, సోదరులకు తనకు జరిగిన అపకారమును మాత్రమే తెలిపినది. భూతద్దము వేసి చూపించినది. ఆమె సోదరులు ఆమెవలెనే మూర్ఖులు. ఆమె చెప్పుడు మాటలు విని రాముని కపకారము తలపెట్టి సమూలముగ నశించిరి.

ఇందలి ధర్మ మేమనగ ఎవ్వరైనను నిందాపూర్వకముగ మాటాడినపుడు వారి మాటలను వినవచ్చునుగాని, వేగిరపడి తదనురూపమగు భాషణముగాని, కార్యముగాని చేయరాదు. సర్వ సాధారణముగ ఆవేశముగ నిందించుచున్న వారి యందే తప్పు లుండును. కనక నిదానించి, వివేకించి, విచారించి నిర్ణయము చేసుకొనవలెను. అట్లు కానిచో బుద్ధిమంతులు భ్రమకు, భ్రాంతికి లోనుకాగలరు.

# 36. ముక్కు - చెవి

శ్రీరాము డాజ్ఞాపింపగ, సర్వ లక్షణ లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను ఖండించెను. ముక్కు చెవులు ఖండించుట యందు అంతరార్థ మిమిడి యున్నది. వాసన చూచునది ముక్కు. వినికిడి నిచ్చునది చెవి. ఆకాశగుణము కలది చెవి. పంచేంద్రియములలో అత్యుత్తమ స్థానమున ఉండునది చెవి. వినికిడి ఆకాశగుణము. స్పర్శ వాయుగుణము. దానిని చర్మము ద్వారా పొందుదుము. అగ్ని స్వరూపమగు వెలుగును చూచునది కన్ను. ఇది మధ్యస్తమగు ఇంద్రియము. అటుపైన నాలుగవది జలము ఆధారముగ రుచి చూచునది జిహ్వ. చిట్ట చివరగ అవరోహణ క్రమమున ఏర్పడునది పృథివి. దాని గుణము గంధము. పృథివి గంధము, జలము రుచి, అగ్ని చూపు, వాయువు స్పర్శ, ఆకాశము శబ్దము. వీనిని అనుసంధానము చేయునవియే వరుసగా ముక్కు, నాలుక, కన్ను, చర్మము, చెవి. ఈ ఐదు జ్ఞానేంద్రియము లాధారముగ శరీరమున నున్న మానవుడు పంచభూతములతో కూడియున్న సృష్టిని అనుభూతి చెందుచు నుండును. తదనుగుణమగు శుభాశుభ వాసనలను ఏర్పరచుకొనును. విచక్షణ (బుద్ధి) కలిగిన వాడగుటచే మానవుడు విన తగినవి విన తగనివి, స్పర్శించ తగినవి తగనివి, చూచుటకు తగినవి తగనివి, రుచి చూచుటకు తగినవి తగనివి, వాసన చూచుటకు తగినవి తగనివి తెలుసుకొను చుండును. తగని విషయములం దాసక్తి

అశుభ వాసనల నేర్పరచును. తగిన విషయములం దాసక్తి శుభవాసనల నేర్పరచును. ఈ వాసన లన్నియు పంచేంద్రియములకు మూలమైన మనస్సు నావరించి స్వభావముగ నేర్పడును. ఇంద్రియార్థ ములు గోచరించినపుడెల్ల ఇంద్రియములు ఐదు రకములుగ వార్తలను మనసునకు చేరవేయును. మనసు బుద్ధితో సంప్రదించి, ఇంద్రియార్థ ముల విషయమున తగిన నిర్ణయము గావించుకొని వర్తింపవలెను. స్వభావమున అశుభవాసనలు మెండుగ నున్నపుడు విచక్షణ బలహీన ముగ నుండును.

శూర్పణఖ విచక్షణా రహితముగ రామలక్ష్మణులను కామక్రీడకై ప్రోత్సహించెను. వారు సున్నితముగ వారించినను విచక్షణ లేకపోవు టచే శూర్పణఖ ప్రవర్తనమున అతిక్రమణమును చూపెను. ఆమె యందలి కామవాంఛ ధర్మయుక్తము కాని స్పర్శను కోరెను. ఆమె స్వభావమంతయు అశుభ వాసనలతో నిండియున్నది. అట్టి స్వభావమును నియమించవలె నన్నచో పంచేంద్రియములు సంస్కరింపబడవలెను. వాసనలకు మూలమైన మనసు సంస్కరింప బడవలెను. ఆమె యందలి పంచకోశములు శిక్షింపబడవలెను. అనగా ఆకాశము నుండి పృథ్వి వరకు గల ఐదు కోశములు చక్కదిద్దబడ వలెను. ఆసాంతము ఆమె శుద్ధి చేయబడవలెను. అటువంటి శుద్ధి ఆమె కవసరము. అట్లు శుద్ధి చేయబడనిచో ఆ జీవికి నిష్కృతి లేదు. ఆమె నాసాంతము సంస్కరింపవలసి యున్నదని తెలుపుటకే లక్ష్మణుడు ఆకాశ గుణములను నిర్వర్తించు చెవులను, పృథివీ గుణమును నిర్వర్తించు ముక్కును ఖండించి వదిలెను. అనగా తమవద్దకు చేరుటకు శూర్పణఖ స్వభావము ఆసాంతము పరిశుద్ధి

చేయబడవలెనని తెలియజేయుటగ చదువరులు గ్రహించవలెను. ఏలయన శూర్పణఖను శిక్షించుటకు ఇతర ఉపాయములను వాడక లక్ష్మణుడు ముక్కు చెవులు కోయుటయే సముచితమని భావించుటలో గల అంతరార్థము స్వభావ సంస్కరణము, అశుభ వాసనా నిర్మూలనము.

మానవులను సుఖపెట్టునది గాని, దుఃఖపెట్టునది గాని వారి స్వభావమే. అట్టి స్వభావము శుభవాసనలతో నిండి యుండవలెను. అందులకే సదాచారము, శిష్టాచారము. దానికి వలసినది శ్రద్ధ, దీక్ష. శిష్టాచారము లేనివారు అతిక్రమించి ప్రవర్తించి, అశుభ వాసనలకు లోనగుదురు. అవి ఇంద్రియముల నాశ్రయించి అధర్మ ప్రవర్తనము నకు ప్రోత్సహించును. అపుడింద్రియ నిగ్రహము లోపించును. ఇంద్రియలోలురై, పంచేంద్రియ వాసనలకు బానిసలై నశింతురు. శూర్పణఖ అట్లు నశించునని హెచ్చరించుటకే ముక్కు చెవులను ఖండించుట. అనగా "స్వభావమును సంస్కరించుకొనుము. లేనిచో నశింతువు" అని లక్ష్మణుడు హెచ్చరించెను. ఈ హెచ్చరిక మానవు లందరికిని ఆవశ్యకము. లక్ష్మణుడు కాలస్వరూపుడు. ఆదిశేషువు అంశతో ఆశ్లేష నక్షత్రమున జన్మించినవాడు. అతడు కాలము రూపమున ఇంద్రియలోలురు నశింతురని ఈ ఘట్టమున తేటతెల్లము చేసినాడు.

# 37. ఇంద్రియ మాలిన్యము

మలిన స్వభావులు వక్రభాషణము చేయుదురు. స్వభావము నిర్మలమైనపుడు మాత్రమే చూచినది, వినునది సవ్యముగ (సత్యముగ) గోచరించును. ఉన్నది ఉన్నట్లుగ చూచుట అందరికిని సాధ్యము కాదు. ఉన్నదానిని ఉన్నట్లుగ గ్రహించుటకు సత్యవంతులై యుండ వలెను. సత్యవ్రతము వలన మాత్రమే ఉన్నది స్పష్టముగ గోచరించును.

సత్యవ్రతులు కలియుగమున అరుదు. ఇతర యుగములందు కూడ మలిన స్వభావులు సత్యమును దర్శించరు. ఉన్నది చూచుట వేరు, తాము చూచినది ఉన్నదనుకొనుట వేరు. ఉన్నది సత్యమైనను చూచు వాని నిర్మలత్వమును బట్టి గోచరించుట యుండును. కనుకనే అవగాహనా భేదముండదు. అభిప్రాయ భేదము లుండును. తాను చూచున దొకటి, గ్రహించునది మరియొకటి, తాను గ్రహించినది వివరించుట ఇంకొకటి. ఇట్లు ఒకరినుండొకరికి విషయ మందింపబడి నపుడు ఇది సామాన్యముగ సత్యదూరమై నిలచును. కనుక చెప్పుడు మాటలు వినవద్దని పెద్దలు హెచ్చరింతురు.

చెప్పుడు మాటలు వినవద్దనినపుడు, వినకుండుటగా కాక, విచక్షణతో వినుమని అర్థము. విచక్షణ లేనపుడు విన్నది నమ్ముట జరుగును. అసత్యము ప్రాతిపదికగ తదుపరి చర్యలుండును. దాని వలన ప్రవర్తనమున పొరపాట్లు, ప్రమాదములు దొర్లును. జీవితము చిక్కు పడును. ఒక్కొక్కమారు ప్రాణాపాయము కూడ ఏర్పడును.

శూర్పణఖ బోరుబోరున ఏడ్చుచు రాముడు తన ముక్కు చెవులు ఖండించినాడని, తనను విరూపిగ చేసినాడని ఏడ్చుచు, మొత్తుకొనుచు శోకార్తయై విషణ్ణమగు ముఖముతో సోదరుడగు ఖరుడికి విన్నవించెను. మలిన స్వభావుడగు ఖలుడు నిజమెరుగనివాడై త్వరపడి శూర్పణఖను విరూప చేసిన వానిని దండింతునని మాట ఇచ్చినాడు.

చదువరులకు సత్యము తెలుసుగనుక ఖరుడి ప్రవర్తన దుష్ప్రవర్తనగ గోచరించును. శూర్పణఖ ప్రవర్తన కూడ చదువరులు హర్షింపలేరు. కాని తమకు ప్రీతిపాత్రమైన ఒక వ్యక్తి తమవద్దకు వచ్చి, కన్నీరు మున్నీరుగ నేడ్చుచు ఇతరులను గూర్చి ఆరోపణలు చేసినపుడు నిదానించి వినుట చేతుమా, లేదా అనునది ప్రశ్న. మనవారు మనకి తెలిపినది మనకు సత్య మనిపించును. నిజ మెరుగక మనకు తెలిసిన విషయముపై మనము నిర్ణయములు చేయు చుందుము.

సామాన్యముగ ఆరోపణలు చేయు వారియందే దోష ముండును. కనుక ఆరోపణలు చేయువారి విషయమందు వినువారు హెచ్చరికగ నుండవలెను. లేనిచో మోహమునపడి ఖరుడివలె తప్పుడు నిర్ణయములు గావించి ప్రాణముల పైకి కొనితెచ్చుకొందుము. ఒక వివాదమందు గాని, ఒక ఆరోపణ యందుగాని తన, మన భేదము లేక సత్య దర్శనము చేయుట వలన నిరపాయమగు నిర్ణయములు చేయవచ్చును. లేనిచో కష్టములు, నష్టములు కొనితెచ్చుకొనుటయే జరుగును.

# 38. ఖర, త్రిశిర, దూషణుల వధ

శ్రీరాముని పరాక్రమమునకు మచ్చుతునక వంటిది ఖర దూషణాది రాక్షస సంహారము. తానొక్కడే పదునాలుగు వేలమంది రాక్షసులతో పాటు దూషణుని, త్రిశిరుని, ఖరుని మూడు ముహూర్త ముల కాలమున సంహరించినాడు. ధనుస్సు ధరించిన వారిలో శ్రీరాము డగ్రగణ్యుడు. ఒంటరిగ రాక్షస సమూహమును సంహరించి మహా పరాక్రమవంతులగు దూషణుని, త్రిశిరుని, ఖరుని కూడ సంహరించినాడు. ఋషుల మనోభీష్టమును నెరవేర్చినాడు. దండకా రణ్యమును సురక్షితము గావించినాడు. ఇట్టి పరాక్రమము మరి ఏ ధనుర్ధారియు నిర్వర్తించినట్లు పురాణేతిహాసమున గోచరింపదు. మానవుడుగ యిట్టి పరాక్రమము చూపిన నరుడు మరొకడు లేడు. ఒక పథకము ప్రకారము ఋషులందరును రాముని ఉపాయముగ భావించి, నియమించి తమ తపోదీక్షలను నిర్విఘ్నము కావించుకొని నారు. శ్రీరాముడు విస్తారముగ క్షాత్ర ధర్మమును నిర్వర్తించి చూపినాడు. రాముని మించిన క్షత్రియుడు భూమిపై మరియొకడు లేడు అను కీర్తిని పొందినాడు.

ఈ వృత్తాంతమందలి రహస్యము పాఠకులు గమనింప వలసినది మరియొక టున్నది. రాముడు నరుడుగ అవతరించినాడు. ఆత్మ స్వరూపుడుగ జీవించినాడు. మనమందరము కూడ నరులమే.

ఆత్మ స్వరూపులమే. కాని మనలను మనము మరచి మన దేహము, రూపము, స్వభావము మనముగ భావించి జీవించుచున్నాము. అహంకారవశమై నిజస్థితిని మరచుచుందుము. కనుకనే శరీరము చేతను, ఇంద్రియముల చేతను, మనస్సు చేతను నిత్యము జయింప బడుచుందుము. ఆత్మ స్వభావము కారణముగ అపజయము పొందుచు నుండును. కనుకనే మరల మరల ఆత్మ విజయమునకై జన్మలెత్తుచు నుందుము.

మనయందలి అహంకారమే ఖరుడు. ఖరమనగ గాడిద. మనలను మనము మరచుటచే అహంకార మావరించి గాడిదలవలె ప్రవర్తించు పరిస్థితి ఏర్పడు చుండును. ఇంగిత జ్ఞానము లేక అహంకారులమై ప్రవర్తించుచు నుందుము. ఖరుని అనుచరులే త్రిశిరుడు, దూషణుడు. ఇందు త్రిశిరుడు త్రిగుణముల ప్రేరణచే వర్తించు మనస్సు. దూషణుడు గుణాత్మకమగు మనస్సుచే ప్రేరేపింప బడు ఇంద్రియ సముదాయము. దూషణుడు ఇంద్రియములను దుర్వినియోగము చేయును. త్రిశిరుడు త్రిగుణములచే ప్రేరేపింపబడి తీరుబాటులేక జ్ఞానరహితమగు కార్యముల నొనర్చును. ఖరుడు అహంకారవశముచే స్వనాశనమునకు కృషి సలుపుచు నుండును. ఇట్లు మనయందే ఈ ముఫ్వురు రాక్షసులును యున్నారు. వీరు కారణముగ మనము చేయు పనులన్నియు అజ్ఞాన పూరితమై అసంఖ్యాకముగ నుండును. వారే పదునాలుగువేల రాక్షసులు.

శ్రీరాము డాత్మవంతుడు గనుక అహంకారమును, త్రిగుణాత్మక మగు మనోభావములను, అసంఖ్యాకమగు ఇంద్రియార్థములను

ఒంటిరిగ జయించి నిలచెను. అట్లే ఆత్మసాధకులు కూడ తనయందలి ఇంద్రియములను, మనస్సును, అహంకారమును జయించవలెను. అందులకు మనకు ఋషుల ఆశీర్వచనము ప్రధానమని రామకథ తెలుపుచున్నది. ఆశీః బలమున ఖర, త్రిశిర, దూషణుల వధ జరుపుకొనుట మన కర్తవ్యము. సాధకులు ఈ ఉపాఖ్యానమున పై సందేశమును బడయుదురు గాక!

# 39. అకంపనుని విశిష్టత

ఖర, త్రిశిర, దూషణాదులతో పాటు పదునాలుగు వేల రాక్షసులను ముహూర్తకాలమున రాముడొక్కడే ఒంటరిగ సంహ రించుట చూచినవాడు అకంపనుడు. అతడు సార్థక నామధేయుడు. భీకర యుద్ధమున తనవారందరు మరణించుట సాక్షీభూతముగ చూచినవాడు  అకంపనుడు. అతనియందు ఎట్టి ప్రకంపనములు కలుగలేదు. రామ దర్శనమున అతడు చిత్రముగ స్ఫూర్తి చెంది అకంపనుడైనాడు. జన్మతః అసురుడైనను రజస్తమో కంపనములు లేక సత్యమున నిలచి, యథార్థమును దర్శింపగలిగినాడు. రాముని మహత్తును గ్రహింప గలిగినాడు. దివ్యత్వమును గుర్తింప గలిగినాడు. ఇది అసామాన్యమైన విషయము. అసురులకు రజస్తమస్సు లధికముగ నుండును. వారు యథార్థమును గుర్తించలేరు. సామాన్య జనులు కూడ స్థిరముగ సత్యమున లేనపుడు యథార్థమును గుర్తించుట కష్టము.

సామాన్య మానవులకన్న, రజస్తమస్సు లధికముగ కలవారు అసురులు. వారియందు రాగద్వేషములు కూడ అతి శీఘ్రముగ ఉత్పన్న మగుచుండును. జరిగిన సన్నివేశమున సామాన్యులు కూడ కలత చెందుదురు. తన కండ్ల ఎదుటనే తన వారి నందరిని సంహరించిన రామునియందు మహత్తును, దివ్యత్వమును చూచుట అసామాన్య విషయము. దివ్యత్వమును సామాన్యులే గుర్తించ లేనపుడు

అసురుడైన అకంపనుడు ఎట్లు గుర్తించినాడు! ఈర్ష్య, ద్వేషము, క్రోధము  సహజ లక్షణములుగ గల అసురులు తనవారిని చంపిన వానియందు గల మహత్తును దర్శించినాడు. దివ్యత్వమును దర్శించి నాడు. ప్రకంపనముల లేక అకంపనుడై నిలచినాడు. అంతియే గాక బుద్ధిమంతునివలె తన కర్తవ్యమునందు చురుకుగ మేల్కొంచి నాడు. రావణుని బంటు గనుక, రావణునకు ఖర, త్రిశిర, దూషణ మరణము తెలియపరచుట తన తక్షణ కర్తవ్యమని భావించినాడు. అంతేకాక తన రాజగు రావణుని హితము కోరి రాముని ఎదురించ వలదని తెలిపినాడు.

# 40. శ్రీరామ ప్రశంస

ఖర, త్రిశిర, దూషణ సంహారము చూచిన నిర్మల మనస్కుడగు అకంపనుడు రామునియందు చూచిన దివ్యగుణములను రావణుని హితముగోరి స్పష్టముగ తెలిపినాడు. అకంపనుడు రాముని గూర్చి చేసిన ప్రశంస నిత్య మననమునకు అర్హమైనది. అవి అరణ్యకాండ యందలి ముప్పది యొకటవ సర్గయందలి పదిహేనవ శ్లోకము నుండి ప్రారంభమై సాగును. అవి ఈ విధముగ గోచరించును.

"శ్రీరాముడు మంచి రూపశీలి. యువకుడు. ఆబోతు మూపురము వంటి మూపురములు గలవాడు. పొడుగాటి గుండ్రని బాహువులు గలవాడు. వీరుడు. కాంతిమంతుడు. మహాయశుడు. నిరుపమానమగు పరాక్రమవంతుడు. మహా తేజోవంతుడు. సృష్టి యందలి సమస్త ధనుర్ధరులలో అగ్రగణ్యుడు. దివ్యాస్త్ర సంపన్నుడు. మహా శౌర్యవంతుడు. అతనికి దేవతా సహాయము తోడుకానక్కర లేదు. అతడే దేవతలకు దిక్కు. శ్రీరాముడు ఎవరు యేయే ఆయుధము లతో పోరుటకు తలపడితే వారికి ఆయా ఆయుధములతోనే ఎట్ట ఎదుట నిలబడి అందరిని సంహరించినాడు. ఇది నిస్సందేహముగ దివ్యశక్తియే. పదునాలుగు వేలమంది అసురులకు పదునాలుగువేల రూపములతో, సరిసమానమగు ఆయుధములతో ఎదుర్కొని సంహ రించినాడు. ఇది అద్భుతమగు మాహాత్మ్యము.

శ్రీరాముడు మహాయశుడు. అసాధ్యుడు. అతడు మహాజల ప్రవాహమును అడ్డగించగలడు. నక్షత్రములను, గ్రహములను, ఆకాశమును తన శర పరంపరలతో అనాకాశము చేయగలడు. అతడు మునిగిపోతున్న భూమిని సైతము లేవనెత్తగల కాంతి గలవాడు. లోకములన్నిటిని సంహరించి మరల యథాతథముగ సృష్టించగలడు. సురలు, అసురులు ఏకమై అతనితో పోరినను అతనిని జయింపలేరు.

ఇట్టి అవగాహన సత్యదర్శనము, సత్వగుణము గలవానికే తగును. కనుక అకంపనుడు అసురులలో శ్రేష్ఠుడు.

# 41. వైచిత్రి

ముందు తెలిపిన రెండు ధర్మ కుసుమములలో అకంపనుని యందు గల సత్వగుణము వివరింపబడినది. రామ దర్శనమున అకంపనుని యందు పూర్వ సంస్కారము కారణముగ సత్యమగు దివ్యదర్శనము జరిగినది. కనుక అతని అకంపనత్వమును ప్రశంసించుట అనుచితము.

కాని చిత్రమేమనగ అతడు జన్మతః అసురుడగుటచే సహజ మగు కపటబుద్ధి కూడ వెనువెంటనే వ్యక్తమైనది. రాముడు అజేయుడని తెలుపుచు, రాముని హతమార్చుటకు రావణుని బంటుగ ఉపాయము చెప్పినాడు. అజేయుడు జయింపబడుటెట్లు సంభవము? అంతలోనే అసురబుద్ధి అంతర్ జ్ఞానమును కప్పివేసినది. మొత్తము సృష్టినే సంహరించి, మరల సృష్టి చేయగలవాడు రాముడని వివరించుచునే మరల రాముని జయించు కపటోపాయము ఉటంకించినాడు. జగన్నాటకమున అందరును పాత్రధారులే. కాలము ననుసరించి నడువవలసిన వారే. కాలము చేతనే అందరును ప్రేరణ పొందుదురు. కానిచో ప్రత్యక్షముగ రామ దర్శనము పొందిన అకంపనునికి, రామునికి కీడు కల్గించు భావ మెట్లుతోచును? ఇది చిత్రము కాదా! జీవులు ఎంత తెలిసిన వారైనను, అనుభవము కలవారైనను వారి నైజమే పైచేయి కాగలదు. అన్నిటికన్న మిన్నగ పైచేయి గలది కాల మొక్కటియే. రాబోవు ఘట్టములలో కాలమే పై చేయిగ పాత్రలను

కదిపి, రావణ సంహారమునకు మార్గము సుగమము చేసినట్లుగ తెలియ నగును. కైకేయి వరములను కోరుట నుండి రావణ మరణము వరకు కాలము పావులను కదిపినట్లుగ, తదనుగుణముగ రాముడు నడచినట్లుగ గోచరమగును. కాల ప్రవాహమును అడ్డుకొను వారెవ్వరును సృష్టిలో లేరను సత్యము తెలియజేయు సంఘటనలలో అకంపనుడి కపటోపాయము ఒకటి.

# 42. శ్రీరాముని కర్తవ్య దీక్ష

నరులు మాత్రమే రావణుని సంహరించు అవకాశము కలిగి ఉన్నారు. కనుకనే శ్రీమహా విష్ణువు మానవ రూపమును ధరింపవలసి వచ్చినది. శ్రీరాముడు మహా పరాక్రమవంతుడు, అనుపమాన తేజోవంతుడు అయియున్నను, నూటికి నూరుశాతము నరునిగనే వర్తించెను. అతని ప్రవర్తనమునకు మెచ్చి ఋషులు శస్త్రాస్త్రములను, దివ్యాయుధములను అందించినారు. నరులలో రామునితో సరిపోలిన మరియొక నరుడు ఉండుట అసాధ్యము. అతని ప్రవర్తనము ధర్మమునకు ప్రతిరూపము. కనుకనే ఋషులు, దేవతలు అతనిని అనేక విధములుగ ప్రోత్సహించుట, అతనికి సహకరించుట చేసిరి.

అంతఃశ్చేతనతో కూడ శ్రీరాముడు తాను దైవమని భావింప లేదు. తనని తాను మానవుడుగనే త్రికరణశుద్ధిగ నమ్మెను. మానవుడు ధర్మ ప్రవర్తనము చేత, దీక్షతో కూడిన విద్యాభ్యాసము చేత, వినయము చేత సుక్షత్రియ జననము చేత, నిరుపమానమగు కళ్యాణ గుణములు పొందినాడు. అన్నియు పురుష ప్రయత్నముచేత పొందినవే. పురుష ప్రయత్నమందలి త్రికరణశుద్ధి, ధర్మాచరణ బుద్ధి కారణముగ అతనికి ప్రకృతి సహకారము అమితముగ లభించినది. ఇది మానవులకు ప్రోత్సాహకరమగు విషయము. మానవులు కూడ పై తెలిపిన రెండు విషయములను ఆచరణ యందుంచిన ప్రకృతి సహకారము లభించ గలదు. కష్టనష్టములున్నను ధీశక్తితో, ధర్మబుద్ధితో పరిష్కరించుకొనగల

స్థైర్యము లభించును. ప్రకృతి సహకారము కూడ లభించును. నిజము నకు మానవున కసాధ్య మేమియు లేదు. మానవుడు మహనీయు డగుటెట్లో రామకథ స్పష్టముగ వివరించు చున్నది. రాముని ఆదర్శముగ గొని ధర్మమును, కర్మమును నిర్వర్తించువారు క్రమముగ శక్తిమంతులు కాగలరు. కష్టనష్టములను భరించు ఓర్పు కూడ వారి కబ్బును.

శ్రీరాముడు మానవాతీతమగు భావనము, భాషణము, వర్తనము జరుపకపోవుట వలననే రావణుని సంహరించు అర్హత పొందినాడు. రావణవధకు ప్రథమమగు అర్హత అదియే.

మాయలేడిని చూచిన లక్ష్మణుడు నిశ్చయముగ అది మృగము కాదనియు, మారీచుడనియు విస్పష్టముగ పలికినాడు. కాని సీతమ్మ కాలముచే ప్రచోదితమై ఆ మాయలేడిని, అథవా దాని చర్మమును తెచ్చియిమ్మని కోరినది. అది మానవ సహజమగు కోరిక. ఆ మృగము వలదని లక్ష్మణుడు, కావలెనని సీత బలముగ తెలిపినారు. దానికి రాముని పరిష్కారము మానవునిగ సమంజసమే.

రాముడు క్షత్రియుడు. మృగములను వేటాడుట రాజునకు కర్తవ్యమై యున్నది. భార్య అరుదుగ కోరిన కోరికను తీర్చుట కూడ అతని కర్తవ్యము. ఒకవేళ కనబడిన మృగము మారీచుడే అయి యున్నచో అసురవధ కూడ అతడి కర్తవ్యము. ఋషులను హింసించు అసురుల నందరిని వధింతునని రాముడు మాట యిచ్చినాడు. కనుక కనబడుతున్న మృగము విషయమున ఉపేక్ష తగని పని. మృగమును వేటాడు ప్రయత్నమున సీతమ్మకు తగిన రక్షణ కల్పించుట కూడ కర్తవ్యమే. కనుక లక్ష్మణుని రక్షకుడిగ ఏర్పరచినాడు. కేవలము

కర్తవ్యమును నిర్వర్తించు పూనికయే మృగమును వేటాడు నిశ్చయముగ ఏర్పడినది.

శ్రీరాముని నిర్ణయము సమగ్రము. లక్ష్మణునికున్న జ్ఞానము తనకు లేకుండునా? తప్పక యుండును. లక్ష్మణుడు అది మృగము కాదు, మారీచుడని తెలిపినపుడు మారీచుని వధించు కర్తవ్యము రాముని ప్రోత్సహించినది. మృగము కాదు, మారీచుడు అని సీతమ్మకు కూడ తెలియ గలదని కూడ రాముడు భావించి యుండవచ్చు. శ్రీరాముడు అది మాయా మృగమని భావించుట చేతనే సీతమ్మకు పరిరక్షణ కల్పించి, మృగమును వేటాడుటకు పూనుకొనినాడు. కాలము రూపమున విధి జన్మకారణమును ఆవిష్కరించినది. రావణ వధకు అంకురార్పణ జరిగినది. ఈ ఉదంతమున లక్ష్మణుని యొక్క వర్తనము కూడ ప్రశంసింపవలసినదే. భరింపరాని అవమానమునకు గురిచేయబడిన లక్ష్మణుడు రాముని చేరుటకు నిర్ణయించుకొనెను. సీతమ్మ ప్రకృతికాగ, శ్రీరాముడు పరదేవుడు. ముముక్షువగు జీవుడు ప్రకృతిని మన్నించును. కాని పరమపదమును చేరుటకే యిచ్చగించును. పరిసరజీవుల సాక్షిగ లక్ష్మణుడు గర్హించు ప్రకృతిని వదలి పరమును చేరెను.

# 43. విధి నిర్ణయము

పురాణేతిహాసములను పరిశీలించినపుడు తరచు సందర్భపడు సన్నివేశము ఒకటి యున్నది. ఋషులైనను, మహాపురుషులైనను, సాధ్వీమణులైనను, దైవాంశ సంభూతులైనను కాలము రూపమున విధిచే పాలింపబడుదురు. వంచింప బడుదురు కూడ. విధిచే నిర్ణయింపబడిన సంకల్పము కాలము రూపమున జ్ఞానులను సైతము తొందర పెట్టును. అట్టి సమయమున హితవు కోరి ఎవరైనను వారించినను దానిని సున్నితముగ విస్మరించి విధి సంకల్పమునకు తలవగ్గుదురు.

సీతారాములు తెలియనివారు కాదు. పూర్ణజ్ఞానులు. వారి నుండి తెలివితక్కువ పని జరుగుట అసాధ్యము. కాని ఇరువురును కూడ మాయలేడి సందర్భమున త్వరపడిరి. పొరపడిరి. ఇట్టి పొరపాటు సర్వజ్ఞులయందు కూడ ఏర్పడవచ్చును అనునది ఒక విశేషమగు ధర్మము. విధి వారిరువురిని త్వరపెట్టినది. వారిపై మాయ ప్రసరించి నది. మాయలేడికై మోహపడిన సీతమ్మను చూచి లక్ష్మణుడు తక్షణమే శంకించినాడు. మాయలేడిని చూచీ చూడడముతోనే శ్రీరాముని హెచ్చరించినాడు. స్పష్టముగ శ్రీరామునితో ఇట్లు పలికినాడు. "రాజా! ఈ మృగము మారీచుడు అనిపిస్తోంది. మారీచుడు చిత్తము వచ్చిన రూపముతో ఈ వనమున తిరుగుతూ ఉంటాడు. వేటాడడానికి వచ్చే

రాజులను యిలాంటి మాయా రూపముతో మోసముచేసి, చంపివేసి వారి మాంసమును తింటూ ఉంటాడు.

మేఘాలలో గంధర్వ నగరము ఎంత సత్యమో ఈ జింక అంత సత్యము. ఇది నిశ్చయముగ మారీచుని మాయయే. అతడే ఈ జింకరూపమును ధరించినాడు. ఇట్టి విచిత్రమైన జింక జగత్తులో ఎక్కడను ఉండదు. ఇది మాయజింక. సందేహము లేదు. నీవు జగతీనాథుడవు. నీకు తెలియని దేమియు లేదు."

ఇట్లు దృఢమైన నిశ్చయముతో లక్ష్మణుడు పలికినప్పటికిని అతడి హెచ్చరికను శ్రీరాముడు తనకు తోచిన తర్కముతో సున్నితముగ నెట్టివేసినాడు. లక్ష్మణుని హితవాక్యమును త్రోసిపుచ్చుటతో అపార మగు కష్టమునకు, దుఃఖమునకు లోనైనాడు. కాలము రూపమున విధి శ్రీరాముని జగత్కళ్యాణమగు రావణ సంహారము వైపునకు మళ్ళించినది. పట్టాభిషేకము ప్రసక్తి ఏర్పడిన నుండి శ్రీరాముని కథ అతడి కతీతముగనే నడచినది. విధియే వనవాసమునకు తెర తీసినది. విధియే దండక వనమును చేర్చినది. విధియే పంచవటిని చేర్చినది. విధియే మాయజింక రూపమున భరింపరాని కష్టములోనికి శ్రీరాముని నెట్టినది.

ధర్మాత్ముడు, సత్యసంధుడు, కారుణ్యమూర్తి వంటి శ్రీరాముడే విధివంచితుడైనపుడు, ఇక ఇతరజీవుల గూర్చి చెప్పవలసిన దేమున్నది! విధి ఎప్పు డనుగ్రహించునో, ఎప్పు డాగ్రహించునో జీవుల కెట్లు తెలియగలదు?

విధి లీల లెట్లున్నను రామునివలె కర్తవ్యోన్ముఖులై ధర్మబుద్ధితో జీవించుటొక్కటే ఉపాయమని, జీవుని యొక్క తెలివితేటలు, సమర్థత, పరాక్రమము కూడ అట్టి సమయములందు జీవులను రక్షింపలేవని తెలియుచున్నది. విధి నిర్ణయము దాటరాదని, ఆ నిర్ణయమునకు తలవగ్గి, తదుపరి కర్తవ్యమున నిలచుటే మార్గమని తెలియుచున్నది. అట్టి సమయములందు తెలివి, శాస్త్రము, సంకల్పబలము కూడ అక్కరకు రావని తెలియుచున్నది.

# 44. తరణోపాయము

“బంగారు జింక రాక్షస మాయ అయినచో ఛేదించి, రాక్షసుని సంహరిస్తాను. సత్యమే అయినచో జింకను పట్టుకొని వస్తాను. చేతికందనిచో శరముతో వధించి దాని చర్మము సీతమ్మ కొరకు తెస్తాను” అని రాముడు లక్ష్మణుని సమాధాన పరచినాడు.

లక్ష్మణుడు తలచినట్లు అది మాయజింకయే. మారీచుడే అయినచో రాముడెట్లును వధించును. ఋషులకిచ్చిన మాట ననుస రించి రాక్షస సంహారము రాముడు తన కర్తవ్యముగ నెంచుకున్నాడు. కనుక జింక ననుసరించుట సముచితమే. మాయకానిచో జింకనుగాని జింక చర్మముగాని సీతమ్మ కిచ్చుట కూడ సముచితమే. రాజులు ధనుర్విద్యా వినోదము కోసము, మాంసము కోసము జింకలను వేటాడి సంహరిస్తూ ఉండటం పరిపాటియే గనుక, ఆ జింకను వేటాడుట సముచితమే.

కాని రాము డూహించనిది జరిగినది. మారీచుడు మరణించు చుండగ రావణుని సలహా మేరకు మారీచుడు రాముడి కంఠ స్వరముతో “హా సీతా! హా లక్ష్మణా!” అని ఆక్రోశించినాడు. ఆ కంఠస్వరము రాముని కంఠస్వరముతో సరిసమానమై ధ్వనించినది. దానితో రాముని ఊహ తలక్రిందులైనది. కథ మలుపు తిరిగినది.

తాను లేని సమయమున సీతమ్మ కాపద కలుగకూడదని లక్ష్మణుని రక్షగ నుంచినాడు. కాని కంఠధ్వని సీతమ్మను కలవర

పరచినది. కలవరపడిన సీతమ్మ తన స్వభావమునకు విరుద్ధమగు అనేకమగు దుర్భాషలను లక్ష్మణునిపై సంధించినది. ఇది చాల విచిత్రమైన విషయము. తనను మాతృమూర్తిగ భావించు సర్వ లక్షణ లక్ష్మణుని అట్లు దుర్భాషలాడుట ఆశ్చర్యకరము. రామునిపై తనకు గల ప్రేమాతిశయముచే రాముని కంఠముచే సీతమ్మ కలవరపడి, తనకు రాము డేర్పరచిన రక్షణను త్రోసిపుచ్చినది. కలవరమందున్న మనసు పరిపరివిధములుగ భావించుచు భాషించుట కద్దు. కాని సీతమ్మవంటి మహాజ్ఞాని, ఉత్తమోత్తమ సంస్కారము గల జీవి ఇట్లు మాట్లాడునా? అని అనిపించును. మాట్లాడవచ్చు ననునది సత్యము.

మాయలేడిని కోరుటలోగాని, లక్ష్మణుని దూషించుటలోగాని సీతమ్మ చూపిన ప్రవర్తనము ఆమె కపరిమితమైన దుఃఖమును కలిగించినది. విజ్ఞులగు వారు కూడ ఈశ్వర సంకల్పాధీనులే గాని, తమపై స్వాధీనము కలవారు కాదని ఈ ఘట్టము తెలుపుచున్నది. ఎంతో సంస్కారమున్నను, ఎంత తెలిసినను కాలము రూపమున మోహ మావేశించినపుడు జీవులు తప్పించుకొనలేరని తెలియు చున్నది. సర్వము ఈశ్వరాధీనమే. జీవుడు తనపై తను స్వామిత్వము నెరపెద ననుకొనుట అజ్ఞానమే కాగలదు.

తాను పట్టుబట్టి మాయజింకకై శ్రీరాముని నియమించుట, శోకముతో కూడిన అజ్ఞానముతో లక్ష్మణుని దూషించుట, తరువాతి దినములలో సీతమ్మనెంతయో బాధపెట్టి యుండవచ్చును. ఆ బాధా నివారణమునకు రామస్మరణమే తరణోపాయమని భావించి యుండ వచ్చును.

సామాన్యజీవులు జరిగిపోయిన సంఘటన యందలి తమ

పొరపాట్లను గుర్తించి ఎంతయు బాధ చెందుచు నుందురు. పశ్చాత్తప్తు లగుచుందురు. వారికి తరణోపాయము కూడ రామ స్మరణమే! దైవ స్మరణమే! దైవ స్మరణమే ఉపశాంతిని కలిగించగలదు. తమను తాము విమర్శించుకొనుట వలన ఎట్టి ప్రయోజనము సమకూరదు. ఆత్మనింద అనుచితము కాదు. ఆత్మ పరిశీలనము పరివర్తన మిచ్చును. బాధా నివారణమునకు దైవ స్మరణయే ఉపాయము.

# 45. లక్ష్మణుని స్థితప్రజ్ఞత్వము

మారీచుడు చేసిన ఆక్రందనమునకు సీతమ్మ భయపడినది. ఆ ఆక్రందనము రాముడే గావించినాడని భావించినది. ఆమె ప్రాణము తల్లడిల్లినది. తన రక్షణకై ఏర్పరచిన లక్ష్మణుని రాముని రక్షణార్థమై త్వరపడమని ఆజ్ఞాపించినది. రామునిపై గల ప్రేమాతిశయముచే, కదలక మెదలక యున్న లక్ష్మణుని దూషించినది. అతని శీలమును కూడ శంకించినది. తన ప్రాణములు తాను తీసుకొనుటకు సంసిద్ధపడినది.

వైదేహి మాటలు లక్ష్మణుని అమితముగ బాధించినవి. ఎర్రగ కాల్చిన ఇనుపబాణములు చెవులలో గుచ్చినంత బాధ కలిగినది.

"అన్నగారైన శ్రీరాముడు అజేయుడు. అతనిని జయించుట ఎవ్వరికిని శక్యము కాదు. అతనితో పోరాడ గలవాడు సృష్టిలో ఎవ్వరునూ లేరు. అతనిని సంహరించుట ఎవరితరము కాదు. దేవ దానవు లందరు కలసి రామునితో యుద్ధము చేసినను రాముని జయించలేరు" అని లక్ష్మణుడు తెలిపినను వైదేహి ఊరడింపబడలేదు.

రాక్షస మాయను నిశ్చయముగ నమ్మిన లక్ష్మణుడు సీతమ్మ కనేక విధముల వివరింప ప్రయత్నించినను శోక మోహమున యుండుటచే అతడు చెప్పినదేదియు అంగీకరించ లేదు. మీదు మిక్కిలి లక్ష్మణుని అనుమానించి దూషించినది. లక్ష్మణుడు రాముడు

తనకందించిన కర్తవ్యమును పదే పదే సీతమ్మకు గుర్తు చేసినను సీతమ్మ వినలేదు. ఈ సందర్భమున లక్ష్మణుడు స్త్రీ స్వభావమును కూడ ఆవిష్కరించినాడు. అవి ఇట్లున్నవి :

1. స్త్రీలు అనుచితము అయిన మాటలు అనడములో విచిత్ర మేమీ లేదు.
2. స్త్రీలు అవసరార్థము ధర్మమును కూడ వదిలి పెడతారు.
3. స్త్రీలు చెంచలచిత్తలు.
4. వారు హృదయమున కఠినముగను, బాహ్యమున సుకుమారులుగను గోచరిస్తారు.

స్త్రీ యందు ఈ స్వభావము నశింపవలెనని కూడ లక్ష్మణుడు ఆశంసనము చేసినాడు. సీతమ్మ పలుకులకు అమితముగ వ్యథ చెందినను ఆమె యందు భక్తి గౌరవములనే ప్రదర్శించినాడు. రామాజ్ఞకు విరుద్ధముగ సీతమ్మ మనోరథమునకు తలవొగ్గినాడు. అట్లు తాను చేసిన నిర్ణయమునకు వనచర దేవతలే సాక్షి అని భావించినాడు. వారే సీతమ్మను రక్షింపవలెనని కూడ భావన చేసినాడు.

విపత్కర సమయములో దైవము నాశ్రయించుటే మేలు అని చాటి చెప్పుటకై "నేను రాముని వద్దకు పోవుచున్నాను. ఇక నీ రక్షణ బాధ్యత దేవతలకే వదిలిపెట్టుచున్నాను" అని పలికినాడు.

సీతాపహరణము తదుపరి సమస్తమును బుద్ధితో గ్రహించిన రాముడు లక్ష్మణుని ప్రశ్నించలేదు. లక్ష్మణుడు కూడ సీతమ్మ పలికిన

దుర్భాషలను అన్నగారికి తెలుపలేదు. తాను పొందిన అవమానమును కూడ రామునికి వివరింపలేదు. ఇది అసామాన్యమగు విషయము. వ్యక్తిగతముగ తాను పొందిన అవమానమును, దూషణమును తనయందే జీర్ణించుకొని, ప్రతిదూషణమునకుగాని, ఆరోపణమునకు గాని లక్ష్మణుడు పూనుకొనలేదు.

సమస్తము గ్రహించిన రాముడు లక్ష్మణునితో పరుషముగ మాట్లాడలేదు. తమ్మునిపై తన అర్ధాంగి చేసిన ఆరోపణలు శ్రీరాముని కూడ బాధించి యుండును. శ్రీరామునకు లక్ష్మణుని కన్న ప్రియమగు వారు లేరు. యుద్ధమున లక్ష్మణునికి ఆపద కలిగినపుడు తన మనోగతమగు విషయమును ప్రకటించినాడు. "లక్ష్మణుడు లేనిచో నేను బ్రతుకలేను. సీతమ్మ లేనిచో మరియొక స్త్రీని వివాహ మాడ వచ్చును. కాని లక్ష్మణునితో సరిసమానమగువాడు జగత్తున మరి ఎక్కడను గోచరింపడు" అని పలికినాడు.

అట్టి లక్ష్మణుని సీతమ్మ దూషించినది. లక్ష్మణుడు మౌనముగ భరించినాడు. లక్ష్మణుని యందు అధర్మము జరిగినది. అది సీతమ్మ వలన జరిగినది. అందులకే ధర్మము నిలబెట్టుటకై శ్రీరాముడు సీతమ్మను అగ్ని ప్రవేశము చేయవలసినదిగ లక్ష్మణునిచే కబురంపి నాడేమో అనిపించును. రాముని ధర్మ నిర్వహణము అతి సున్నితము. లక్ష్మణుని స్థైర్యము అనితరసాధ్యము.

# 46. వాస్తవికము

శ్రీమద్రామాయణము ఆది కావ్యము. ఋషి వాల్మీకి ఆదికవి. రామకథకు ఇదియే మూలగ్రంథము. ఇతరములైన అనేక రామకథలు కవుల స్ఫూర్తి నుండి ఉద్భవించినవి. కాని వాల్మీకి మహర్షిచే రచింపబడిన రామాయణమే మనకు ప్రమాణము.

ఉదాహరణకు సీతమ్మను మహారణ్యమున ఒంటరిగ వదలి సీతమ్మ ఆజ్ఞమేరకు లక్ష్మణుడు చనుచున్నపుడు, లక్ష్మణుడు లక్ష్మణ రేఖను ఏమియు ఏర్పరిచినట్లు కావ్యమున కనపడదు. లక్ష్మణుడు కేవలము సీతమ్మకు నమస్కరించి, చేతులు జోడించి తలవంచి నమస్కారము చేసి, సీతమ్మవంకకు పదే పదే చూచుచు రాముని వద్దకు బయలుదేరినాడు. తన కెంతమాత్రము ఇష్టము లేనప్పటికి సీతమ్మ పరుష వాక్యములకు వ్యథ చెంది రాముని కోసము బయలు దేరినాడు. అంతేకాని లక్ష్మణ రేఖ నేర్పరచి చనినట్లు వాల్మీకి మహర్షి రచింపలేదు.

లక్ష్మణరేఖ, మాయసీత వంటి భావములు వాల్మీకి కృతము కాదు. అట్లే వాల్మీకి మహర్షి రాముడు పరిపూర్ణమగు ధర్మమునకు ప్రతిరూపముగ రాముని ఒక నరునిగనే ప్రకటించెను గాని, అతీత శక్తులుగల మానవునిగ కూడ చిత్రీకరించలేదు. రాముడు పొందిన వన్నియు కూడ పురుష ప్రయత్నమున పొందినవే కాని అతడు ఏ మాహాత్మ్యమును ప్రదర్శింపలేదు. అంతఃచేతన యందు కూడ తాను

దివ్యుడను భావన కలుగలేదు. ఋషులు, దేవతలు పొగడినను కూడ రాముడు తాను నరుడని, దశరథ కుమారుడని భావించెనే గాని మరియొక భావన తనయందు చొరబడనీయలేదు. శ్రీరాముడు నరుడుగనే భావించి అతనివలె ధర్మము లాచరించుట మానవ కర్తవ్యము. అట్టి కర్తవ్యమును నిర్దేశించు కథయే రామ కథ. రాముని ఆరాధించుట వలన సత్యవాక్కు, ప్రియవాక్కు, ధర్మాచరణ బుద్ధి, తోటివానిని తెగువతో కాపాడుట ఇత్యాది లక్షణములు అబ్బవలెను. అందులకే రామాయణము.

లక్ష్మణుడు ఏ రేఖను గీయలేదు. అగ్నిహోత్రుడు ఏ మాయ సీతను ప్రవేశపెట్టలేదు. ఇట్టి విషయము ఇతర పురాణములలో నున్నదని, వానిని ప్రచారము చేయుట సత్యమగు రామ కథకు మచ్చవంటిదే యగును.

సీతారామలక్ష్మణులు శాశ్వత కాలము ఆదర్శనీయులు. వారిని దైవముగ భావించుటలో ఆంతర్యము, వారి కళ్యాణ గుణములను అభ్యసించుటకొరకు. కేవలము పారాయణము పుణ్యము నిచ్చునని, ఆచరణము లేక పారాయణము చేయుచుండుట వలన మానవజాతి ఉత్తమగతులను పొందలేకున్నది.

మానవుడు పురుష ప్రయత్నమున మహనీయుడు కాగలడు. కాని ఎంత మహనీయుడైనను తాను నరుడే యను భావము కలిగి యుండవలెనని రామకథ సంకేతించు చున్నది. తమకు తామే మహాత్ములమని భావించిన కలిపురుషులెందరో యున్నారు. సత్య మేమనగ నరుడు నరుడే. నారాయణుడు కాలేదు. నారాయణునితో

కూడి యుండవచ్చును. అతనితో ఐక్యము చెందవచ్చును. అతనికన్న తాను వేరు కాదని భావించవచ్చును. అయినప్పటికిన్ని నారాయణు డొక్కడే! "ఏకో నారాయణో హరిః" మరియొక నారాయణు డుండడు. పాఠకులు శ్రీమద్రామాయణమును పఠించునపుడు శ్రీరాముని ఉత్తమ నరునిగ భావించుట వలన అతని ననుసరించుట కొంత సాధ్యపడును. ఆచరణలేని భజనవలన తన స్థితిగతులయందు మార్పు కలుగదు. మానవులకు మార్గదర్శక మగునని మహర్షి వచించెను. మార్గమున నడచుట మన ధర్మము.

# 47. నిస్సహాయత

జీవితమున ఒకానొక సందర్భములో జీవుడు నిస్సహాయు డగును. ఎంత మేధస్సు కలిగినను అట్టి నిస్సహాయత్వము దర్శన మిచ్చుచుండును. అంగబల మెంతయున్నను, అర్ధబల మెంత యున్నను, దేహబలము మనోబలము మేధోబలము ఉన్నను కూడ నిస్సహాయ స్థితి జనింపవచ్చును.

శ్రీరాముడు చక్రవర్తి కుమారుడు. సుక్షత్రియుడు. అమితమగు అంగబలము, ధనబలము కలవాడు. మేధోబలము కలదు. ఆయుధ సంపత్తి కలదు. ప్రాణమిచ్చు స్వజనులు కలరు. అయినను కాల మతనిని ఒంటరి చేసెను. సీతాపహరణము శ్రీరాముని బాగుగ కలచివేసినది. తనను విశ్వసించి తన వెంటవచ్చిన స్త్రీని తాను రక్షించు కొనలేని విచిత్ర సన్నివేశ మేర్పడినది. తాను పరిపూర్ణముగ విశ్వసించు తన తమ్ముడు లక్ష్మణుడు కూడ తన విశ్వాసమునకు దీటుగ నిలబడ లేదు. ఫలితము సీతాపహరణము.

తనను సీతమ్మ జింకను కోరుట అసమంజసము కాదు. క్షత్రియుడుగ జింకను వేటాడుట అధర్మము కాదు. జింక అసురుడైనచో వధించుట తన కర్తవ్యము కనుక జింక వెంటపడిపోవుట తప్పని సరియైనది. తన తమ్ముడు లక్ష్మణుడు తనతో సరిసమానమైన పరాక్రమము కలవాడు. అతడిని విశ్వసించి తాను జింకకై పరువెత్తెను. శ్రీరాముడు ఊహించనిది లక్ష్మణుని నుండి వ్యక్తమైనది. తాను కాపుగ

పెట్టిన తమ్ముడు సీతమ్మ కాపు వదలి తనవద్దకు చేరెను. అట్లు చేరుటకు లక్ష్మణునకు బలమైన కారణమున్నది. కారణమేదైనను లక్ష్మణుడు సీతమ్మను వదలి వచ్చునని రాము డూహింపలేదు. తనకు లక్ష్మణుని పైగల ఊహ తల్లక్రిందులైనది. కథ మలుపు తిరిగినది. ఈ సందర్భమున లక్ష్మణుడు రామాజ్ఞను ఉల్లంఘించినట్లే. జగములు తల్లక్రిందైనను రామాజ్ఞను శిరసావహించు లక్ష్మణుడు తాను విధికి లొంగిపోయినాడు. తద్వారా రామునికూడ విధి జయించినది. ఎంత వారికైనను దాటరానిది విధి. విధి ఎదుట ఎవ్వడైనను నిస్సహాయుడే.

# 48. రాముని లోదృష్టి

మారీచుని సంహరించిన రాముని తీవ్రమగు దిగులు ఆవరించినది. రామబాణము తగిలిన మారీచుడు మాయా మృగ రూపము పోయి, రాక్షస రూపముతో మరణించినాడు. మరణించుటకు పూర్వము రాముని కంఠస్వరమును అనుకరిస్తూ, హా సీతా! హా లక్ష్మణా! అని కేకపెట్టుటలో ఆంతర్యమును రాముడు వెంటనే గ్రహించినాడు. రాక్షస మాయతో కూడిన పన్నాగమని తెలియగనే దిగులు పడినాడు. దిగులు వలన భయపడినాడు. రాముని దిగులు, భయము రాక్షసుల పన్నాగముగూర్చి కాదు. సీతా లక్ష్మణుల గూర్చియే. లక్ష్మణుడు, సీత ఆందోళన వలన అవస్థలు పడుతున్నట్లు అనిపించి నది. సీతమ్మ సుఖముగ లేదనిపించినది. ఇట్టి భావన కలుగుచుండగ నక్క ఏడ్చుచు కూసిన కూత వినపడినది. సీతమ్మ సుఖముగ లేదన్న భావన మరింత బలపడినది. అమంగళము తప్పక జరిగి ఉండునను భావన కలిగినది.

శ్రీరాముని ఆలోచన తీవ్రమై సాగినది. మారీచుడు అరచిన అరుపు సీతమ్మ వినియే యుండునని, లక్ష్మణుని తొందర చేసి యుండునని, లక్ష్మణుడు "పోను గాక పోను" అని వేడుకొంటు న్నప్పటికిని పంపి ఉంటుందని, తప్పనిసరి పరిస్థితులలో లక్ష్మణుడు తన వద్దకు బయలుదేరి ఉంటాడని రామునికి భావన కలిగినది.

నక్క అరుపు రాముని శంకను ధృవపరచినది. మృగాలు, పక్షులు రామునికి అప్రదక్షిణముగ కదులుటలో రాముని శంక మరింత ధృడ పడినది.

రామాయణము నందు అచటచట శకునశాస్త్రము గోచరించు చుండును. శకునశాస్త్రము ప్రకృతి యందించు సందేశములను గ్రహించు శాస్త్రము. ఈ శాస్త్రము తెలియుటకు ప్రతి ఒక్కరును తమ పరిసరముల యందలి ప్రకృతిని గమనించుట నేర్వవలెను. గాలి వీచుట, వాన పడుట, మబ్బులు ఏర్పడుట, వేడిమి హెచ్చుతగ్గులు, పక్షుల మృగముల కూతలు, వాని దక్షిణ అప్రదక్షిణ గమనములు, కన్నులు భుజములు అదరుట, ఎదురుగ వచ్చు సన్నివేశములు- ఇవి యన్నియు శుభా శుభ ఫలములను ముందుగనే తెలియజేయును.

అంతరంగమందలి భావములను పై తెలిపిన ప్రకృతి సూచనలు ధృవపరచుట గాని, వ్యతిరిక్తమగు ఫలములను గాని సూచించు చుండును. కనుక బుద్ధిమంతులగు వారు పరిసరముల యందలి ప్రకృతిని గమనించి సూచనలను అందుకొను ప్రయత్నము చేయుట ఉత్తమము. రాముడట్లు ప్రకృతి సూచనల ద్వారా కలిగిన ఆపదను ముందుగనే గమనించెను. కనుక సంస్కారవంతులకు కూడ ఇట్టి జ్ఞానము ఆచరణయోగ్యము. శుభ శకునముల నేర్పరచుకొని కార్యమున కుపక్రమించుట లౌకికమగు తెలివి. ప్రకృతి సిద్ధముగ ఏర్పడిన శకునములు ప్రధానము. అవి దాదాపు శాసకములే.

ప్రకృతికి మానవుడు దూరమై యున్నకొలది అతని జీవితము అసహజము, సంకుచితము అగుచుండును. మానవ జీవితము

ప్రకృతికి చేరువగ నుండవలెను. సహజమగు సూర్యచంద్రుల కాంతి దర్శనముండవలెను. సహజమగు గాలి, నీరు వినియోగించు చుండ వలెను. సహజమగు ఉష్ణోగ్రతలను భరించుట నేర్వవలెను. ఆహార విహారము లన్నియు సహజములై, ప్రకృతి సిద్ధములై యుండవలెను.

సీతారాములు నాగరిక జీవనముకన్న వన జీవనమునకే మ్రొగ్గుచూపినారు. రాజభవనముల కన్న వనములయందు వసించు టకే ఆసక్తి చూపినారు. నాగరికుల సాంగత్యముకన్న సాధువులు, మునులు, ఋషులు మొదలగువారి సాన్నిధ్యమును కోరినారు. ఆధునిక మానవులు రాముని ఆంతర్యము నెరిగి తమతమ జీవితము లను మలచుకొనుటకు రామాయణమొక ప్రమాణ కావ్యముగ, శాశ్వతముగ నేర్పడినది.

# 49. మారీచుడు

మారీచుడు వరప్రసాది. మహాబలవంతుడు. మేధాకారుడు. భూలోకమందలి సమస్త సైన్యము కూడ అతని బలమునకు చాలదు. వెయ్యి ఏనుగుల బలము కూడ అతని బలము ముందు దిగదుడుపే. అట్టి మారీచుడు బాల రాముని బాణమునకు నూరుయోజనముల దూరములో, సముద్ర లోతులలో పడినాడు. రామబాణ స్పర్శతో మారీచునకు హద్దుమీరి ప్రవర్తింపకుండు స్వభావ మేర్పడినది. నాటి నుండి దండక వనమునకే పరిమితుడై జీవించు చుండెడివాడు.

బాలరాముడే అంత పరాక్రమవంతు డైనపుడు ప్రౌఢుడైన రాముడు ఎంత బలవంతుడై యుండునో మారీచునకు తెలియును. ఒకమారు పొరపాటున వనమునందు తాను చరించుచుండగ రాముని చూచినాడు. భయపడి అదృశ్యుడైనాడు. రాముని శౌర్య పరాక్రమ ములు ఎరిగినవాడు మారీచుడు. అతడు రావణునికి మేనమామ. రావణుని బలపరాక్రమములు అతనికి తెలియవు. శ్రీరాముని బలపరాక్రమములు తెలియును. దండకవనమున రామసంచారము ప్రత్యక్షముగ చూచిన మారీచుడు దుర్వృత్తులు మానినాడు. తాను దుర్వృత్తులు మాని యోగ్యుడై, మనో నిగ్రహముతో తపోనిష్ఠతో యున్నానని రావణునికి విన్నవించుకున్నాడు.

దండకవనమున రాముని చూచిన మారీచునకు యమునివలె గోచరించినాడట. చెట్టు చెట్టున రాముడే గోచరించినాడట. ఎటు

చూచిన రాముడే కనపడుతూ ఉన్నాడట. వనమంతా అతనికి రామ మయముగ గోచరించెడిదట. రామబాణ స్పర్శ, రామ దర్శనము జరిగిన మారీచుడు అసురుడైనప్పటికిని యోగ్యుడై మనో నిగ్రహము కలిగి తపోనిష్ఠ నవలంబించినాడు.

ఇంతకన్న శ్రీరామ దర్శన స్పర్శనముల మాహాత్మ్యము ఎవరు చెప్పగలరు! గుహునికి దర్శనమైనది. భక్తుడై విలసిల్లినాడు. అహల్యకు స్పర్శనము కలిగినది. అచేతనమువలె నున్న ఆమె సచేతనమైనది. వీరందరు అసురులు కారు. కాని అసురులైన అకంపనుడు, మారీచుడు కూడ రామ దర్శన స్పర్శనములతో అసుర ప్రవృత్తి వీడి యోగ్యులగుటలో రాముని వైభవము, రామ మాహాత్మ్యము తేటతెల్ల మగుచున్నది.

రజస్తమస్సులు హరింపబడి, సత్వమున నిలచుటకు రామ స్మరణకన్న సులభతరమగు ఉపాయము మరియొకటి లేదనిపించును. శ్రీరామ నామము తారక మంత్ర మనుటలో అతిశయోక్తి ఏమియు లేదనిపించును. రాముడు నడయాడుట వలననే భరతభూమి పుణ్య భూమియైనది. రామ స్పర్శగల ప్రదేశము లన్నియు పావనములే. ఏ గ్రామము నందు రామాలయము పూజాదికములతో నిర్వర్తింపబడు చున్నదో, ఆ గ్రామము సుభిక్షముగ నుండును. రాముడున్నచోట కలి యుండలేదు. కలిదోష నివారణమునకు రామ స్మరణము కన్న మించిన ఉపాయము లేదు. అసురత్వమును సురత్వముగ మార్పు చేయగల మహిమగల శబ్దము రామశబ్దము. మారీచుడు నిరంతరము ఈ సత్యమును స్పష్టము చేయుచున్నాడు.

# 50. మారీచుడు - 2

రాముని మహిమ నెరిగిన మారీచుడు రావణునికి స్పష్టమగు హితబోధ చేసినాడు. అది ఇట్లున్నది :

1. నీవు శ్రీరాముడితో పోరాడలేవు.
2. నీవు రాముని జోలికి పోవద్దు.
3. రాముని గూర్చి నీవు నాతో మాట్లాడవద్దు.
4. రామునికి అపరాధము చేసినవారు సపరివారముగ నాశన మగుదురు.
5. రామునిజోలికి పోయినచో రాక్షస లోకమంతయు నీవు కారణముగ హరింపబడును.
6. నీవు సబాంధవముగ మరణింతువు.
7. రామునితో నీకు వైర మేర్పడునట్లు ప్రోత్సహించినవారు నీ కులద్రోహులు. నీ పతనము నాశించువారు.
8. రామ దర్శనముతో నీ జీవిత మంతమైపోతుంది.
9. రాముడే యముడు. దుర్వృత్తులందున్న అసురులకు అతడు మరణమై యున్నాడు.

10. రోగి అపత్యమే కోరినట్లు నీవు నీ అంతమును కోరు చున్నావు.

11. రాక్షసుల అందరి క్షేమము నీ బాధ్యత, నీ కర్తవ్యమై యున్నది. కనుక నీ మనసున రాముని గూర్చిన విరోధము తొలగించుకొనుము.

12. నీవు మృత్యువు నాహ్వానించుకొనుటకే సీతాపహర ణము తలపెట్టినావు.

పై విధముగ మారీచుడు రావణునికి హితబోధ చేసినను రావణుడు గతాయుష్కుడగుటచే తన నిర్ణయమును మార్చుకొనలేదు. మారీచుడు జింకరూపము ధరించనిచో రావణునిచేత చచ్చును. ధరించినచో రామునిచేత చచ్చును. మరణమెట్లును నిశ్చయమని తెలిసినపుడు మారీచుడు రాముని చేతిలో మరణించుటయే శుభం కరమని భావించినాడు. కారణము రామ బాణస్పర్శ ముక్తిహేతువని భావించుట. తానెట్లును భగవత్ సాన్నిధ్యమునకే తపోదీక్షను అవలం బించినాడు. తలవని తలంపుగ రావణుని రూపమున రామస్పర్శ లభించుటతో విధి దారిచూపినది. కనుక అకార్యమే అయినను రామ బాణస్పర్శ తన కంతిమ స్పర్శగ లభింపవలెనని మారీచుడు తన ప్రాణములను పణముగ పెట్టి శ్రీరామ స్పర్శను పొంది మరణించి నాడు. ఇది ఒక పవిత్రమగు ఉత్క్రమణము.

# 51. జటాయువు నీతి వాక్యములు

1. శిష్టులగువారు శాస్త్రములలో చెప్పని అర్థమును గాని, కామమునుగాని పొందవలెనని ప్రయత్నించరు. కోరరు కూడ.
2. ధర్మమునందు శ్రద్ధవలననే జీవులు పతనము చెందరు.
3. పుట్టుకతో పుట్టిన స్వభావము విడిచిపెట్టుటకు ఎవ్వరికిని శక్యము కాదు. ఉపదేశముచే స్వభావము మారదు. ప్రయత్నము చేతనే మార్చుకొనవలెను.
4. గురూపదేశము అధర్మపరుల హృదయములో చిరకాలము నిలువదు.
5. పరస్త్రీ భోగమునకు ఆశించుట విషనాగును ఆభరణముగ ధరించుటయే.
6. నరుడు తానెంత బరువు మోయగలడో అంత బరువునే మోయవలెను. లేనిచో నేలకొరుగును.
7. జీర్ణము చేసుకొనలేనంత భోజనము చేయుట మూర్ఖత్వము.
8. వీర్య బలము, ధన బలము, కీర్తి బలము, విద్యాబలము కన్న బలమైనది పవిత్రత.

# 52. గురువాక్యము

గురువాక్యమును యథాతథంగా గావించుట శిష్యుని కర్తవ్యము. కాలమాన పరిస్థితులు ఎట్టి మార్పుచెందినను గురువాక్య నిర్వహణము శిష్యుని తరింపునకు ఉపాయము.

శ్రీరాముడు, లక్ష్మణుని సీతమ్మకు కావలిగ నుంచినాడు. అట్లుంచి మాయామృగము కొరకేగినాడు. లక్ష్మణునకు రామునికన్న వేరులోకము లేదు. శ్రీరాముడే దైవము, గురుడు, సఖుడు సమస్తము. లక్ష్మణుడు దీక్షాపరుడు. రాముని కొరకై జీవించుచున్నవాడు. అట్టి లక్ష్మణుని సీతమ్మకు కాపుగ శ్రీరాముడుంచినాడు. లక్ష్మణుడు సీతమ్మ పలికిన కర్ణకఠోరమగు మాటలకు విచలితుడై, సీతమ్మ ఆజ్ఞ మేరకు రాముని కొరకై చనినాడు. పర్యవసానము సీతాపహరణము.

లక్ష్మణుని చర్య శ్రీరాముడు హర్షించలేదు. తాను తన తమ్ముని యందు పూర్ణ విశ్వాసముతో అతనిని సీతమ్మకు రక్షణగ నుంచగ, సీతమ్మ మాటలకు ఓర్వలేని లక్ష్మణుడు సీతమ్మను వదలి రామునికడ కేగినాడు. ఎంత దుర్భాషలాడినను సీతమ్మకు దరిదాపులలోనే తాను ఉండుట కర్తవ్యము. అది రాముని ఆజ్ఞ. దానిని ఎట్టి పరిస్థితులలోను విస్మరింపరాదు. సీతమ్మను రక్షించుటే లక్ష్మణుని కర్తవ్యమై యున్నది. కారణమేదైనను సీతమ్మను వదలి రారాదు.

కనుకనే లక్ష్మణుని చూచిన రాముడు దుఃఖపడినాడు.

తమ్మునితో ఘోరమగు తప్పు చేసినావని తెలిపినాడు. సీతమ్మ భయము కారణముగ అనుమానమునకు గురియైనది. అనుమానమునకు సరియగు కారణము లేదు. రాముని పరాక్రమము లక్ష్మణుని కెంత ఎరుకయో, సీతమ్మకు కూడ అంతే ఎరుక. అయినను భయము చేత అనుమాన మను పెనుభూతమునకు లొంగినది. అందువలన అనరాని, వినరాని దుర్భాషలన్నియు ఆమె నుండి వ్యక్తమైనవి.

రాముడు మానావమానముల కతీతుడు. లక్ష్మణు డట్టివాడు కాదు. అతడెంత ధర్మనిరతుడో అంత ఆత్మాభిమానము కలవాడు. అభిమానధనుడు. పరమభక్తుడు కూడ. తల్లివంటి సీతమ్మ తన శీలమును శంకించి వెలుబుచ్చిన వాక్యములు లక్ష్మణుని అభిమాన మును బాధించినది. అయినప్పటికిని అతడు ప్రధానముగ రామానుజుడు. చిన్నతనమునుండి రామునే అనుసరించినాడు. అట్టి లక్ష్మణుడు రాముని ఆజ్ఞనే శిరసావహించవలెను. సీతమ్మ అనుమానము, లక్ష్మణుని అభిమానము శ్రీరామునికి క్లిష్టమగు సమస్య కొనితెచ్చినది. లక్ష్మణుడు కూడ రామాజ్ఞను ఉల్లంఘించిన వాడైనాడు. కనుకనే రాముడు లక్ష్మణుని ఉద్దేశించి, నీవు తప్పిదము చేసితివి అని పలికినాడు. లక్ష్మణుడు తన తప్పిదము వెంటనే గ్రహించినాడు. సీతమ్మ లంక చేరి దుఃఖించినది.

# 53. దైవము

దైవము తీరుతెన్నులు పరతత్త్వము నెరిగిన వారికే తెలియును. అదియును ప్రారంభమున తెలియదు. క్రమముగ తెలియును.

శ్రీరాముడు భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములందు పూర్ణసిద్ధి కలవాడు. ధర్మాత్ముడు. లక్ష్మణుడు సర్వ లక్షణ లక్షణుడు. సీతాదేవి రామలక్ష్మణులతో సరిసమానమైన ధీమంతురాలు మరియు జ్ఞాని. ఐనను కాలము వారిని వంచించినది. సీతాదేవి చిత్రమైన వన్య మృగమును కోరుట ఒక విచిత్రము. అటువంటి మృగము లేదు అని లక్ష్మణుడు నిశ్చయముగ తెలియ జెప్పినాడు. రాక్షస మాయ అని కూడ సూచించినాడు. శ్రీరాముడు మాయ అయినచో ఛేదింతు నని, సత్యమైనచో మృగమును కొనివత్తునని లేడి వెంటపడినాడు. ముందు జాగ్రత్తగ, తనతో సరిసమానమైన పరాక్రమవంతుడు అగు లక్ష్మణుని సీతమ్మకు రక్షణగ నుంచినాడు. అయినను ఆపద ముంచుకొని వచ్చినది. సీతమ్మకు కలిగిన భయము, అనుమానము అనూహ్యము. ఆమె చేసిన దుర్భాషణము నేటికిని వింతగనే తోచును. లక్ష్మణుని రామభక్తి అనుపమానము. రామాజ్ఞయే తన జీవితముగ నిర్వర్తించినవాడు లక్ష్మణుడు. అట్టి లక్ష్మణుడు అవమానముచే, అభిమానముచే రామాజ్ఞను విస్మరించాడు. అంతయు దైవికముగ సాగినది.

ఈ సమస్తమును తిలకించుచున్న బ్రహ్మదేవుడు జరిగిన దానికి తృప్తిచెందినాడు. ఇది అత్యంత ఆశ్చర్యకరము. సృష్టియందు సజ్జన కోటిగాని, మహర్షులుగాని, దేవతలుగాని హర్షించలేదు. భయ క్రాంతులైనారు. కాని బ్రహ్మదేవుడు పూర్వాపరము లెరిగినవాడు గనుక "కృతం కార్యమితి" – జరుగవలసినదే జరిగినది. తన పని నెరవేరినది అని ఆనందించినాడు. అటుపై దండకారణ్యమందలి ఋషులు కూడ అట్లే ఆనందించినారు.

శ్రీరామావతరణము రావణవధకు నిర్దేశింపబడినది. అదియే అవతార ప్రయోజనము. ఆ ప్రయోజనమెట్లు నెరవేరునో త్రిమూర్తులకు కూడ ముందుగ తెలియదు. దైవమే కాలము రూపమున ప్రేరణ యిచ్చునని మహాత్ము లందరికిని తెలియును. అది ఎప్పుడు జరుగునో, ఎక్కడ జరుగునో, ఎట్లు జరుగునో ఎవ్వరికిని తెలియదు. సీతారామ లక్ష్మణులకు గూడ తెలియకయే జరిగినది. దైవము తీరుతెన్ను లిట్లుండునని తెలియుట అసాధ్యమని ఈ సంఘటన నిశ్చయముగ తెలుపుచున్నది.

# 54. లక్ష్మణుని ప్రోత్సాహము

శ్రీరాముడు అసామాన్యమగు పరాక్రమముగల క్షత్రియుడు. సాహసమునకు మారు పేరు. సకల సుగుణములు అతనిని వరించి యున్నవి. ఎంతటి కష్టనష్టములనైనను భరించగల ధీమంతుడు. అట్టి వానికి సీతావియోగము భరింపరానిదయ్యెను. దుఃఖమున కృంగిపోవు చుండెను. అబలునివలె కన్నీరు మున్నీరై శోకించు చుండెను. మహా పరాక్రమ వంతుడైనను బలీయమగు విధిచే భయంకరముగ పీడింప బడుట, తత్కారణముగ తీవ్రమగు శోకమునకు గురియగుట ఒక శాశ్వత సత్యముగ సృష్టియందు గోచరించును.

అమితమగు నిరుత్సాహమునకు గురియైన వారికి తోడ్పడుట, హిత వచనములు పలుకుట సులభము కాదు. అందున మహాత్ముల కట్టి సందర్భమున హితబోధలు చేయగల వారెవ్వరు? అదియును అరణ్యమున ఒంటరిగ తిరుగాడుచున్న వానికి ఉత్సాహ మెవరు కల్పింపగలరు? ప్రోత్సాహ మెవరు కలిగింపగలరు? రాముడే తన ప్రాణముగ, తన జీవిత సర్వస్వముగ భావించు లక్ష్మణునకు ఇట్టి సమయము నెట్లుండును? తానును దుఃఖించి, కృశించి, నశించి పోవలెను. కాని అట్లు జరుగలేదు. ఇది కూడ దైవమే!

లక్ష్మణుడు రాముని కాలముకన్న అతి ప్రాచీన కాలమున మహాత్ములు దుర్భరమగు దుఃఖమును ఎట్లు భరించిరో వివరించుట

ఆరంభించెను. తమ గురువగు వశిష్ఠ మహర్షి ఎట్టి స్థిత ప్రజ్ఞత్వము చూపెనో ఉదహరించుట ప్రారంభించెను. అసూయచే విశ్వామిత్రుడు వశిష్ఠ మహర్షి యొక్క నూరుగురు కుమారులను ఒక్కమారుగ సంహరించి, వశిష్ఠుని దుఃఖ సాగరమున ముంచినాడు. అయినను బ్రహ్మజ్ఞానియగు వశిష్ఠుడు తన కర్తవ్యముననే నిలచి యున్నాడు. యయాతి మహారాజు స్వర్గమును చేరినపుడు ఇంద్రు డసూయపడి, స్వర్గమునుండి బహిష్కరించెను. అయినను యయాతి కృంగలేదు. లోకమునకు సూర్యచంద్రాత్మక కాంతి నిచ్చు సూర్యచంద్రులకే ప్రతి సంవత్సరము రాహు కేతువుల పీడ తప్పదు. పూర్ణ గ్రహణమునకు గురియైనను వారు శోకింపక, మరల తమ తమ కర్తవ్యముల నిలచి, వెలుగును ప్రసరింపజేయు చున్నారు.

కనుక రామునివంటి విజ్ఞులు, పరాక్రమవంతులు జరిగిన కృత్యమునకు (సీతాపహరణము) శోకింపక, ప్రతిక్రియ నాలోచించ వలెనని, సామాన్యులవలె శోకించ తగదని లక్ష్మణుడు పలికెను. శ్రీరాముడు లోక స్వభావమును ఎరిగినవాడని, సత్యదర్శనుడని, ఏమి చేయ తగునో ఆలోచన చేసి, తగిన విధముగ చేయవలెనని ప్రోత్స హించినాడు. అనుభవించుచున్న దుఃఖము నుండి విముక్తి పొందు ఉపాయ మాలోచించవలెనని ప్రోత్సహించినాడు. రాముని వంటి బుద్ధిమంతునకు బృహస్పతికూడ ఇట్లు చేయవలెనని చెప్పుటకు తగడని, దేవతాలోకమున కూడ రామునికి హితము చెప్పగలవారు ఎవ్వరూ లేరేమో! తాను కూడ కేవలము రాముని నిజ స్వరూపమును గుర్తు చేయుచున్నాడేగాని, సలహా నిచ్చుట లేదు. కావున జరిగిన

అపకారమునకు ఉపాయము గూర్చి ఆలోచింపుమని ప్రోత్సహించినాడు. లక్ష్మణుని కట్టి స్ఫూర్తి ఆ సమయమున కలుగుట, శ్రీరాముని ప్రోత్సహించుట దైవికమే. దైవము ఎప్పుడు ఎవరికి ఏమి చేయునో ఎవ్వరికిని తెలియదు. కనుక దైవము దైవమే! కాలము రూపమున దైవ సంకల్పము వ్యక్తము కాగా, ఆ సంకల్పము ననుసరించువాడు నిజమగు బుద్ధిమంతుడు.

# 55. జటాయువునకు మోక్షము

జన్మచేతగాని, కర్మచేతగాని, జ్ఞానముచేతగాని మోక్షార్హత లేని ఒక పక్షికి శ్రీరాముడు దహన సంస్కారములు చేయుచు, "నాచే సంస్కరింపబడిన నీవు తపస్సు చేయుచున్నవారు ఏ లోకములు పొందుదురో నీవును ఆ లోకమును చేరుము. నేను నీకు అట్టి అనుజ్ఞ నొసగు చున్నాను. కనుక నీవా సత్యలోకమును పొందు"మనెను.

శ్రీరాముని ఈ శాసనము అత్యద్భుతము. అనుపమానము కూడ. తనకొరకు మరణించిన పక్షికి సత్యలోకప్రాప్తి వాగ్దానము చేసినాడు. రాముడు మనుష్యునిగ భూమిపై చరించినను మోక్ష మీయగల సమర్థుడని ఈ ఉదంతము తెలుపుచున్నది. నీవు సత్య లోకము చేరుము, నీవు బ్రహ్మలోకము చేరుము. నిన్నిట్లనుమతించు చున్నాను అని పలుకగల సమర్థుడు మానవులయం దెవ్వడును లేడు. స్వశక్తిచేత, సాధనచేత, నవ విధ భక్తిమార్గములలో ఏదైన నొకదానిని పరిపూర్ణముగ ఆచరించిన మానవునికి ముక్తి లభించుట తెలిసిన విషయము. కాని, తానుగ శాసించి సత్యలోకమునకు పక్షిని పొమ్మన్న జీవుని తరలించుట, తరింపు నిచ్చుట శ్రీరామునికే సాధ్యము.

విశ్వామిత్ర మహర్షి త్రిశంకును స్వర్గమునకు తన తపఃశక్తిచే పంపగ, స్వర్గమున అతడు నిరాకరింపబడి పతనము చెందుచుండగ, విశ్వామిత్రుడు చేయునది లేక, స్వర్గమునకు ప్రతిగ మరియొక స్వర్గము నేర్పరచి, అందు త్రిశంకును స్థిరపరచెను. స్వర్గలోకముకన్న మిన్న

యైనది, పరము అయినది, శాశ్వతమైనది అగు లోకమునకు శ్రీరాముడు జటాయువును పంపుట అనన్య సామాన్యము.

రాముని ధీశక్తి అనూహ్యము. అతడు మానవుడే అయివున్నను, అతని పరాక్రమము సర్వవ్యాపకమైనది. అతడు అక్షరముల సత్య పరాక్రముడు. అతని సత్యవాక్పరిపాలనము అన్ని లోకములందు పూజనీయమై నిలచినది. సత్యము ద్వారా లోకములన్నియు జయించ వచ్చును అనునది వేదోక్తి. సత్యవ్రతునికి సర్వలోకములు స్వాధీనమై యుండును. మనుష్యుడే అయినను అట్టి వానిని భగవంతుని దివ్య శక్తులన్నియు ఆశ్రయించి యుండును. కనుకనే మానవుడై యుండి కూడ అమితమగు స్థైర్యముతో, విశ్వాసముతో జటాయువును మోక్ష మార్గమున పంపినాడని తెలియవలెను.

# 56. జటాయువు మరణము

శరభంగ మునివలె జటాయువు కూడ శ్రీరాముని సన్నిధి యందు దేహము విసర్జించుట జరిగినది. దైవసన్నిధిన దేహము త్యజించుట కన్న పుణ్యమగు ఘట్టము జీవునకుండదు. దైవసన్నిధి యందు దైవమును దర్శించుచు, స్తుతించుచు, దైవముతో భాషణము చేస్తూ మరణించుట అరుదుగ జరుగును. భీష్మ పితామహునివలె వృద్ధుడగు జటాయువు కూడ రామ సాన్నిధ్యమున, రాముని చూచుచు మరణించినది.

సీతావియోగమున భరింపరాని దుఃఖములో యున్న రామునకు హితవచనములు పలుకుచు జటాయువు మరణించెను. సీతాదేవిని రావణుడు ఎత్తుకొని పోయినాడని రామునకు తెలిపెను. సీతాప హరణముతో కృంగుచున్న శ్రీరాముడు మరణింపకుండునట్లు హితమగు వచనములను పలికెను. రాముని 'ఆయుష్మంతుడా!' అని సంబోధించి మంగళము కలిగించెను. అంతేకాక శ్రీరాముడు చిర కాలము బ్రతికియుండునని ఆశంసనము చేసెను. సీతతో కూడునని ఆశీఃపూర్వక వచనములు పలికెను. తండ్రివలె ప్రేమ భావముతో, కుమారుని ఆశీర్వదించు విధమున మంగళము కోరెను.

"*భద్రంతే రామ*" అనుచు మంగళమగు గాక! అనినాడు. రావణునితో యుద్ధమున తాను పరాక్రమించి రావణుని హింసించ గలిగినాడేగాని, సీతమ్మను రక్షింప లేకపోయితినని అమితమగు

బాధను వ్యక్తము చేసినాడు. తాను మరణవేదన పొందుచున్నను, తన ప్రాణములను గూర్చి జటాయువు కోరలేదు. రాముడంతటివాడు తారసపడినపుడు తనను రక్షింపమని, ప్రాణములు కాపాడుమని కోరుట జటాయువు చేయలేదు.

తన క్షేమము, తన ప్రాణము కన్న సీతారాముల క్షేమము ప్రధానమని జటాయువు వర్తనమున గోచరించును. ఇది అసామాన్య మగు విషయము. సీతారాములపైగల ప్రేమ చేత, వాత్సల్యముచేత వారి క్షేమమే ఆశంసనము చేసినాడు గాని, తన ప్రాణములను గూర్చి భావనయే చేయలేదు. మహా భక్తులు మాత్రమే అట్లుండగలరు. జ్ఞానులు యోగులు కూడ పొందలేని అనుగ్రహము జటాయువు పొందినాడు. చివరగ రామలక్ష్మణులతో జటాయువు పలికిన మాటలు అత్యద్భుతము. "రామా! ఒక్క విషయము నేను చెప్పగలను. రావణుడు 'విందము' అను ముహూర్తములో సీత నపహరించెను. ఈ ముహూర్తమున ఎవరెత్తుకు పోయినను, ఎత్తుకుపోబడిన సొత్తు మరల యజమానికి లభ్యమగును. కనుక సీతమ్మ నీకు దక్కును. ఎఱగా పెట్టిన వానపామును మ్రింగిన చేపకు వానపాము ముల్లై గ్రుచ్చుకొని మరణించునట్లు, సీత నెత్తుకువెళ్లిన రావణుడు కోరి తన మృత్యువును తీసుకొని వెళ్లెను. సీతమ్మను కోరిన రావణుడు సీతమ్మకై ఆశపడి తప్పక మరణించును. సీతమ్మ నీకు త్వరలోనే దక్కును." ఇట్లు పలుకుచు రాముని చూచుచు శరీరమును విడచినది.

మరణ సమయమున రామ సాన్నిధ్యమే కాక ఆశీఃపూర్వక హితవచనములు పలికినవాడు జటాయువు. శ్రీరాముని కొరకై తన ప్రాణములను పణము పెట్టినవాడు జటాయువు. మరణ సమయమున

సన్నిధి చేరిన రాముని చూచుటయేగాని ఏమియు కోరనివాడు జటాయువు. వయోవృద్ధుడై యుండి కూడ, యోధునివలె రామ హితమునకై రావణునిపై పరాక్రమించి, రావణుని గాయపరచి నేలకూలినవాడు జటాయువు. రామాయణమున అత్యుత్తమ పాత్ర ధారణము వహించినవాడు జటాయువు.

# 57. మానవత, దుర్బలత

శ్రీకృష్ణునివలె గాక, శ్రీరాముదు పూర్ణముగ మానవ అవతారము ధరింపవలసి యున్నది. నరులుగాని, వానరులుగాని రావణ సంహార మునకు పాత్రత గలవారు. మానవ అవతారమున, మహా విష్ణువునకు గల సర్వజ్ఞత్వ ముండదు. సర్వశక్తిమంతమై యుండుట కుదరదు. సత్యవ్రతుడు గనుక సత్యపరాక్రమ ముండును. మానవునకుగల శోకమోహములు రామునినుండి ప్రకటింపబడుట సహజము. అరణ్యవాసమున అపుడపుడు తన దుస్థితి గూర్చి భావించి, శోకించుట జరిగినది. తన సహధర్మచారిణి జానకీదేవి బంగారు లేడిని కోరి నపుడు ఆమెపై మోహముచే లేడి వెంటబడినాడు. ఆమె అపహరణ మున చాల శోకమునకు గురియైనాడు. అటుపైన కోపోద్రిక్తతతో, దుఃఖముతో ఒక పర్వతమును తన బాణముతో వధింతునని, అనేక విధములగు పరుషమగు వాక్యములు పలికినాడు. లక్ష్మణునితో ఇట్లు పలికినాడు. "లక్ష్మణా! సీతమ్మ ఆచరించిన ధర్మము సీతమ్మను కాపాడలేదు. ధర్మమునకు ఫలము నిచ్చు దేవతలు కూడ ఆమె అపహరణమును చూచుచు ఊరుకొనినారు. లోకములన్నింటిని సంహరించి మరల సృష్టింపగలవాడను నేను. నా శక్తి నెరుంగక నన్నందరును అవమానించుచున్నారు. లోకహితము కొరకై దయతో మెలగుచున్న నన్ను నిర్వీర్యుడని అనుకొనుచున్నారు. నా సద్గుణములే నా యెడల దోషమై బాధించు చున్నవి. అయినదేదో అయినది. ఇక

సర్వభూతములు, రాక్షసులు లేకుండ జేసెదను. నాలోని దయ, క్షమ లోనుండి బహిష్కరించి, రాక్షసులను, యక్షులను, గంధర్వులను, పిశాచులను, కిన్నరులను, మనుష్యులను సుఖము లేకుండ జేసెదను. లక్ష్మణా! నావద్ద ఉన్న అస్త్రములు మూడులోకముల వారిని బంధింప గలవు. గ్రహములు గూడ సంచరించవు. చంద్రుడిక కదలజాలడు. అగ్ని, వాయువు, సూర్యుడు వారి కాంతులు కోల్పోవుదురు. పర్వత ములు విరిగి పడును. భూమిపై జలమింకిపోవును. చెవి వరకు నారి లాగి, నేను బాణము వదలినచో ఎక్కడివారక్కడే మడియ గలరు. నా ప్రియురాలు జానకిని, వైదేహిని నా కప్పజెప్పక పోయినచో ఈ జగత్తంతయు నేటితో నాశనమగును.”

లక్ష్మణుడు రాముని కోపోద్రిక్తతను చూచి, హిత వచనములు పలికెను. అతనిని శాంతింపజేసెను. అట్లే రెక్కలు విరిగిపడియున్న జటాయువును చూచి, అతడే సీతమ్మను భక్షించి యుండునని కూడ భావించెను. అతనిపై కూడ బాణమెక్కుపెట్టి వధించుట కుద్యుక్తు డయ్యెను. పొరపడుట, మోహపడుట, శోకించుట వంటి మానవీయ లక్షణములు రాముడు ప్రదర్శించుట తరువాత కూడ జరిగినది. మానవ అవతారము గనుక, మానవ పరిమితులు తప్పనిసరి అయినవి. అట్లే సత్యధర్మముల నాచరించు మానవునకు అసాధ్య మేమియు ఉండదని కూడ నిరూపించెను. శ్రీరాముని యందు దైవీపర మగు అపరిమితత్వము ఋషులు దర్శించినారు. పరిమితుడని భావించి రాక్షసులు భంగపడినారు. పరిమిత, అపరిమిత తత్వములను ప్రకటించిన రామావతారము అనుపమానము. అతి విశేషము మరియు వైభవోపేతము.

# 58. కబంధుడు - దహనము

కబంధుడు దనువు కుమారుడు. తండ్రి ప్రజాపతి. దానవ సంతతి దృఢమైన శరీరములు గలవారు. అదితి సంతతివలె సుకుమారము, అందము గల శరీరములు వారు పొందలేదు. శరీరబలము మిక్కుటముగ నుండుటచే, కర్మాచరణమున అశ్రద్ధ, నిర్లక్ష్య భావములు ఆవరించి, ఆత్మకున్న సహజమగు జ్ఞానము సంకోచించును. అనగ సన్నగిల్లును. అహంభావము పెరుగును. పలుచనైన పాత్రలో కాంతి ప్రకాశము ప్రసరించి వ్యాపించు అవకాశ ముండును. పాత్ర మందమైన కొలది, సాంద్రత పెరిగిన కొలది ప్రకాశము లోన బంధింపబడును.

అహంకారము కారణముగ రాగద్వేషములు, లోభమోహములు, మదమాత్సర్యములు విజృంభించును. క్రమముగ ధర్మమునందు అనాసక్తి, ద్వేషము కూడ ఏర్పడును. కనుక శరీరమును అదుపున నుంచుట, తేలికగ నుంచుట కొరకు నిత్యప్రయత్న ముండవలెను. ఆహారము, నిద్ర, వ్యాపారము శ్రేష్ఠమై, సున్నితమై యుండవలెను. ఉత్తమజాతి గుఱ్ఱమునకు గాడిదకు నున్న వ్యత్యాసము, జాతి కుక్కకు ఊరకుక్కకు ఉన్న వ్యత్యాసము నిద్ర, ఆహార, వ్యవహారముల వలననే.

దనువు కుమారుడగు కబంధుడు నియమములను ఉల్లంఘించి జీవించుట వలన శరీరము, స్వభావము రెండును అదుపు తప్పి విపరీతమగు కార్యము లనొనర్చుటచే శాపగ్రస్తుడైనను, అట్టి శాపగ్రస్తు

లను రక్షించుటకు వారి శరీరములను దహనము చేయుట ఉచితము. పాతిపెట్టుట అనుచితము.

దహనము వలన జీవుడు తన పూర్వ జ్ఞానమును, సంస్కృతిని పొందగలడు. అజ్ఞానులను మరణానంతరము పాతిపెట్టుట వలన జీవునియొక్క బంధము మరింతగ పెరిగి అతడు క్షోభించును. సిద్ధులను మాత్రమే పాతిపెట్టి సమాధి ఏర్పరచ వచ్చును. అట్టి సమాధినుండి వారి ప్రకాశము అందరకును శ్రేయస్సు కలిగించును. అజ్ఞానులను పాతిపెట్టినచో, వారు మరణించిన శరీరమున క్షోభింతురు.

కలియుగమున అజ్ఞానము ప్రబలుటచే అనేక సంప్రదాయము లలో మానవ శరీరమును పాతిపెట్టుట జరుగుచున్నది. దీనివలన జీవునికిగాని, భూమికిగాని ఉపకారము జరుగకపోగా అమితమగు అపకారము జరుగుచున్నది.

# 59. రామకృత్యము

శ్రీరాముడు దండకారణ్యమున ప్రవేశించునపుడు విరాధుని వధించినాడు. దండకారణ్యమునుండి నిర్గమించునపుడు కబంధుని వధించినాడు. విరాధుని వధించినపుడు అతనిని భూమియందు పాతిపెట్టెను. కబంధుని వధించినపుడు అతనిని గోతిలో పడవైచి దహనము చేసినాడు. రామ కృత్యమందలి ఈ వ్యత్యాసము ఒక సందేశము నిచ్చును.

విరాధమును పాతిపెట్టుట, కబంధమును విడిపించుట ఇందలి రహస్యము. విరాధమనగా అప్రీతిని కలిగించుట. కబంధమనగా బంధింపబడిన ఆనందము. బంధింపబడిన ఆనందమును బంధము నుండి విడిపించవలెను. అప్రీతియను వికారమును అణచి వేయ వలెను. మానవ జీవితమున కొందరియందు ప్రీతి కలుగుట, కొందరి యందు ఆనందము కలుగుట గమనింతుము. కొన్ని ప్రదేశములు, కొన్ని సన్నివేశములు కూడ అప్రీతిని కలిగించుచు నుండును. అప్రీతి కారణముగ అకృత్యములు చేయుట కూడ జరుగును. మనకు ఇష్టము లేకుండుట వలననే కొన్ని సమయములందు, కొన్ని ప్రదేశముల యందు, కొందరు వ్యక్తులయందు అకృత్యములు చేయు బుద్ధి పుట్టుచు నుండును. అకృత్యములు చేయుటవలన కర్మబంధము పెరుగును. అట్టి కర్మబంధము సహింపరానంత బంధించును. ఎట్టి పరిస్థితుల లోను అప్రీతి ననుసరించి, అకృత్యములు చేయరాదు. అట్టి భావము

జనించునపుడే దానిని పెరుగనీయక పాతిపెట్టవలెను. కనుక విరాధుని శ్రీరాముడు పాతిపెట్టినాడు. అప్రీతిని పెరగనీయ వద్దని, దానిని వెంటనే పాతిపెట్టమని జీవులకు సందేశమిది.

'క' అనగా ఆనందము. దానిని బంధించునది 'కబంధము'. జీవునకు శ్రేయస్సు, ఆనందము కలుగుటకు అవరోధమైయున్న విషయములను నిర్మూలించి, ఆనందమును విడుదల చేయవలెను. జీవుడు సహజముగ ఆనందస్వరూపుడు. శాశ్వతానంద మిచ్చునది సత్య ధర్మములే. వానికవరోధమైన స్వభావము నుండి జీవుని విడుదల చేయుటయే కంబంధుని విడుదల చేయుటవంటిది. అట్లు విడుదల చేయబడిన కబంధుడు రామునికి మార్గము చూపినాడు. సత్య ధర్మము లకు అవరోధమగు విషయములను విసర్జించి, ధర్మపథముననే నిలచినచో సత్యమునకు మార్గము దొరకును. విరాధ కబంధుల ఉపాఖ్యానమున ఈ విశేష ధర్మము దర్శనమిచ్చును.

# 60. శాపము - అజ్ఞానము

కబంధుడు దనువు కుమారుడు. కనుక దానవుడు. దనువు కశ్యపు ప్రజాపతి భార్య. ప్రజాపతు లందరును బ్రహ్మజ్ఞానులు. పూర్ణమగు జ్ఞానముగల బ్రహ్మర్షులు. కనుక దానవులలో కూడ కశ్యప ప్రజ్ఞ యుండును. అదితి వలన ఆదిత్యులు, దితి వలన దైత్యులు, దనువు వలన దానవులు, కద్రువ వలన సర్పములు, వినత వలన పక్షులు జనించిరి. అందరును కశ్యపుని కుమారులే అయినను, వివిధ స్త్రీల వలన వైవిధ్యముతో కూడిన లక్షణములు గల జీవు లుద్భవించిరి.

ఒక జీవి జన్మించినపుడు తండ్రి గుణములతో పాటు తల్లి గుణములు కూడ సంతరించును. తండ్రి సత్వగుణము ప్రధానముగ గలవాడైనను, తల్లి రజోగుణము, తమోగుణము ప్రధాన లక్షణము లుగ నున్నచో బాహ్యావరణలయందు జీవునకు రజః తమస్సులు, లోలోపల సత్వలక్షణములు ఉండును. కనుక దానవులు, దైత్యులు రజః తమోగుణములతో వికృతముగ నున్నను లోలోపల బ్రహ్మజిజ్ఞాస యుండును. కనుకనే అసురులందరు తపస్సుచేసి, బ్రహ్మను మెప్పించి వరములు పొందుచు, అటుపైన రజః తమస్సుల కారణముగ వికృత కృత్యములు చేయుచుందురు.

కబంధుడు కశ్యపుడు - దనువుల కుమారుడగుటచే కశ్యప ప్రజ్ఞ తోడ్పాటుతో తపస్సు చేసి, బ్రహ్మ నుండి వరమును పొందెను. అటుపైన తల్లి గుణముల ప్రభావ మధికముకాగా, వికృతచేష్టలను

నిర్వర్తించుచు ఋషి శాపమును పొందెను. వికృత రూపమును కూడ పొందెను. అంతేగాక ఆ రూపమున బంధింపబడెను. సహజా నందమును కోల్పోయెను. కనుక కబంధు డయ్యెను.

రామలక్ష్మణుల దర్శనమున అతడు అంతరాత్మ ప్రచోదనము చెందుట వలన, తన దేహమే తనకు బంధమై, తాను జ్ఞానము కోల్పోతినని తెలిసెను. దేహబంధచ్ఛేదనము జరుగనిదే తనకు జ్ఞానము కలుగదని తెలిసివచ్చెను. కనుకనే తన దేహమును దహనమునకు గురిచేయమని రామలక్ష్మణులను వేడెను. అపుడే తాను జ్ఞానవంతుడై, సీతాన్వేషణమునకు మార్గము చూపగలనని తెలిపెను.

రామాయణమందలి ఈ ఉదంతము ఒక శాశ్వత ధర్మమును బోధించుచున్నది. అది యేమనగా :

దేహము సర్వధర్మములను సాధించుట కీయబడిన సౌకర్యము. దేహము జీవుని పరిణామమునకై తోడ్పడు వాహనమై యుండవలెను. జీవుని పురోగతికి అవరోధము కారాదు. తన పురోగతికి అవరోధమగు విషయములు దేహమున ఉత్పత్తి కారాదు. వానిని అప్రమత్తముగ నిర్మూలించుకొనవలెను. పంట భూమియందు కలుపు మొక్కలను ఏరివేసినట్లు, ధాన్యమునందు మట్టిబెడ్డలను ఏరివేసినట్లు, దేహ మందలి అస్వస్థతలను తగు శ్రద్ధతో నిర్మూలించుకొనుచు నుండ వలెను.

దేహము అవరోధమై పురోగతి సాగనపుడు దానిని విసర్జించు టయే మేలు.

కబంధుడు రామ స్పర్శవలన అట్టి స్థైర్యము పొందినాడు.

మానవులు సద్గురు స్పర్శవలన అట్టి జ్ఞానమును పొందవలెను. దేహ దహనానంతరము కబంధుడు శాపవిముక్తుడై ఒక దివ్య పురుషునివలె బయల్పడినాడు. తెల్లనివస్త్రము, దివ్య మాలికలను ధరించినాడు. అలంకృతుడు కూడ అయినాడు. అతడి కొరకు బ్రహ్మలోకమునుండి హంసవాహనము దిగి వచ్చినది. హంస వాహనము నధిష్ఠించి, శ్రీరామునికి సీతమ్మను పొందు ఉపాయమును తన పూర్వజ్ఞాన మహిమచే తెలియపరచినాడు. కబంధుని చరితము నందు అత్యద్భుత మగు ధర్మసూక్ష్మము తెలుపబడినది.

# 61. శబరి

కేవలము గురుభక్తి వలన సమస్త జ్ఞానము పొంది, పునరావృత్తి లేని లోకములకు చేరిన ఒక ఆటవిక స్త్రీ రామాయణమున చోటు చేసుకొన్నది. ఇది ఒక అసామాన్యమగు విశేషము. రామాయణ కథ యందు గోచరించు అద్భుతమగు విషయ మేమనగ వివిధ జాతుల లోను, వివిధ కులములలోను జన్మించిన జీవులు జాతి కుల మతములతో సంబంధము లేక సత్యలోకమును చేరుట. జీవులందరు మోక్షమున కర్హులే. ధర్మ ప్రవర్తనము బట్టి అట్టి అర్హత కలుగును గాని, జాతి బట్టి, మతమును బట్టి, కులమును బట్టి మోక్షార్హత యుండదు.

ఎంత స్వల్పమైన ధర్మమైనను క్రమము తప్పక దీక్షతో ఆజన్మాంతము నిర్వర్తించు జీవికి, క్రమముగ మోక్షమార్గము లభించుట, కాలక్రమమున మోక్షమును పొందుట జరుగును.

మతంగ మహర్షి మహా మహిమాన్వితమగు తేజస్సు గలవాడు. అతని శిష్యులు కూడ అట్టివారే. మహర్షి శిష్యుల పరిశుద్ధత రామాయణమున విచిత్రముగను, వినూత్నముగను గోచరించును. గురు శుశ్రూషలో భాగముగ గురువు కొరకు సరస్సు నుండి కుండలలో నీటిని గొనివచ్చు శిష్యులకు, వారి దేహశ్రమ నుండి జనించిన చమట బిందువులు నేలపై పడి పూలతోట లైనవట! అట్టి పూలతోటలోని పూవులను కాలాంతరమున శబరి నిత్యము సంగ్రహించి, పూలమాలిక

లను అల్లి గురువేదికపై అలంకరించు చుండెడిదట. దీనిని బట్టి మతంగ మహర్షి, అతని పరివారము ఎట్టి పరిశుద్ధతతో యుండిరో విశదమగును.

మతంగ మహర్షి శిష్యులు స్వేచ్ఛతో దేహములు త్యజించి సత్యలోకమునకేగు సమయమున, శబరిని ఆశ్రమమునందే యుండ మని నిర్దేశించిరి. శ్రీరాముని దర్శించి, సేవించి, ఆతిథ్యమిచ్చి, అటుపైన తమను దివ్యలోకములలో చేరవచ్చునని తెలిపిరి.

గురువాక్యము సత్యమని నమ్మి, సుదీర్ఘకాలము ఆశ్రమమును శుభ్రపరచుచు, పూలమాలికలతో గురువేదికను నిత్యము భక్తి శ్రద్ధలతో అలంకరించుచు, రాముని రాకకై శబరి వేచియుండెడిది. రామ లక్ష్మణులు ఆశ్రమమున కేతెంతురని గురువాక్యము. ఎప్పుడేతెంతురో వారు తెలుపలేదు. తప్పక తన జీవితకాలమున వారేతెంతురని విశ్వసించి, వార్ధక్యము వచ్చి దేహము శుష్కించినను రాముని రాకకై ఆశ్రమమున వేచియున్నది. ఆశ్రమమును అత్యంత భక్తి శ్రద్ధలతో నిత్యము శుభ్రపరచుచు, అలంకరించుచు నుండెడిది. వేయి కళ్ళతో ముదిమి వయస్సులో రాముని కొరకు వేచియున్నది.

తత్ఫలితమే రాముని ఆగమనము, రాముని దర్శనము, రామునికి సేవ, రాముని కాతిథ్యమిచ్చుటగా పరిణమించినది. అచంచలమగు దీక్ష, గురు వాక్యమునందు నిష్ఠ, ఆశ్రమ పరిరక్షణ, శబరిని పరిపూర్ణముగ పరిశుద్ధము చేయగ, రామదర్శనమున జన్మసార్థకమై ఆమె చరితము శాశ్వతమై భూలోకమున నిలచినది. భగవంతుని చేరుమార్గము ఒక్కొక్కరికి ఒక్కొక్క విధముగ అనుగ్రహింప బడును. మార్గమేదైనను వలసినది అకుంఠితదీక్ష, అంతరంగ శుద్ధి.

# 62. రాముని కుశలప్రశ్నము

శ్రీరాముడు శబరి అందించిన సపర్యలు స్వీకరించి, ఈ క్రింది విధమగు కుశల ప్రశ్నలడిగినాడు. సాధకు లనుకొనువారు స్వీయ పరీక్షకై తమను తాము ఇవే ప్రశ్నలతో ప్రశ్నించుకొనవలెను.

1. శబరీ! నీకు నియమములకు విఘ్నము కలుగకుండుట జరుగుచున్నదా?
2. ఆహారమును, కామక్రోధములను నియమముతో నిగ్రహించుకొను చున్నావా?
3. నీవు చేపట్టిన దీక్షలు నిరాటంకముగ కొనసాగు చున్నవా?
4. నీ మనస్సున సంతోషమునకు భంగము కలుగుట లేదు గదా!
5. నీవు చేసిన గురు శుశ్రూష ఫలవంతమైనదా?

పై తెలిపిన ఐదు ప్రశ్నలు సాధకులకు అత్యంత ప్రాధాన్యము. నిత్యము ఈ ప్రశ్నలకు సమాధానముగ జీవితము సాగవలెను. తానేర్పరచుకొనిన నియమములు కాని, తన గురువందించిన నియమములు గాని పాటించుట యందు అశ్రద్ధ యుండరాదు. విఘ్నములు కలిగినను అధిగమించవలెను. ఇది అత్యంత ప్రధానమగు విషయము.

రెండవది గురువిచ్చిన ఉపాసనా విధానము. శిష్యునకు గురువు

ఏదియో ఒక ఉపాసనమో, ఒక జపమో, ఒక తపమో తప్పక ఇచ్చును. దానిని నిర్వర్తించుట వలన మాత్రమే జీవునికి వృద్ధి సాధ్యమగును. ఎవరికి ఏ విధమగు ఉపాయముతో ఉద్ధరించవలెనో తెలిసినవాడు సద్గురువు. శిష్యుని శ్రేయస్సు, వృద్ధికోరి ఉపాసనమిచ్చును. అది శిష్యుని యందు నిత్యము వృద్ధి చెందుచు నుండవలెను.

ఇక మూడవది ఆహారము, విహారము. తనలోని స్వస్థతకు ఆటంకము కలిగించు ఆహారమునుగాని, విహారమును గాని శిష్యుడు నిగ్రహించవలెను. శరీరమునకు పడని ఆహార పానీయాదులు వర్జనీయములు. అట్లే మనసుకు కలత కలిగించు వ్యవహారములు కూడ వర్జనీయము. స్వధర్మము మనసుకు ప్రశాంతత నిచ్చును. ఏ పని చేయుచున్నపుడు మనసునకు కలవరముండదో ఆ పని చేయుట ఉత్తమము. గొప్పతనము కొరకో, సుఖము కొరకో, సంపద కొరకో ప్రయత్నించుట, తదనుగుణమగు పనులు చేయుట వలన సాధకుడు పురోగతిని కోల్పోవును.

గురుశుశ్రూష ఒక అదృష్టము. గురుశుశ్రూష శిష్యులందరికిని లభ్యము కాదు. శుశ్రూషకు అనుమతింపబడినవారు అదృష్టవంతులు. గురువనుమతి లేనిదే గురుశుశ్రూష లభించదు. శుశ్రూషకు గురువు అనుమతించినపుడు, అది అనుగ్రహమై శిష్యునియందు భాసించును. శుశ్రూష ద్వారా గురువనుగ్రహము పొందిన శిష్యుడు దైవదర్శనము పొందుట జరుగును. శబరి చేసిన శుశ్రూష, తపస్సు రామదర్శనము నకు తోడ్పడినది. రామదర్శనమున శబరి తపస్సు సిద్ధించినది. పరమపదము పొందినది.

రాముని కుశల ప్రశ్నమున ఇట్టి గంభీరమగు విషయములు నిబిడీకృతమై యున్నవి.

# 63. శబరి రామ దర్శనము

శబరి వృత్తాంతము ఒక అద్భుతమగు రహస్యమును వెల్లడించు చున్నది. ఆమె శబరిజాతి స్త్రీ అయినను సద్గురు శుశ్రూష, అనుగ్రహము, అటుపైన దైవానుగ్రహము పొందినదై, దివ్యదేహము ధరించి, దివ్య వస్త్రములను, ఆభరణములను కూడ ధరించి, ప్రకాశించుచు దివ్యలోకములు చేరినది. రాముని ఆజ్ఞతో తపస్సాచరించి అతి స్వల్ప సమయముననే యోగాగ్నిని ప్రజ్వలింపచేసి, శరీరమును దగ్ధము గావించుకొని, అగ్నిహోత్రము వంటి శరీరము పొందినది. దీనివలన ఆమె ఎంతటి తపస్వినియో తెలియవలెను.

తల్లిదండ్రుల నుండి పొందిన జన్మకంటే గురువు వలన కలిగిన జ్ఞానము వలన ఏర్పడు మరియొక జన్మ శ్రేష్ఠమైనది. దేహమందు పుట్టినవాడు మరల జ్ఞానమందు పుట్టవలెను. నిజమునకు జ్ఞానమునకు, ధ్యానమునకు కొన్ని యోగ్యత లుండవలెను. కాని ఆచార్యానుగ్రహము పొందుటకు యోగ్యతతో పనిలేదు. పరిపూర్ణమైన విశ్వాసముతో గురువాజ్ఞను పాలించుచు, సేవించుచు నుండుట చాలును. సద్గురుని అభిమానము శిష్యునిపై ప్రసరించిననాడు భక్తి, జ్ఞాన, వైరాగ్య, యోగములు ఆచార్య కృపగ అందివచ్చి మోక్షస్థితిని కలుగజేయును.

ఇట్టి మార్గమునకు విశ్వాసమే ప్రధానము. శబరి మతంగముని శిష్యులను తన గురువులుగ భావించెను. వారాజ్ఞలను పరిపాలించుచు

విస్తారమైన ఆశ్రమమును అనునిత్యము శుచిగ నుంచెను. ఆశ్రమము సమస్తము నందు ఆమె శ్రద్ధయే గోచరించు చుండును. శిష్యుల పర్ణశాలలుగాని, ఆశ్రమ వీధులుగాని, ఫలపుష్ప వృక్ష ఛాయలుగాని, అన్నింటిని తానొక్కతియే శుభ్రతతో నుంచెడిది. శ్రమ అని భావింపక ఆశ్రమము యొక్క శుచి, శుభ్రతలను కాపాడుచుండెడిది. అట్టి శబరిని మతంగముని శిష్యులు వాత్సల్యముతో తమ దివ్యస్పర్శను అందించుట వలన ఆమె సిద్ధురాలైనది. శిష్యబృందము ఊర్ధ్వలోకముల కేగినపుడు, శబరిని రామదర్శనమునకై వేచి యుండుమని, రామునికి సపర్యలుచేసి అటుపైన తానును ఊర్ధ్వలోకములకు చేరవచ్చునని తెలుపగ, పదమూడు (13) సంవత్సరములుగ ఆశ్రమ పరిశుద్ధతను కాపాడుచు రామదర్శనమునకై వేచియుండెను. శ్రీరాముడు తప్పక వచ్చునని, సాక్షాత్తు శ్రీమహావిష్ణువే తనవద్దకు వచ్చునట్లు, తనను ఆశీర్వదించిరని భావించి విశ్వాసముతో అప్రమత్తముగ వేచియున్నది. రామునికి సపర్యలు చేసి, అతడు సమక్షమున నుండగనే దేహ పరిత్యాగము చేసినది. తన శరీరము రామునిచే దహింపబడుటకు గూడ ఆమెకు మనసొప్ప లేదు. తానే తపస్సుద్వారా అగ్నిని సృష్టించుకొని, ఆ అగ్నియందు శరీరము దగ్ధముగావించి, రామాజ్ఞతో పరమపదమున కేగినది.

అట్టి తపస్సు, జ్ఞానము, భక్తి, వైరాగ్యము, సిద్ధి ఉత్తమకుల సంజాతులకు కూడ వీలుపడని విషయము. కేవలము సద్గురు అనుగ్రహమున జాతి, కుల, మతములతో సంబంధము లేకయే సమస్త బంధముల నుండి, ఆవరణల నుండి బయల్పడెను. శబరి వంటి ఉత్తమోత్తమ సాధకులు మరియొకరు రామాయణమున కనిపించరు. ఆమెకామెయే సాటి.

# 64. కిష్కింధ కాండ ప్రాశస్త్యము

భగవదనుగ్రహముగ గురువు లభించును. గురువు అనుగ్రహించినచో భగవత్ దర్శనము తథ్యము. దైవమే జీవుని తనవద్దకు కొనితెచ్చుకొనుటకు, తన ప్రతినిధియగు సద్గురువును నియమించుచు నుండును. దైవము అనుగ్రహముచేత అన్వేషకుడగు శిష్యుడు సద్గురువును చేరును. సద్గురువు తానుగ ఎవ్వరిని ఆకర్షించడు. తనవద్దకు ఆకర్షింపబడినవాడు దైవానుగ్రహము గలవాడని భావించి, అట్టి శిష్యునకు దీక్షనిచ్చి, శిక్షణనిచ్చి, శిష్యునందలి ఈశ్వరునకు మార్గమును చూపును. ఆ మార్గమున శిష్యుడు పురోగతి చెందుటకై సర్వ విధముల ప్రయత్నము చేయుచు నుండును.

నారదాది మహర్షులు, వారి పరంపర యిట్టి కృషియందు నిరంతరముందురు. వాల్మీకి మహర్షినిగాని, ధ్రువునిగాని, ప్రహ్లాదుని గాని దేవర్షియగు నారదుడు అట్లే నడిపించెను. కిష్కింధకాండ యందు హనుమంతుని ప్రవేశము సద్గురు ప్రవేశము. దైవము రాముడు కాగా సుగ్రీవాదులు శిష్య పరంపరవంటి వారు కాగా, హనుమంతుడు సంధానకర్తగ, సుగ్రీవుని కార్యము సఫలీకృతము గావించినాడు. చిత్రమేమనగా శ్రీరాముడు సుగ్రీవుని కొరకై బయలుదేరినాడు. సుగ్రీవుడు ధర్మము నాశ్రయించి ఋష్యమూక పర్వతముమీద దైవానుగ్రహమునకై వేచియున్నాడు. హనుమ రాముని ఆశయము, సుగ్రీవుని ఆశయము రెంటిని పరిపూర్తి గావించినాడు. శ్రీరాముడు సుగ్రీవాన్వేషణములోని

ఆంతర్యము సీతమ్మ జాడ తెలియుటకే. అది సుగ్రీవుని వలన జరుగునని కబంధుడు తెలిపినాడు. సుగ్రీవుని కార్యము రామునివలన సఫలీకృత మగునని ఎరిగిన హనుమ, రామ సుగ్రీవులను కలిపి, ఉభయులకు పరిష్కార మందించినాడు. అంతేగాక సీతమ్మను రామునివద్దకు చేర్చుటకు హనుమ ఉపాయమై నిలచినాడు.

సీతమ్మను రామునివద్దకు చేర్చుట, సుగ్రీవుని రామునివద్దకు చేర్చుట, విభీషణుని రామునివద్దకు చేర్చుట యిత్యాది వన్నియు జిజ్ఞాసువులగు ధర్మపరులైన శిష్యులను దైవము వద్దకు చేర్చుట వంటివే. సద్గురువులు జీవులను దైవము వద్దకు చేర్చుటయే తమ పనిగ వర్తించుచుందురు. రావణునికి సహితము మహోపకారము చేసినవాడు హనుమయే. రావణుడు నరులచేతగాని, వానరుల చేతగాని మరణించుట సాధ్యమగు విషయము. రాముడు నరుడు, హనుమ వానరుడు. హనుమ అన్ని విధముల రామునితో సరిసమాన మగు తేజస్సు, బుద్ధి, పరాక్రమము కలవాడు. తానే రావణ సంహారము చేయగలడు. చేయగలడని కూడ ఒక ఉదంతమున రావణునికి రుచి చూపినాడు. కాని హనుమ విజ్ఞత అత్యద్భుతము. రావణుని మేలుకోరి, రామునిచే రావణుని హతమార్చి, రావణునికి ఊర్ధ్వగతి కల్పించినాడు. రామునిచే మరణించినచో జీవునికెట్టి ఉద్ధారణ కలుగునో తెలిసిన హనుమ, రావణునికెంతయో హితము కూర్చినాడు. ఇట్లు సద్గురువుకు తెలిసినట్లుగ మోక్షమార్గము తెలిసిన వారెవ్వరును ఉండరు. కిష్కంధకాండ అద్భుతమగు ధర్మము నావిష్కరించును.

# 65. నిర్మోహత్వం

కిష్కింధకాండ ప్రారంభమున పంపానది, పంపాతీరము, అచ్చటి పుష్ప ఫల వృక్షములు, ఆ ప్రాంతము యొక్క రమణీయత బాగుగ వర్ణింపబడినది. అట్టి ప్రదేశము సహజముగ ఆనందము కలిగించు ప్రదేశము. రామలక్ష్మణులు అందు ప్రవేశించి, ఆ ప్రదేశము యొక్క వైభవమును దర్శించిన వెంటనే, రాముని కానందము కలుగక పోగా, దుఃఖము కలిగినది. ఇది సహజము. ఇందొక రహస్య మిమిడి యున్నది.

ప్రకృతి రమణీయత మాత్రమే జీవుని కానందము కలిగింప లేదు. ఆనందముగ నున్న వారికి ప్రకృతి రమణీయత ఆనందమునకు తోడ్పాటు చేయును. మల్లెపూల సువాసన ఆనందకరమే అయినను, దుఃఖమున నున్న వారికి అవి ఆనంద మీయలేవు.

జీవునికి పొందవలసిన విషయమునందు మోహముండును. పొందలేకపోవుట వలన తాపము, శోకము కలుగును. పొందుటకు ఆశపడు విషయము సద్విషయము కావచ్చును, కాకపోవచ్చును. తన మోహమే తన దుఃఖమునకు కారణము.

పంపాతీరమున రామునికి సీతావియోగము కారణముగ అధికమగు శోకమావరించినది. రమణీయమగు సన్నివేశముల మధ్య యుండియు, వియోగశోకము కారణముగ అతనికి ఆనందము

కలుగలేదు. తోడుగ లక్ష్మణుడుండుట అదృష్టమై నిలచినది. సహజమగు ప్రసన్న వదనము, రాముని యందు భక్తి కలవాడు లక్ష్మణుడు. అందువలన కొంత తాప ముపశమించినను, సీతమ్మ తన వద్ద లేదనెడి బాధ అధికమై బంధించినది.

రావణుని పరిస్థితి కూడ అదియే. తాను పొందకూడని స్త్రీని పొందుటకై ఆరాట పడినాడు. అందుకొరకు మోసము కూడ చేసినాడు. పొందవలెనను ఆకాంక్షతో సీతను లంకకు చేర్చి, అశోక వనమున నిర్బంధించినాడు. పుష్పకమే తన నివాసమై యున్నను, హృదయమందు అశాంతి నెలకొని వ్యథకు గురియైనాడు. అధర్మము నాచరించుట వలన లంకలోని ప్రముఖు లెవ్వరును అతనిని ఆదరించలేదు. కేవల మతనిని గూర్చిన భయమువలన నిరాదరణ చూపలేదు.

కిష్కింధ యందలి ఋష్యశృంగ పర్వతమున సుగ్రీవుని పరిస్థితి కూడ రాముని పరిస్థితి వంటిదే. భార్యయగు రుమ వియోగమున అత్యంత సుందరము, పుణ్యము అగు ఋష్యమూకము అతనికానంద మీయ లేదు.

ఎచ్చట హృదయమున మోహముండునో, అచ్చట ఆనందము నకు తావు లేదు. కిష్కింధ యందు అట్టి నిర్మోహి అంజనీపుత్రుడగు హనుమంతుడే.

# 66. అంతః బహిః రూపములు

రక్షణ కవచము ధరించినను అనుమానము, భయము గలవానికి రక్షణను గూర్చిన భయముండును. ధైర్యము గలవానికి, ఆత్మవిశ్వాసము గలవానికి కవచముతో పనిలేదు. రక్షించునది కవచము కాదు. జ్ఞానమే రక్షించును. అట్టి జ్ఞానము బుద్ధి నుండి స్థిరముగ ప్రకాశించు చున్నపుడు, ఇతర రక్షణ సౌకర్యముల గూర్చి చింతింప నవసరము లేదు. తనపైనగాని, తను నమ్మిన దైవముపై గాని, గురువుపై గాని విశ్వాసమున్నచో రక్షణ గూర్చిన భయముండదు.

సుగ్రీవుడు మహాబలశాలి. సూర్యపుత్రుడు. ధర్మము నాశ్ర యించినవాడు. కాని భయస్థుడు. అన్నయగు వాలి పరాక్రమముచే వంచింపబడినాడు. అన్నను గూర్చిన భయముచే ఋష్యమూక పర్వతమందలి మలయపర్వతమును ఆశ్రయించినాడు. వాలి అచటకు రాలేదు. ఋషి శాసనముచే వాలి ఋష్యమూక పర్వతశ్రేణికి రాలేదు. తాను అచట సురక్షితుడు. అయినను వాలిని గూర్చిన భయము అతనిని వదలలేదు. అందులకు కారణము సుగ్రీవుడు స్థిరచిత్తుడు కాకుండుటయే. చిత్తము స్థిరముగ లేనివానికి భయము, సందేహము, అనుమానము ఆవరించు అవకాశము మెండు. మానవులలో స్థిర చిత్తులు బహుకొద్దిమందియే యుందురు. మృగములలో సింహము నకు తప్ప ఇతర మృగములకు చిత్తము స్థిరముగ నుండదు. సుగ్రీవుడు సూర్యపుత్రుడే అయినను, కపిజాతి యందు జన్మించుట వలన సహజ చాపల్యము ప్రకటితమగుచు నుండును. వివేకించుకొని, సత్యమును

గ్రహించు సామర్థ్యము జీవలక్షణమున ఉన్నను, దేహ లక్షణము దానికి విరుద్ధమై యున్నది. కనుక చపలత్వము తరచు ప్రకటిత మగుచుండును.

సుగ్రీవుడు సూర్యాంశ సంభూతుడు. కనుక అంతరంగమున తేజస్సు, బలము, ధైర్యము, ధర్మము, భ్రాజస్సు ఇత్యాది వన్నియు గోచరించును. కాని బహిరంగమున కపి లక్షణము లన్నియు ప్రకటింప బడి యుండును. ఇట్టివారి నవగాహన చేసుకొనుటకు అంతఃబహిర్ దృష్టి నిశ్చలముగ నున్న వారికే సాధ్యపడును. కనుకనే జ్ఞానులగు హనుమ, జాంబవంతుడు సుగ్రీవునితో కూడి యుండుటకు నిశ్చ యించుకొనిరి. మహాత్ములు అంతరంగ శుద్ధికి పెద్దపీట వేయుదురు. బహిరంగమునందుగల ఆడంబరములకు లొంగరు.

ప్రపంచమున అధికులుగ గోచరించువారిలో ఎక్కువమంది అంతఃశుద్ధి లేక బహిఃశుద్ధిని ప్రకటించువారే. బహిర్ముఖముగ మేడిపండు మేలిమిగ గోచరించును. కాని లోన పురుగు లుండ వచ్చును. రేగిపండ్లు కూడ అట్టివే. కాని కొబ్బరి, పనసవంటివి లోన విలువ కలిగి, బయటికి కఠినముగ కనిపించును. బాహ్యమున ఆకర్షణీయముగను, నజరుగను, నాణ్యముగను గోచరించునంత మాత్రమున అంతరంగ మట్లుండునని భావింపరాదు. అట్లే నాణ్యమగు అంతరంగముగల వారందరును బాహ్యమున ఆకర్షణీయముగ నుందురని భావింపరాదు.

సుగ్రీవుడు అంతరంగ సౌందర్యము గలవాడు. బహిరంగమున చపలచిత్తుడు. అతని అంతరంగశుద్ధియే హనుమకు, జాంబవంతు నకు ఆత్మీయత కలిగించినది.

# 67. రామదాసు

రామచరితమున కన్పట్టు మొట్టమొదటి రామదాసుడు లక్ష్మణుడే. లక్ష్మణుడు రాముని సోదరుడు. రాముడెప్పుడు లక్ష్మణుని తన కత్యంత ప్రీతికరమగు సోదరునిగ ప్రకటించు చుండెడివాడు. లక్ష్మణుడు యుద్ధమునందు మూర్ఛ చెందినపుడు శ్రీరాముడు, లక్ష్మణుడు లేక తాను జీవించలేనని స్పష్టముగ లోకమునకు తెలియ జేసినాడు. రాముడెప్పుడును లక్ష్మణుని సోదర వాత్సల్యముతోనే అలరించెను.

కాని లక్ష్మణుడు తాను శ్రీరాముని సోదరుడనని భావింప లేదు. తాను శ్రీరాముని దాసుడనని పలికెడివాడు. శ్రీరాముని సేవించు కొనుటకై లక్ష్మణుడు, రాముని బ్రతిమాలి రామునివెంట వనముల కేగెను. రాముని గుణములకు ముగ్ధుడైనటువంటి లక్ష్మణుడు, తాను ఆ గుణములకు దాస్యము వహించుట ప్రధానమని భావించి, సోదర బంధుత్వమును విస్మరించి, దాస అనుబంధము దీక్షగ స్వీకరించినాడు. లక్ష్మణుడు రాముని వలననే సర్వసమర్థుడు. పరాక్రమమున గాని, రూపమునగాని, అందము ఆకర్షణమున గాని అతడు కనిష్ఠ సోదరుడే. ఒకరు స్కంధులగుచో రెండవవారు విశాఖుడు. నీలికలువ, ఎఱ్ఱ కలువలవలె వారిరువురును ప్రకాశించుచు నుందురు.

"నా అంతటి వాడను నేను" అని లక్ష్మణుడెపుడును భావింప లేదు. శ్రీరామునితో సన్నిహితముగ చిన్నతనమునుండి మెలగుట

వలన అన్నగారి గుణముల ఔన్నత్యము దర్శించినవాడై ఆ గుణములకు దాసుడై, తనను తాను శ్రీరాముని దాసునిగ మలచుకొనినాడు. శ్రీరాముని గుణములకు లోకములన్నియు మోహము చెందును. సాక్షాత్తు కైలాసవాసియగు శంకరుడు కూడ రాముని గుణగానము చేయుచు, రాముని నామమే మంత్రముగ ఉపదేశించు చుండును.

మారువేషము ధరించి రామలక్ష్మణులను సమీపించి, రాముని గూర్చిన వివరములు తెలియగోరిన హనుమ రాముని చూడగనే అతడి అంతః బాహిః లక్షణముల ఔన్నత్యము దర్శించి ముగ్ధుడై రామ దాసుడైనాడు. లక్ష్మణుడు మొదటిదాసుడు. హనుమంతుడు రెండవదాసుడు. రాముని రూపమును చూచీ చూడగనే అసురుడగు రావణుడు సహితము ముగ్ధుడై క్షణకాలము అసుర స్వభావమును వీడి, వైష్ణవ స్వభావమును తనయందు రుచి చూచినాడు. రామ దర్శనమున సమస్తమగు వికారములు ఉడిగి ఎట్టి జీవుడైనను రామదాసు కావలసినదే!

# 68. రామ దర్శనము

రామ దర్శనమున హనుమ తన స్వచ్ఛమగు స్వభావము ప్రకటించినాడు. సుగ్రీవుని దూతగ, శ్రీరాముని యొద్దకు బయలుదేరిన హనుమ, తన సహజ రూపమును మరుగు పరచి, ఒక భిక్షు రూపమును ధరించెను. కారణము ఋష్యమూకమును చేరిన ఆ మహావీరుడు ఎవరో తాను ముందుగ తెలుసుకొని సుగ్రీవుని కెరింగించవలెను. తనను తాను వ్యక్తము చేసుకొనకుండ ఎదుటివ్యక్తిని పరిశీలించుట రాచకార్యములలో సర్వసామాన్యము. తాను ధరించినది ఒక సన్యాసిరూపము. సన్యాసులు నమస్కారము స్వీకరించుటయే గాని, నమస్కరించుట అరుదుగ జరుగును. కాని రాముని చూచిన హనుమకు రామలక్ష్మణు లిరువురికి నమస్కరించవలెనను భావము అంతరంగము నుండి బలీయముగ వ్యక్తమయ్యెను. వారిరువురిని చూడగనే, వారి తేజస్సునకు హనుమ ముగ్ధుడయ్యెను. అతనిని వినయ మావరించినది. ఒడలు మరచి నమస్కరించునంత ఆవేశము కలవాడు కాదు హనుమ. హనుమ కూడ మహా ప్రజ్ఞాశాలి. చూచి నంతనే సత్యదర్శన మగుటచే, మర్మమువీడి ఎట్లైనను రామలక్ష్మణు లను సుగ్రీవుని వద్దకు చేర్చవలెనని, వీరి సహాయముననే సుగ్రీవుని కష్టము తీరునని తృటిలో గ్రహించినాడు. కనుక మనస్ఫూర్తిగా నమస్కరించి, అంతఃశ్చేతనయందు రామలక్ష్మణులను గూర్చి కలిగిన భావమును స్పష్టముగ ప్రకటించినాడు.

శ్రీరాముని రూపమే పరిపూర్ణమగు ధర్మస్వరూపము. అట్టి రూపదర్శనమున మహాక్రూరుడు కూడ తమ సహజ స్వభావమును వీడుదురు. రాముని చూచిన కనులు మరి ఏ ఇతర రూపములను చూచుటకు ఉత్సహించవు. దర్శన మాత్రముచేత రజః తమస్సులను వీడి, సత్వమున స్థిరపడినారు. జీవులెందరో ప్రత్యక్షముగను, పరోక్షము గను కూడ యున్నారు. రామదర్శనమున వాలి రామభక్తు డయ్యెను. రాముని గూర్చి విన్నంతనే రామభక్తునిగ మారినాడు విభీషణుడు. బ్రహ్మాండము లన్నింటిని తన తపస్సుచే వశము గావించుకొనిన విశ్వామిత్రమహర్షి, రాముని చూచిన మరుక్షణమే, రాముని ప్రేయసి వలె అతి మోహమునకు గురియైనాడు. ప్రథమ దర్శనమున రావణ బ్రహ్మకూడ నిర్వీర్యుడైనాడు. రాముని ధర్మ స్వరూపము అత్యంత మధురమైనది. ఎట్టి జీవియైనను తన సహజగుణము ఉడిగి సత్వమున ప్రకాశించును. సర్వజ్ఞుడగు హనుమ, రామ దర్శన మాత్రమున రాజమర్మములను విసర్జించి, రామ భక్తుడైనాడు. రామ దర్శనము అత్యంత మధురము. దానికి మార్గము స్మరణము. రామ స్మరణ మార్గము ఎంత మాధుర్యముతో నిండియున్నదో గోపన్న కీర్తనల యందు తెలియును *(ఎంతో రుచిరా.... శ్రీరామ నీ నామ మెంతో రుచిరా...).*

# 69. లక్ష్మణుని సత్య భాషణము

శ్రీరాముడు హెచ్చరిక చేయగా, లక్ష్మణుడు హనుమంతునితో తమ కథను అత్యంత భక్తిశ్రద్ధలతో, వినయముతో వివరించినాడు. ఇక్ష్వాకు వంశపు రాకుమారులైనను రామలక్ష్మణుల వినయము అద్భుతము, అనుపమానము. రామునిగూర్చి లక్ష్మణుడు పలికిన మాటలు అక్షర సత్యములు. ముందుగ రాముని ఔన్నత్యమును, అతని స్వామిత్వమును, అతని పరాక్రమమును, గుణములను ఆవిష్కరించి నాడు. దైవవశమున రామునికి కలిగిన ఆపద వివరించినాడు. తాను తమ్ముడే అయినను, రాముని గుణగణములకు ముగ్ధుడై వినమ్రుడై రాముని దాసునిగ తాను స్థిరపడినానని తెలిపెను.

రామునికి సుగ్రీవుని మైత్రి ఆవశ్యకమని, అట్టి మైత్రి వలననే రాముని కార్యము సిద్ధించునని నిర్మమముగ, నిర్మలముగ ముమ్మారు తెలియజేసినాడు. మూడు లోకములలో ప్రసిద్ధి గలవాడు రాముడు. కాని దైవ వశమున నేడు సుగ్రీవుని శరణు పొందుటకు సంసిద్ధుడైనా డని, సుగ్రీవుడే తనకు ఉపాయమని భావించుచున్నాడని, సుగ్రీవు నాశ్రయించుటకు ఈ పంపాతీరము చేరినాడని, సుగ్రీవుడు రామునికి సాయపడి, రామునికి కలిగిన ఆపద తొలగించుటలో సాయపడవలె నని తెలిపినాడు.

ఇట్లు సత్యపరాక్రముడు, తనకు సాక్షాత్తు దైవమగు రాముడు

సుగ్రీవుని శరణుకొరకై ఏతెంచినాడని, అమితమగు దీనతతో, కంటనీరు పెట్టుకొనుచు లక్ష్మణుడు పలికినాడు. అట్లు పలుకుటకు లక్ష్మణుని హృదయమెంత కుమిలిపోయినదో, మనసు ఎంత బాధ పడినదో లక్ష్మణునికే ఎరుక. లక్ష్మణుని సౌశీల్యమునకు, వినయము నకు ఈ ఘట్టము అద్దము పట్టును. రాముని దైన్యమునకు లక్ష్మణు డంతగా కంటతడి పెట్టినాడు. ఏకైక వీరుడు, సకలలోక శరణ్యుడు, తనకు ప్రత్యక్ష దైవము అగు రాముడు సహాయ మర్థించు చున్నాడని అరమరికలు లేక హనుమంతునితో పలికినాడు.

రామకార్యము సిద్ధించుటకు నిరహంకారముగ సత్య వచనములు పలికిన లక్ష్మణుని పలుకులు హనుమకు సూటిగ హృదయమును తాకినవి. అతడు హృదయమున ఆనందము పొంది నాడు. దర్శనమాత్రముచే రామలక్ష్మణుల ప్రతిభను గ్రహించిన హనుమ, లక్ష్మణునితో సమానమగు వినయమును ప్రకటించుచు ఇట్లని పలికెను : "రాముడు సుగ్రీవుని శరణమునకు ఏతెంచినాడని నీవు పలుకుచున్నావు. కాని మీరు లోకములను జయించినవారు. ఇంద్రియములను కూడ జయించినవారు. సుగ్రీవునిచే తప్పక సేవింపదగినవారు గాని, సుగ్రీవుని సేవించుట సమంజసము కాదు. మా సుగ్రీవుని భాగ్యవశముచే మీరే సుగ్రీవుని దర్శింపగ వచ్చినారు. ఇది సుగ్రీవుని భాగ్యము."

హనుమత్ లక్ష్మణ సంవాదము అత్యంత సత్వగుణ ప్రధానమై గోచరించును. శ్రీరామునికి సుగ్రీవుని ఆవశ్యకత యున్నది. సుగ్రీవునికి శ్రీరాముని ఆవశ్యకత యున్నది. ఆవశ్యకతనుబట్టి కాక గుణములను

బట్టి రాముని ఔన్నత్యమును ఇరువురును ప్రకటించినారు. ఇరువురి యందుగల సత్వమే వారికి సత్యదర్శనమిచ్చి, యథార్థమగు విషయము భాషణము గావించినారు. వారిరువురి సహృదయతకు రాముడు సాక్షిగ నిలచినాడు.

# 70. హనుమంతుని విశిష్టత

రామలక్ష్మణుల దర్శన మనంతరము వాయుపుత్రుడగు హనుమ సుగ్రీవుని మైత్రి రాముని కావశ్యకము అని గ్రహించినను, అంతకు మించి రాముని మైత్రి సుగ్రీవునకు అమితావశ్యకమని గ్రహించినాడు. రామ సుగ్రీవులను ఎరిగిన హనుమ వారిరువురి మధ్య గల వ్యత్యాసమును అతి శీఘ్రముగనే గ్రహించినాడు. శ్రీరాముడు మేరుపర్వత సమానుడని, అతనితో పోల్చిచూచిన, సుగ్రీవుడు ఒక చిన్న గుట్టకన్న మిన్నగ గోచరింపడని శీఘ్రముగనే గ్రహించినాడు. రామసుగ్రీవుల మైత్రియందు అమితముగ లబ్ధి పొందువాడు సుగ్రీవుడే అని గ్రహించినాడు. సుగ్రీవునికి తాను మంత్రిగ వ్యవహరించుచున్నను, హనుమ నిజస్థానము పూజ్యమైనది. సతతము సుగ్రీవుని మనస్తాపము, భయము, అస్థిరత పరిష్కరించుట హనుమ చేయుచునే యుండెడివాడు. సూర్యపుత్రుడే అయినను అతని యందు దేహాభిమానము మెండుగ నుండుటవలన కపివర్తనము అనునిత్యము వ్యక్త మగుచుండెడిది. అందువలన హనుమ చాల యోచనము చేసి సుగ్రీవునికి రామలక్ష్మణులే శాశ్వతమగు పరిష్కార మీయగలరని తెలుప నిశ్చయించుకొనెను. తాను సుగ్రీవుని దూతగ వచ్చినప్పటికి రాముని గుణగణము లెరిగి, రామదూతగ తననుతాను అమర్చుకొనినాడు. రాముని గొప్పతనము సుగ్రీవునికి చక్కగ వివరించి, రాముని యెడల సుగ్రీవునికి వినయము, గౌరవము, భక్తి

కలుగురీతిలో తెలియపరచినాడు. ఎట్టి పరిస్థితి యందును సుగ్రీవుడు రాముని మైత్రిని దుర్వినియోగము చేయకూడదని భావించినాడు.

తక్కువ సంస్కారముగల వానితో ఎక్కువ సంస్కారము గలవాడు దైవవశాత్తు మైత్రికై ఒప్పందము చేసుకొనుచున్నను, సంస్కార తారతమ్యములను అశ్రద్ధ చేయరాదని హనుమ అత్యంత శ్రద్ధాళువై, బుద్ధిశాలియై సుగ్రీవుని నడిపించుటకు నిశ్చయించుకొనెను. సుగ్రీవుని మైత్రి కోరినంత మాత్రమున, సుగ్రీవుడెట్టి పరిస్థితి యందు రాముని యందు వినమ్రుడై యుండవలెనని భావించినాడు. సుగ్రీవుని దూతగ రాముని వద్ద కేగిన హనుమ సుగ్రీవుని అదృష్టమును గ్రహించి, తదనుగుణముగ కార్యము చక్కపెట్టదలచెను.

# 71. హనుమ విజ్ఞత

లక్ష్మణుని పలుకులు విన్న హనుమకు హృదయము కరిగినది. అతనికి సుగ్రీవుని గూర్చి క్షుణ్ణముగ తెలుసును. దర్శన మాత్రమున రామలక్ష్మణుల ఔన్నత్యము హనుమ గ్రహించినాడు. ఎక్కడ దైవము, తన రాజగు సుగ్రీవుడెక్కడ. సూర్యపుత్రుడే అయినను సుగ్రీవుని యొక్క పరిమితత్వము, రాముని అపరిమితత్వము స్పష్టముగ గోచరించినది. రాముడు సుగ్రీవుని సహాయ మర్థించుటలో శ్రీరాముని సౌశీల్యమే మిన్నగ గోచరించినది. తన రాజగు సుగ్రీవుని సహాయమును అర్థింప విచ్చేసిన శ్రీరాముడు లోకోత్తర వీరుడు. అట్టి వానిని సేవించుటయే మహాభాగ్యము. సేవలందుకొన అన్ని విధముల తగిన రాముడు సుగ్రీవుని మైత్రికోరుట దైవవిలాస మనిపించినది. కనుక స్పష్టముగ హనుమ రామలక్ష్మణులకు ఈ క్రింది విధముగ తన భావమును ఆవిష్కరించినాడు.

"మీరు లోకములను జయించినవారు. సేవింపదగినవారు. వానరరాజు సుగ్రీవుడు, అతని భాగ్యవశముచే మీరాతనిని దర్శింప వచ్చినారు. మీ దర్శనము సుగ్రీవునికి లభించుట కేవలమతని భాగ్యము. సుగ్రీవుడు సోదరుడగు వాలిచే రాజ్యము నుండి బహిష్క రింపబడినాడు. సుగ్రీవుని భార్యను అపహరించినాడు. తమ్మునిపై పగపట్టి యుండుటచే, సుగ్రీవుడు అడవిలో దాగుకొని యున్నాడు.

అతడికిని మీవలె దుఃఖము సంప్రాప్తించినది. సీతమ్మను వెతుకుటలో మీకతడు సహాయపడగలడు.”

హనుమ వాక్కులు రామలక్ష్మణులకు సంతోషము కలిగించినవి.

హనుమ, రామ లక్ష్మణులను గూర్చి సుగ్రీవునకు ప్రోత్సాహకరమగు విషయములు తెలిపినాడు. శ్రీరాముడు మహాప్రాజ్ఞుడని, ఎదురులేని పరాక్రమము గలవాడని, అతనితో స్నేహము సుగ్రీవునకు శాశ్వత పరిష్కార మిచ్చునని, కనుక రామలక్ష్మణులను సాదరముగ ఆహ్వానించమని తెలిపినాడు. సుగ్రీవుని సహాయము కోరి వచ్చినాడని తెలుపుచు, అంతమాత్రమున అతనిని సామాన్యుడుగ భావింపవలదని, అతని శరణు కోరమని కూడ తెలిపినాడు. నీతో అతడు సఖ్యము కోరినను, నీవు రాముని సేవించుటయే మేలని తెలిపినాడు. చివరి మాటగా, రామలక్ష్మణుల కంటే ఆరాధింపదగిన వారు ఈ లోకములో మరియొకరు లేరని స్పష్టము గావించినాడు.

# 72. వానరులు

వానరు లనగా విశిష్ట నరులు. నరు లనగా నశింపనివారు. మానవు లనగా మనసు ప్రధానముగ జీవించువారు. మానవులకు మరణమున్నది. నరులకు మరణము లేదు. వారు అమృత స్వరూపులు. అందున విశిష్టమైన నరులను వానరులందురు.

కిష్కింధ యందు ప్రధానమగు నాయకులందరు వానరులే. ఇతరులు కోతులు. జాంబవంతుడు, హనుమంతుడు, నలుడు, నీలుడు, సుగ్రీవుడు, అంగదుడు వానరులు. వీరు కామరూపులు. అనగా సంకల్ప మాత్రమున వారి రూపములను మార్చుకొనగలరు. అతి పెద్దవిగను, అతి చిన్నవిగను గల పరిమాణ రూపములను దాల్చగలరు. కాలమును దేశమును బట్టి, కర్తవ్యమును బట్టి వలసిన రూపములు ధరించగలరు. వీరికి వాయుగమనము కూడ సాధ్యమే.

కనుకనే రామలక్ష్మణుల దర్శనమునకు హనుమ భిక్షువు రూపము ధరించెను. సుగ్రీవుడు మనుష్య రూపమును ధరించెను. అందముగ రూపమును మార్చుకొనినాడు. ఇట్టి విశేషమగు సిద్ధులుగల వారి సహకారము శ్రీరాముని కావశ్యకమైనది. శ్రీరాముడు ఉత్తమ మానవ రూపమును ధరించి యున్నాడు. అతడు భవిష్యత్తున మాయావులగు రాక్షసులతో యుద్ధము చేయవలసి యున్నది. తాను ముమ్మాటికిని సత్యపరాక్రముడు. లోకములో రాముని ఎదిరించి నిలచువాడొక్కడును లేదు. రావణుడు, రాముని ఎదుర్కొనినచో తప్పక

పరాజయము పొందును. రావణుని ఎదుర్కొనుటకు రామునికి ఇతర సాధనము లేవియు లేవు. తానుగ రావణుని చేరలేడు. రావణుడు తనపై దండెత్తడు. మరి రామరావణ యుద్ధమునకు సంధానకర్త లెవ్వరు? వారే వానరులు. విశిష్ట నరులు. కనుకనే సుగ్రీవాదుల సహకారము శ్రీరాముని కత్యవసరమని కబంధుడు తెలిపినాడు. రావణవధకు రంగ మేర్పాటు చేసినది వానరులే. రాముని లంకకు చేర్చుటకు వానరులు చేసిన కృషి అత్యద్భుతము, అనితరసాధ్యము కూడ.

రామాయణమున మూడు తరములకు సంబంధించిన మూడు జాతులు యుద్ధమున పాల్గొనినవి. అందు మొదటిజాతి కాలక్రమమున వానరజాతి. రెండవజాతి లంకేయులు అగు రావణాదులు. మూడవ జాతి మానవ రూపము దాల్చిన రామలక్ష్మణులు. వీరందరును ఒకే కాలమునందు తారసపడినను వారి నడుమ యుగయుగముల వ్యత్యాస మున్నదని దివ్యజ్ఞాన ప్రసాదితయగు మేడమ్ బ్లావెట్స్కీ విశ్లేషించినది. ఈ మూడు జాతులయందు పై తెలుపబడిన వానరులు అత్యంత ప్రాచీనులు. అట్టి వానరుల కథ అత్యంత గంభీరమైనది.

# 73. పర స్త్రీ దర్శనము

రామాయణమున ప్రకటింపబడిన అత్యుత్తమ ధర్మములలో పర స్త్రీ దర్శన మొకటి. పరస్త్రీలను దర్శించినపుడు వారి పాదములనే శ్రీమాత పాదములుగ భావించి దర్శించవలెను. పాదములే సుపరిచితములై యుండవలెను. మొత్తము మూర్తి దర్శనము చేసినను, ఇతర అంగములను మనసున ముద్రించుకొనక, పాదములనే ముద్రించుకొనవలెను. పరస్త్రీ పాదములు శ్రీమాత పాదములుగ భావింపవలెను. లక్ష్మణుడు సీతమ్మ వారిని చూడలేదు అనుట సత్యము కాదు. పాదములనే హృదయమున నిలుపుకొనుట సత్యము. సీతమ్మ తనకు మాతృ సమానురాలు. పరస్త్రీలందరును సత్పురుషునకు మాతృ సమానులే. వారి ముఖ సౌందర్యముగాని, నేత్ర సౌందర్యమును గాని, కర్ణ సౌందర్యమునుగాని, పెదవులు బాహువుల సౌందర్యముగాని, వక్ష స్థలము, నాభి, నడుము వంటి అంగ సౌందర్యము గాని మనసున ధరింపక, కేవలము పాదములను, పాదముల నలంకరించిన ఆభరణములను మాత్రమే మనసున ధరించి యుండుట ఉత్తమ సంస్కారము.

లక్ష్మణుడు అత్యంత శీలవైభవము కలవాడు. అతడు పరమ పవిత్రమూర్తి. కనుకనే ఋష్యమూక పర్వతముపై సీతమ్మ పడవేసిన ఆభరణములలో అమ్మవారి కాలి అందెలను మాత్రమే గుర్తించి, అవి సీతమ్మ కాలి అందెలే అని నిశ్చయముగ తెలిపినాడు. ఆభరణముల

లోని కేయూరములు గాని, కుండలములుగాని, భుజకీర్తులుగాని తాను గుర్తింపజాలనని తెలిపినాడు. అమ్మవారి ముఖము, భుజములు చూడలేదని కాదు, వానిని తన మనస్సున ముద్రించుకొనలేదు.

మన స్వభావమున పరస్త్రీని గురించి ముద్రింపబడి, స్మరింప బడినవి పాదములే అయి ఉండవలెనని, ఇతర అంగ సౌందర్యము దర్శించినను, స్వభావమున ముద్రింపబడి యుండరాదని ఈ సంఘటనము సందేశ మిచ్చును. సాధకు లనుకొనువారు తమ స్వభావ నైర్మల్యము ఎట్టిదో తెలియుటకు ఇది నిజమగు పరీక్ష. పర ధనముల యందు, పర స్త్రీలయందు లేక పరపురుషుల యందు మనకు గల అనాసక్తియే మన నిర్మలత్వము తెలియుటకు వీలగును.

లక్ష్మణుడు రామునితో నిత్యమూ తాను అభివందనములు చేయు సీతమ్మ పాదములు, ఆ పాదములకున్న ఆభరణములు తానెరుగుదునని, ఇతరములు తానెరుగనని తెలుపుటలో ఉత్తమ మానవ సంస్కారము ప్రకటించినాడు.

# 74. శకునములు

శ్రీమద్రామాయణమున అనేక పర్యాయములు వాల్మీకి మహర్షి ప్రకృతియందు దర్శనమిచ్చు అనేకమగు శకునములను సున్నితముగ హెచ్చరిక చేసినాడు. రాబోవు శుభముల గూర్చి, అశుభములగూర్చి ప్రకృతి అందించు సందేశములు సూక్ష్మదృష్టితో గ్రహించుటకు బుద్ధి మంతులు ప్రయత్నింపవలెను. ఆకాశము, నీరు, గాలి, సూర్యుని తాపము, వృక్షములు, వృక్ష సంపద, జంతువులు, వాని వర్తనములను గమనించుచు నుండవలెను. ఆకాశము నిర్మలముగ నుండుట, మేఘావృతమై కాంతి అదృశ్యమగుట, తెల్లని మబ్బులతో అందమగు ఆకారము కలిగియుండుట వంటివి తెలిపినాడు. అట్లే గాలి యందలి ఆహ్లాదకరమగు గమనము, సుడిగాలి, ఈదురుగాలి, వాని శుభా శుభములను తెలిపినాడు. ఫల పుష్పములు గల వృక్షములు, ఆహ్లాదకర మగు వాతావరణము, నిర్మల జలములతో కూడిన కోనేర్లు, సెలయేరులు అందించు శుభసూచకములను తెలిపినాడు. ఉగ్రమగు వాతావరణముతో కూడిన ప్రకృతియందు అసురభావము లెట్లుండునో ప్రకటించినాడు.

దుష్కరము, దుస్సహము అగు సీతాన్వేషణమున రాముడు దర్శించిన శుభాశుభ ప్రకృతి సందేశములను కూడ సున్నితముగ సూచించినాడు. అరణ్యమునందు కొన్నిమార్లు తనముందు లక్ష్మణుడు నడచుట, మరికొన్నిమార్లు సీతాలక్ష్మణుల ముందు రాముడు నడచుట

వంటి సందర్భములలో కాలము పైచేయిగా నిలచు సమయములను, దైవము పై చేయిగ జరుగు సమయములను సూచించినాడు.

సీతాన్వేషణమున జటాయువు మరణము ద్వారా అన్వేషణా కార్యక్రమమునకు గమ్యము తెలిపినది. కబంధుని విమోచనము ద్వారా మార్గము సుగమమైనది. శబరి ననుగ్రహించుటలో కాలము అనుకూలముగ మారినది. హనుమద్దర్శనము, భాషణము ద్వారా శుభ పరంపర ఆరంభమైనది. సుగ్రీవుని మైత్రిద్వారా వాలికి, రావణునికి కలుగు ఆపద, సీతాదేవికి కలుగబోవు శుభము చమత్కారముగ తెలుపబడినది. రామసుగ్రీవుల మైత్రి సందర్భమున సీతమ్మ ఎడమ కన్ను అదురుట శుభసూచకము. వాలి రావణులకు ఎడమ కన్నదురుట అశుభ శకునముగ తెలుపబడినది. అటుపైన సుగ్రీవుని భాషణము, అమ్మవారి ఆభరణ దర్శనము ద్వారా మార్గము, గమ్యము స్పష్టమైనది. రామకథతోపాటు విస్తారముగ శకున శాస్త్రమును కూడ రామాయణమున సూక్ష్మదృష్టితో దర్శించి, ప్రకృతి అందించు సందేశములను తెలియుటకై సతతము జిజ్ఞాసువులు అప్రమత్తులై యుండవలెను.

# 75. యాదృచ్ఛిక దుష్కృత సుకృతములు

ఆపదలో నున్నవారికి కేవలము పూర్వ సుకృతము వలన కొన్ని భావములు తోచి, వాని ఆచరణమున తమకు తెలియకయే కొంత పరిష్కారమునకు మార్గము లభించును.

ఆపదలో చిక్కుకొనుటకు పూర్వదుష్కృతమే కారణము. ఎంత తెలిసియున్నను దుష్కృత కర్మ బలమున, జీవితమున ఆపదలకు ద్వారము తెరుతురు. తెలియుట, తెలియకపోవుట అనువానితో సంబంధము లేకయే కొన్ని కార్యములు బలవంతముగ స్వభావము నుండి దూసుకొని వచ్చును.

అధర్మమని తెలిసియు ఆసక్తివలన జీవులు కొంత ధర్మము తప్పి పెడదారిని పట్టుట, మరల సుకృతవశమున పరిష్కారములు పొందుట చూచుచునే యుందుము. ఎంతటి జ్ఞానులైనను కర్మవశాత్తు కాలముచే బంధింపబడుదురు. కాని సుకృతవశమున కాలక్రమమున పరిష్కారము కూడ లభించును.

సీతాదేవి విచిత్రమగు భావన కలిగి, విచిత్రమగు బంగారు లేడిని కోరినది. కాలస్వరూపుడగు లక్ష్మణుడు హెచ్చరిక చేసినాడు. అట్టి బంగారులేడి లేదని, తామున్నది మాయావి అసురుల నివాస స్థానమగు జన స్థానమని, కనబడుచున్న బంగారు లేడి రాక్షస మాయ అని పరిపరి విధముల తెలిపినాడు. కాని జానకీదేవికి ఆ మాటలు రుచించలేదు. శ్రీరాముని ప్రోత్సహించి పంపినది. అట్లే రాముడు

త్రిజగములను జయించగలిగిన వాడని తెలిసియు రాముని కాపద కలిగినదని, రామరక్షకై లక్ష్మణుని నిర్దేశించి పంపెను. రాముడే రక్షకుడని, రాముని రక్షించుట వంటి సంఘటనలు జరుగవని, లక్ష్మణుడు ఎంత వేడుకొనినను అతనిని దూషించి పంపినది.

ఇట్టి దుష్కృతము పూర్వకర్మవశమున అయి ఉండుటచే సీతమ్మ కాపద కలిగెను. కాని జానకి నిజ స్వభావమున అట్టి దుష్కృత్యమునకు తావు లేదు. ఇది పూర్వదుష్కృతము. అట్లే పూర్వ సుకృతము కూడ ఆమె నుండి మరియొక కార్య మొనర్చినది. అపహరింపబడి, ఆకాశమార్గమున రావణునిచే గొనిపోబడుచుండగ యాదృచ్ఛికముగ తన ఆభరణములలో కొన్నిటిని ఋష్యమూక పర్వతముపైకి జారవిడిచినది. ఇట్టి యాదృచ్ఛిక సుకృతము వలననే శ్రీరామునికి తన జాడ భవిష్యత్తున తెలియవచ్చినది. జారవిడిచిన ఆభరణములు సుగ్రీవాదులు భద్రపరచుట, అటుపైన రామునికి వానిని దర్శింప జేయుట జరిగినది. జానకీదేవి అట్లు జరుగవచ్చునని ఊహించనైనా లేదు. ఎందుకట్లు పడవైచినదో తనకే తెలియదు. ఇది యాదృచ్ఛిక సుకృతము. అట్లే తాను ఎందులకు రాముని ప్రోత్సహించినదో, లక్ష్మణుని దూషించినదో తనకే అంతుపట్టలేదు. ఇట్లు సుకృత, దుష్కృతములు యాదృచ్ఛికముగ జీవులకు పరిష్కారములు, ఆపదలు తరంగములవలె అందించుచునే యుండును. కావున బుద్ధిమంతులు స్ఫూర్తితో సుకృతములు చేయుచునే యుండవలెను.

సుగ్రీవుని కథ కూడ యిట్టిదే. అతడు సూర్యపుత్రుడు. మహా జ్ఞాని అయినప్పటికిని ఉత్తరోత్తర జరుగవలసిన వాలి వధకు తాను నిమిత్తమాత్రుడై కొన్ని పొరపాట్లకు వాహికయై నిలచినాడు.

# 76. యాదృచ్ఛిక దుష్కృత సుకృతములు-2

సుగ్రీవుడు సూర్యపుత్రుడు. వాలి ఇంద్రుని పుత్రుడు. ఇరువురును అరుణి అను కన్యకు కవలలుగ పుట్టిరి. అరుణి బ్రహ్మ దేవుని స్వేదజముల నుండి పుట్టిన ఋక్షుడు. బ్రాహ్మణ, క్షాత్ర ధర్మము కలవారు. అనగా జ్ఞాని మరియు వీరుడు. అతడొక సరస్సున స్నానము చేసి ఒడ్డునకు చేరగనే దివ్యము, అందము అగు ఒక స్త్రీ రూపమును పొందెను. అతడాశ్చర్యచకితుడు కాగా, తండ్రియగు బ్రహ్మదేవుడు ఋక్షునకు కలిగిన మార్పు లోక సంరక్షణార్థం, లోక శ్రేయస్సుకు సంబంధించినదని, చింతింప నవసరము లేదని పలికెను. దివ్య సౌందర్యముతో ప్రకాశించుచున్న ఆమెను చూచి ఇంద్రుడు, సూర్యుడు మోహపడిరి. వారిరువురును ఆమె పొందు కోరిరి. ముందుగ సూర్యదేవుడు, అటుపైన ఇంద్రదేవుడు ఆమెతో సంగమించిరి. తత్ఫలముగ సూర్యతేజముగ సుగ్రీవుడు, ఇంద్ర వీర్యముతో వాలి జనించిరి.

సుగ్రీవ ప్రజ్ఞ ముందుగ గర్భప్రవేశము చేసినది. వాలి ప్రజ్ఞ తరువాతగ గర్భప్రవేశము చేసినది. ప్రసవ సమయమున వాలి ప్రజ్ఞ ముందుగ ప్రసవింపబడినది. సుగ్రీవుని ప్రజ్ఞ తరువాత క్షణములలో ప్రసవింపబడినది. కవల జన్మించినపుడు ముందు ప్రసవింపబడిన వాడు చిన్నవాడు. తరువాత ప్రసవింపబడినవాడు పెద్దవాడు. కాని లోకరీతియందు ఇది తారుమారగును.

సోదరు లిద్దరును మహా తేజోవంతులు, బలవంతులు. పెద్దవాడగు సుగ్రీవుడు ఆత్మ తత్వము కారణముగ అతిబలవంతు డైనాడు. వాలి ఇంద్రాంశ అగుటచేత మనోబలమెక్కువగ ఏర్పడినాడు. తన కుమారుడు సూర్యకుమారుని అంత బలవంతుడు కాకుండుట చూచిన ఇంద్రుడు వాలికి ఒక దివ్యమగు మణిహారము నిచ్చినాడు. అది ధరించి యున్నంతవరకు వాలిని గెల్చుట ఎవ్వరికిని సాధ్యపడదు.

ఇట్లు ఆత్మవంతుడు, మనోవంతుడు అగు సోదరులలో సుగ్రీవుని యాదృచ్ఛిక అకృత్యమువలన వాలి శత్రుత్వమునకు గురియైనాడు. సహజముగ ధర్మాత్ముడగు సుగ్రీవుడు తన వలన పొరపాటు జరిగినదని, క్షమించమని వాలిని కోరినను, వాలి కఠిన మగు శత్రుభావముతోనే కూడియుండి సుగ్రీవ సంహారమునకు ఎదురు చూచుచు నుండెను. సుగ్రీవుడు పశ్చాతప్తుడై, జ్ఞానులగు మంత్రులతో కూడి ఋష్యమూక పర్వతముపై తలదాచుకొనెను. యాదృచ్ఛికముగ కలిగిన ఒక తప్పిదమువలన అమితమగు ఆపదకు గురి అయ్యెను.

కాని సుగ్రీవుడు సహజముగ సాధుస్వభావము కలవాడు. ధర్మము నాశ్రయించి జీవించువాడు. కోటానుకోట్ల వానరులకు అమిత ప్రియుడు. అతనిని యువరాజుగ అందరునూ భావించెడివాడు. ప్రస్తుతము రామునివలె భార్యను, రాజ్యమును కోల్పోయి, వనముల యందు హనుమత్సమేతుడై యున్నాడు.

హనుమంతుడు, జాంబవంతుడు తనతో కూడియుండుట యాదృచ్ఛికమగు అదృష్టము. హనుమంతుని దౌత్యము కారణముగ శ్రీరాముని మిత్రునిగ పొందుట యాదృచ్ఛికమగు సుకృతము. రాముని

మైత్రియే సుగ్రీవునికి శాశ్వత పరిష్కారము నిచ్చినది. రామ ప్రేమను, వాత్సల్యమును, మిత్రత్వమును, సాన్నిధ్యమును అపారముగ అనుభవించిన వారిలో సుగ్రీవుడొకడు. సత్పురుషులకు శుభములు యాదృచ్ఛిక సుకృతము వలన కలుగును.

శ్రీరాముని దేహత్యాగానంతరము సుగ్రీవుడు గూడ సహ భావముతో దేహత్యాగము గావించినాడు. సీతారామ లక్ష్మణులతో పాటు సుగ్రీవుడు కూడ స్వచ్ఛంద దేహత్యాగము గావించినవారిలో ఒకడు. అది ఎట్టి సుకృతమో వర్ణింప నలవి కాదు.

# 77. వాలి - సుగ్రీవులు

ఇంద్ర పుత్రుడగు వాలి ప్రవృత్తి తన ప్రధాన స్వభావముగ కలవాడు. సూర్యపుత్రుడగు సుగ్రీవుడు నివృత్తి ప్రధానముగ ప్రవృత్తి యందుండువాడు. మానవ శరీరము ప్రవృత్తికి, నివృత్తికి కూడ ఉపయోగపడును. ప్రవృత్తి మార్గమనగా మనస్సు, బుద్ధి, ఇంద్రియము లను బాహ్య విషయములపై ప్రసరింపజేయుచు, వానినే అనుభ వించుచు, అందుకొరకే జీవించుచు యుండుట. బాహ్య విషయముల ననుభవించుటకే జీవించుట. బాహ్య విషయానుభవమే దేహధారణము నకు పరమార్థమని భావించుట. తాను, తనవారు, తనది, తనకొరకు అని భావించుచు యుండుట ప్రవృత్తి మార్గము. తన శ్రేయస్సు కన్న తన ప్రీతే ప్రధానమని శ్రేయో మార్గమున చరించుట. ఇట్టి ప్రవృత్తి మార్గమునకు ఇంద్రుడు అధిపతి. తన మనస్సు నధిష్ఠించి, తన బుద్ధిని, ఇంద్రియములను, శరీరమును తమకొరకే ఉపయోగించుచు అనుభవించు జీవులను పరిపాలించుచు నుండును. వాలి ఇంద్ర పుత్రుడగుటచే ఇట్టి మార్గమున చరించుచు నుండును.

రామ సుగ్రీవులు సూర్యపుత్రులు. సూర్యుడు తనంత తాను ప్రకాశించు ఆత్మజ్ఞానమున కధిపతి. ఆత్మజ్ఞానము కలవారు నివృత్తి మార్గమును ప్రధానముగ ఆశ్రయింతురు. వారిని కర్తవ్యమే నడిపించును గాని బాహ్యాకర్షణలు కావు. తమ ప్రీతికొరకు కాక, లోక శ్రేయస్సు కొరకు తమవంతు కర్తవ్యము నిర్వర్తించుచు నుండును.

అనుభవములు పొందుచున్నను కర్త తాను కాదనియు, దైవమే కర్త అనియు, తన జీవితము దైవాధీనమే అని భావించుచు దైవము ప్రీతి కొరకు జీవించును. తనకొరకు తాను జీవించుట కాక, దైవము కొరకు జీవించుట నివృత్తిమార్గము. తాను చేయుచున్నదంతయు పరమాత్మునకు చెందినదే అని భావించుచు, తన పని కాదనియు, తన ప్రీతికొరకు కాదనియు ఎరిగి యుండును. శ్రీరాముడు నివృత్తి మార్గమునకు పూర్ణమగు ప్రతీక. అత డేకార్యమును తన ప్రీతికొరకు నిర్వర్తించలేదు. శ్రేయస్సు నుద్దేశించియే నిర్వర్తించెను.

సూర్య పుత్రుడగుట వలన సుగ్రీవుడు కూడ నివృత్తి మార్గము ననే నిలచెను. కనుకనే రాముని స్నేహమునకు పాత్రుడయ్యెను. నివృత్తి యనగా చేయకుండుట కాదు. ఇతరుల హితము నుద్దేశించి చేయుట. శ్రీరామునికి నివృత్తి మార్గ అనుయాయులే మిత్రులగుదురు. ఋషులు, అహల్య, తన సోదరులు, హనుమంతుడు, తన సహధర్మచారిణి యగు జానకీదేవి అందరును నివృత్తి ప్రధానముగ ప్రవృత్తి యందున్న వారు. పై తెలుపబడిన వారందరును పరహితార్థులే. స్వహితము కొరకు జీవించినవారు కాదు.

వాలి, సుగ్రీవుని కన్న బాహ్యముగ బలవంతుడు. అంత రంగమున బలహీనుడు. నివృత్తిపరుల కన్న ప్రవృత్తిపరులు బలవంతులు కాలేరు. కాలము వారిని క్రమముగ బలహీనులను చేయును. లోబలము ఇతర బలములకన్న మిన్నయైనది. సుగ్రీవుని లోబలమును దర్శించిన శ్రీరాముడు అతనితో మైత్రిని నిస్సందేహముగ స్వీకరించెను. అగ్నిసాక్షిగ తన మిత్రునిగ ప్రకటించెను. వాలి సుగ్రీవుల మధ్య ఇట్టి ఆంతర్యమున్నది.

# 78. రామ - సుగ్రీవ మైత్రి

రామ సుగ్రీవుల మైత్రీబంధమున సుగ్రీవుడు కోరినది వాలి సంహారము. శ్రీరాముడు కోరినది సీతాన్వేషణమునకై సుగ్రీవుడు అందింపవలసిన సహాయ సహకారములు.

సుగ్రీవుని వలన తనకు వలసిన సహాయ సహకారములు అందగలవని శ్రీరాముడు విశ్వసించినాడు. కాని సుగ్రీవుడు వాలి సంహారమునకు శ్రీరాముడు సమర్థుడో కాదోయని అనుమానము, భయము పీడించినది. చాలా కాలము వాలిని గూర్చిన భయము వలన తనయందలి విశ్వాసము కోల్పోయినాడు. మరియు వాలి వరప్రసాది యగుట వలన అతనితో ఎవరు యుద్ధము చేసినను, వారి వీర్యము, బలము తరుగుట తథ్యము. నిజముగ వాలిని శ్రీరాముడు సంహరించగలడా అను ప్రశ్న మనసున వేధించినది. రామునివలన తాను కృతకృత్యుడు కాగలడో లేడో అను సందేహ మేర్పడినది. తనయందు తాను విశ్వాసము కోల్పోయినవాడు సుగ్రీవుడు. తనయందు తాను పూర్ణమగు విశ్వాసము గలవాడు రాముడు. రాము డాత్మవంతు డగుటచే కష్టనష్టములలో భయభీతులు చెందడు. సుగ్రీవుడు కూడ ఆత్మవంతుడే కాని వానర శరీర ధర్మమును బట్టి ఆత్మ విశ్వాసము హెచ్చుతగ్గు లగుచుండును.

రాముని బలము, శౌర్యము, పరాక్రమము ప్రత్యక్షముగ తాను

తెలియగోరి జంకుచు రెండు పరీక్షలను పెట్టినాడు. దుందుభి అస్తి పంజరమును శ్రీరాముడు తన కాలి బొటనవ్రేలితో పది యోజనముల దూరమునకు తన్నినాడు. అట్లే ఒకే బాణముతో ఏడు సాల వృక్షములను, ఒక కొండను ఛేదించి, బాణము తన అమ్ములపొదిలో చేరునట్లుగ సంధించి వదలినాడు. ఈ రెండు తార్కాణములతో సుగ్రీవుడు తనయందుగల భయము, అనుమానము, సందేహము వీడి ఆనందపడి రామునికి సాష్టాంగముగ నమస్కరించి, తన వినమ్రతను చాటినాడు.

దైవమునందుగాని, గురువునందుగాని సామాన్యముగ మనము పూర్ణమగు విశ్వాసమును ప్రాథమిక దశలో పొందలేము. గురువులకు, దైవమునకు, మనకు విశ్వాసము కలుగునట్లుగ తమను తాము నిర్వర్తించుట జరుగవలెను. రెండు మూడు నిదర్శనముల పిమ్మట విశ్వాసము కుదురును. తమను, తమ మహిమను పరీక్షింపజూచుచున్నారను అభిమానము, అహంకారము సద్గురువులకు గాని దైవమునకు గాని ఉండవు. శ్రీరాముడు అభిమానపడక సుగ్రీవునికి వలసిన విశ్వాసము నేర్పరచెను.

దైవ మెవరి ననుగ్రహింప దలచునో అట్టి వానికి దైవమే విశ్వాసము కల్పించుట సృష్టి ధర్మమై యున్నది. మనము దైవమును అంత సులభముగ నమ్మము. రక్షింపుమని అర్థింతుముగాని, రక్షించునో లేదో అను భయముండును. వేరొకరు రక్షింపజాలరని తెలిసినను, దైవము రక్షింపవలెనను విశ్వాసము కలుగుట చాల కష్టము. అట్టి విశ్వాసము దైవమే కలిగించవలెను. హనుమంతుడు

కూడ లంకలో బంధింపబడిన సీతమ్మకట్లే విశ్వాసము కలిగించినాడు. సుగ్రీవుని విషయమున శ్రీరాముని వర్తనము అత్యంత నిర్మలము అయి ఉన్నది. సుగ్రీవుని యందు తాను ప్రసన్నుడగుట వలననే అతడు కోరిన విధముగ, అతనికీ విశ్వాసము కలిగించెను. దైవమట్టి కరుణా సముద్రుడు. రామ సుగ్రీవుల మైత్రియందు రాముని వర్తనము అతి విశేషమగు మైత్రీ ధర్మము.

# 79. నివృత్తి మహిమ

వాలి సుగ్రీవులు ప్రవృత్తి నివృత్తుల ప్రతీకలుగ గోచరింతురు. ప్రపంచమున ప్రవృత్తి బలమే నివృత్తి బలమును మించి యుండును. కనుక వాలి, సుగ్రీవుని కన్న ఇహలోకమున బలవంతుడు. సుగ్రీవుడు కొంత ఆత్మనియతి కలిగి పరమాత్మ అధీనమునకై యత్నము చేయు నివృత్తిపరుడు. ఆ దృష్టితో యుండుటచే అతడు నిర్వర్తించు కార్యముల ద్వారా నివృత్తి మార్గమునే ప్రేరేపించి, దైవము దరి చేర్చును. నివృత్తి మార్గమున చేయువాడు తాను కాదని, చేయుచున్న పని కూడ తన పని కాదని దైవ మాధీనమున తన జీవితము నడచు చున్నదని తెలియుచు నుండును. నివృత్తిపరుల వెనుక భగవంతుడుండును. అతడధీనమున నివృత్తిపరుడు వర్తించుచుండును. కొన్ని పనులు అట్టి వానినుండి తన సంకల్పము లేకయే జరుగును. తన నుండి జరిగిన కొన్ని సంఘటనలకు తనకే సమాధానము దొరకదు. తానెందుకట్లు చేసెనో ఎంత విచారించినను తెలియరాదు.

బంగరు లేడి విషయమున సీతారామ లక్ష్మణుల వర్తనమునకు వారికే సమాధానము దొరుకలేదు. అన్నగారి మాటకన్న, వదినగారి దూషణము లక్ష్మణుని ప్రభావితుని చేసి అతనిని కర్తవ్య విముఖుని చేసినది. లక్ష్మణుని మాటను, వివేకమును విస్మరించి, సీతారాములు బంగరు లేడి కొరకు ఉత్సహించిరి. అన్నగారైన వాలి అజేయుడని తెలిసియు, సుగ్రీవుడు తెలివితక్కువగ వర్తించినాడు. వారు చేసిన

కృత్యములకు వారిని వారు సమాధాన పరచుకొనలేకపోయినారు. కాని అందరును ఒక దివ్య కార్యమునకై ఆయా సంఘటనల ద్వారా కూడుట సంభ వించినది. ఇది బలీయముగ దైవముచే వీరి నుండి నిర్వర్తింపబడినది.

రామ లక్ష్మణ హనుమ సుగ్రీవుల కూడిక లోక కళ్యాణము కొరకే అని ఉత్తరోత్తర తెలియగలదు. అట్లే నివృత్తి మార్గమున వర్తించు విభీషణుడు కూడ కూడినాడు. దైవము తనను చేరుకొనదలచిన వారిని తానే స్వయముగ నడిపించును. అత్యంత బలసంపన్నుడు, పరాక్రమవంతుడు, లోక కంటకుడు అగు రావణుని సంహారమునకు నివృత్తిపరులను క్రమముగ కూడిక చేసి, దైవము కాలము రూపమున లోక కళ్యాణమును నిర్వర్తింప జేసినది. నివృత్తిపరులే దేవుని సాధనములు లేక పనిముట్లు. ధర్మ సంస్థాపనమునకు, లోక కళ్యాణమునకు నివృత్తిపరులే దివ్య సాధనములై యుందురు. రామాయణము ప్రకటించు శాశ్వత ధర్మములలో ఇది యొకటి.

# 80. సత్వము - సత్య దర్శనము

జీవుడు సుఖపడుటకుగాని, వృద్ధి చెందుటకుగాని వలసిన గుణము సత్వగుణము. సత్వము ప్రధానముగ జీవయాత్ర సాగించుట, జీవపరముగ వృద్ధి చెందుటను సనాతన ధర్మము మరల మరల బోధించుచు నుండును. సత్వము ప్రధానముగ రజస్తమస్సులు సహకరించుచు నున్నచో జీవుడు సత్యదూరుడు కాడు. రజస్తమస్సులు సత్వము కన్న అధికమైనపుడు సత్యదర్శనము కాకపోగా తాము చూచినది, తమకు తెలిసినది మాత్రమే సత్యమని, మోహపడి నశించుట జరుగును. రామాయణమున ఋషులు, మునులు, తపస్వి జనులు సత్వగుణమును పెంపొందించుకొనుచు, అహింసా ధర్మము లకు కట్టుబడియున్న వారుగ గోచరింతురు. సత్వ మధికముగ నుండుటచే వారు శ్రీరామచంద్రుని యథార్థముగ చూడగలిగినారు. వారందరికిని రాముని యందు దైవదర్శన అనుభూతి కలిగినది. శబరికి, హనుమంతుడికి కూడ ప్రథమ దర్శనమునకే అట్టి అనుభూతి కలిగినది. సత్వము వలన సత్యము చేరువలో నుండును. దర్శనము కూడ నిచ్చును.

సుగ్రీవునికి భయము మెండగుట వలన తమస్సున పడెను. రామ దర్శనమున అతనికి వెనువెంటనే దివ్యానుభవము కలుగలేదు. వాలి భయము అతని సత్వమును మరుగు పరచెను. శ్రీరాముడు తన పరాక్రమమును రెండు ఉదంతములతో సుగ్రీవుని తమస్సును

తొలగించినాడు. ఈ కారణముగ సత్యమున నిలచి వృద్ధి చెందినాడు. శాశ్వత కీర్తిని కూడ పొందినాడు.

లంకలోని ముగ్గురు అన్నదమ్ములలో విభీషణుడు మాత్రమే సత్వమున నిలచెను. కనుక రామాశ్రయము లభించినది. రజస్సుచే రావణుడు, తమస్సుచే కుంభకర్ణుడు నశించుట జరిగినది. వాలి కూడ రజస్సుచే నశించినాడు.

రాముని తమ్ములు ముగ్గురును సత్వము నాశ్రయించుటచే ధర్మమున నిలచుటయేగాక, రాముని యందు దైవమును దర్శించి ఆజన్మాంతము అనుభవించినారు. రామాయణము పాఠకులయందు సత్వమును, ధర్మమును ప్రచోదనము చేయును. తత్ఫలముగ జీవులకు సత్యదర్శనము వీలగును.

# 81. శ్రీరాముని క్షమాగుణము

బంగరు లేడిని సీతమ్మ కొరకై కొనితెచ్చుటకు శ్రీరాముడు ఉద్యుక్తుడైనపుడు, తమ్మునిపైగల అమిత విశ్వాసము కారణముగ లక్ష్మణుని సీతమ్మకు రక్షణగ నుండుమని ఆదేశించెను.

దుందుభి సంహారమునకు ఉద్యుక్తుడైన వాలి దుందుభి దూరిన గుహలో దూరుటకు పూర్వము సుగ్రీవుని గుహాముఖమున తనకొరకై వేచియుండమని ఆదేశించినాడు.

మాతృ సమానురాలగు వదినగారి దూషణలకు క్లేశపడిన లక్ష్మణుడు రామాజ్ఞను ఉల్లంఘించి, రామునికొరకై సాగినాడు. భయము వలన సుగ్రీవుడు వాలి ఆదేశమును పాటింపక గుహా ముఖమున ఒక పర్వతమును అడ్డుగ నేర్పరచినాడు. తమ్ములగు లక్ష్మణుడు, సుగ్రీవుడు వారి వారి అగ్రజుల ఆదేశమును విస్మరించి నారు. కాని శ్రీరాముడు లక్ష్మణుని మన్నించిన విధానము, వాలి సుగ్రీవుని మన్నింపని విధానము, వారి సంస్కారములలో గల వ్యత్యాసమును స్పష్టముగ తెలియవచ్చును.

రామునికి సోదర వాత్సల్యమున్నది. లక్ష్మణుని తన పుత్ర సమానునిగ భావించెనే గాని కోపగించుకొని విమర్శించలేదు. ఒకే ఒక మాటను శ్రీరాముడు పలికినాడు. “నీపై నాకు గల విశ్వాసముచే సీతమ్మను నీకప్పగించితిని. నీవు సీతమ్మ నెందులకు విడచి వచ్చితివి?”

అని పలికి సీతాన్వేషణమున ఉద్యుక్తుడయ్యేను. లక్ష్మణుని తన ప్రాణముల కన్న మిన్నగ చూచుకొనినాడు.

సుగ్రీవు డెన్ని విధముల తన భయమును వివరించినను, మంత్రుల, బంధువుల సలహా సంపత్తి ఒత్తిడి వలన తాను రాజ్యమెట్లు చేపట్టెనో రకరకములుగ తెలియజేసినను వాలి మన్నించలేదు. తన సోదరుని సంహరించుటే కర్తవ్యముగ పెట్టుకున్నాడు. తమ్ముని తప్పులు మన్నించుట ఒక సంస్కారము. వాలి యందు సోదర ప్రేమ వెంట్రుక వాసి కూడ గోచరింపదు. అతడట్టి రాజసిక అహంకారముతో తనను తానే నశింపజేసుకొనెను.

శ్రీమద్రామాయణమున శ్రీరాముడు అందిరిని మన్నించినాడే కాని, ఎవరినీ కోరి దుఃఖపెట్టలేదు. రావణాదులను సహితము మన్నించుటకు సంసిద్ధత చూపినవాడు శ్రీరాముడు. క్షమ, దయ, కరుణ, రక్షణ అను కళ్యాణ గుణములకు రామునితో సరిపోలు వారు సృష్టియందు గోచరింపరు. మహాపరాధములనైనను మన్నించి ఉద్ధరించు తత్త్వము శ్రీరామ తత్త్వము.

# 82. హనుమంతుని రామదర్శనము

రామలక్ష్మణులను చూచిన హనుమ ప్రప్రథమముగ వారికి నమస్కరించెను. అతని నమస్కారమున నిర్మలత్వమున్నది. దర్శించిన క్షణమున వారి యందలి మాహాత్మ్యమును దర్శించెను. సుగ్రీవుని దూతగ నమస్కరింప లేదు. వారి రూపములకు ముగ్ధుడై ఆవేశపడ లేదు. ఒడలు మరచి నమస్కరించుట జరుగ లేదు. మహాప్రజ్ఞాశాలి యగుటచే రామలక్ష్మణులను చూచీ చూడగనే సహజముగ నమస్కరించినాడు. తాను దర్శించినది ఇట్లు స్పష్టముగ పలికినాడు.

1. మీరిరువురును రాజ ఋషులో, దేవతలో అయి ఉందురని అనిపించుచున్నది.

2. వ్యర్థము చేయని పరాక్రమము గలవారు. (వాలి, రావణుడు గూడ పరాక్రమవంతులే కాని, పరాక్రమమును దుర్వినియోగము చేసినారు. రామ లక్ష్మణు లట్టివారు కారు.)

3. మీరు తపస్వి జనులవలె తేజోమయముగ గోచరించు చున్నారు.

4. శ్రేష్ఠమైన దేహకాంతి కలిగియున్నారు.

5. తీవ్రమగు వ్రతదీక్షను చేపట్టిన తపోమూర్తులుగ గోచరించు చున్నారు.

6. మీ సాన్నిధ్యమున పంపానది ప్రకాశించు చున్నది.

7. మీ శరీరఛాయ అమిత ఆకర్షణముగ నున్నది.

8. మీ రిరువురును బలమగు భుజములు కలిగి, హస్తములు ఏనుగు తొండములవలె చాల పొడవుగ నున్నవి.

9. ధనుస్సులు ఇంద్ర ధనుస్సువలె కాంతివంతములై యున్నవి.

10. వృషభములవంటి మీ గమనము నిర్భీతిని చాటు చున్నది.

11. మీ కాంతిచే దాపున నున్న పర్వతములు కూడ కాంతివంతములై ప్రకాశించు చున్నవి.

12. మీరు సహజముగ పాలకులు.

13. దేవలోకము నుండి దిగివచ్చిన వారివలె యున్నారు. మనుష్య రూపమునున్న దేవతలవలె నున్నారు.

14. మీ బాహువులు మోకాళ్ళను తగులుచు, పొడవుగ నున్నవి.

15. మీరిరువురును వింధ్య పర్వతము, మేరు పర్వతముతో, సముద్రములతో, వనములతో కూడిన ఈ భూమిని ధరించెడి పర్వతములవలె నున్నారు.

శ్రీరాముని రూపమున గల వైభవము దర్శించిన హనుమంతుడు పై విధముగ వారిరువురిని సత్యవచనములతో ప్రశంసించెను. కేవలము రూపదర్శనముననే హనుమ ఇన్ని విషయముల నెరిగెను. ఇంకను రాముని గుణ దర్శనము కానేలేదు. ఋగ్వేదమునందు

సుశిక్షితుడు కానివాడు, యజుర్వేదమును ధారణ చేయనివాడు, సామవేదమును గానము చేయనివాడు హనుమవలె మాట్లాడజాలడు. అనగా, హనుమ త్రివేది. వేదజ్ఞుడు. దర్శన మాత్రమున రామ లక్ష్మణుల దివ్యత్వము రుచి చూచినాడు. హనుమకు రాజుగనున్న సుగ్రీవుడట్లు చూడలేక పోయినాడు. ఇట్టి దర్శనము హనుమకే సాధ్యము.

# 83. సుగ్రీవుని విజ్ఞత

సుగ్రీవుడు శ్రీరామునికి సీతమ్మవారు ఋష్యమూకముపై పడవేసిన నగలను చూపినపుడు శ్రీరాముడు మొదట దుఃఖించి, అటుపైన కుపితుడై సీతమ్మ నపహరించిన రాక్షసు లెవరని, ఏ దేశమున యుందురని సుగ్రీవుని ప్రశ్నించినాడు.

సుగ్రీవుడు శ్రీరామునితో ఆ రాక్షసు లెచ్చట నుందురో తెలియ దనినాడు. ఎంత పరాక్రమము కలవాడో తెలియదనినాడు. అతడు ఏ కులము వాడో తెలియదనినాడు. అయినప్పటికిని సీతమ్మను శ్రీరాముడు పొందునట్లు ప్రయత్నము చేయుదునని ప్రతిజ్ఞ చేసినాడు.

నిజమునకు రావణుని గూర్చి సుగ్రీవునకు కొంత తెలియును. పూర్తిగ తెలియదు. రావణుని పరాక్రమమును గూర్చి కూడ విని యున్నాడు. అదియును పూర్తిగ తెలియదు. వాలి రావణుని జయించిన బలశాలి. వాలి సహోదరుడగుటచే, అతని సహచర్యమున రావణుని గూర్చి కొంత తెలిసినది. రావణుడు ఎట్టి బలము కలవాడో, వరము కలవాడో, తను ఎట్టి తపస్వియో, ఎంతటి దైవభక్తుడో తనకు తెలియవు.

తెలిసీ తెలియని విషయమును, అరకొర జ్ఞానమును ప్రదర్శించుట విజ్ఞత కాదు. కనుక అట్టి సందర్భమున తెలియదని చెప్పుటయే ప్రధానము. తనకు తెలియదు గాని, తాను త్రికరణ శుద్ధిగ తెలుసుకొందునని ప్రతిజ్ఞ చేసినాడు. తెలియుటకు సర్వ

ప్రయత్నములు చేయుదునని, సహాయము చేయుదునని మిత్రునిగ వాగ్దానము చేసినాడు.

మానవ ధర్మములలోని అత్యుత్తమ ధర్మములో సుగ్రీవుని ఈ వర్తనము ఒకటి. తెలిసీ తెలియక పలుకుట అజ్ఞానముతో కూడిన అహంకారము. సగము తెలిసినపుడు, తెలిసినట్లు మాట్లాడరాదు. తెలియకయే తెలిసినట్లు మాట్లాడువారు మెండు. ఇట్టి వారి వలన అమాయకులు ఆపద యందు పడుట జరుగును. తనకు తెలిసినను వినయముతో తెలుపుట విజ్ఞత. తెలిసి, తెలియక ఆధ్యాత్మిక ప్రవచనములను బోధించువారు సంఘమున కపకారము చేయు చున్నారే కాని, హితము చేయుట లేదు. తెలియని విషయమున తెలియదని తెలుపుటకు కూడ స్థైర్యము కావలెను.

# 84. దైవ చిహ్నము

దైవ చిహ్నము ధరించుట దివ్య సంప్రదాయము. సంప్రదాయ మేదైనను తనను తానెరుగుట నిజమగు జ్ఞానము. తనను తానెరిగిన వాడే దైవమును కూడ ఎరిగిన వాడగును. తనకు తానెరుగుటకు దైవ చిహ్నము తోడ్పడును. ఆడంబరమునకు దైవ చిహ్నమును దర్శించినపుడెల్ల "తాను దైవమునకు సంబంధించిన వాడని, లోకమున సంచరించు చున్నప్పటికిని తాను దైవమునకు చెందినవాడే" యని గుర్తుండవలెను.

వేలునకు ఉంగరము, మెడలో హారము దైవ సంబంధితమై ధరించినపుడు వానిని చూచునపుడెల్ల తాను దైవ సంబంధితుడనని గుర్తు వచ్చినచో, దైవము ప్రకృతి అట్టి వానికి సహాయ సహకారముల నందించి కార్యములను సుగమము చేయును. కార్యసిద్ధి కలుగును.

ఇది రామాయణమున శ్రీరాముడు సంకేతించిన ఒక ధర్మము. ఒక ఉపాయము. రామలక్ష్మణులు ధనుర్ధారులై యుందురు. ధనుస్సనగా ప్రణవమే. ప్రణవమనగా ఓంకారము. ఓంకారమును ప్రజ్ఞ యందు సతతము ధరించువారు అజేయులు. అట్లే సీతమ్మ కూడ రామునిచే బహుమతిగ పొందిన చూడామణిని సతతము ధరించి యుండెడిది. అమ్మవారు శిరస్సున ధరించిన మణి యగుటచే శిరోమణి అని పిలువబడెడిది. అనగా సీతమ్మ వారు రాముని శిరస్సున ధరించిన సిద్ధమూర్తి. పెద్దలు, మతాధికారులు శిరస్త్రాణమును దైవ

సమానముగ భావించి ధరింతురు. ఊర్ధ్వముఖ మగు కేశములు, మణిమయ కిరీటములు, తలపాగ, వివిధములగు టోపీలు శిరస్సున ధరించుట గల అంతరార్థమిది.

సుగ్రీవుడు రాముని ప్రోత్సాహముతో వాలిని మల్లయుద్ధము నకు ప్రేరేపించెను. రాముడే తన భుజబలముగ వాలితో మల్లయుద్ధ మారంభించెను. యుద్ధమున ఇమిడి యుండుటచే తాను దైవ ప్రతినిధినని, దైవమునకు చెందినవాడ నని మరచిపోయెను. కనుక ఓడిపోయెను. సుగ్రీవుడు తన నిజస్థితిని మరచుటవలన, తన బలము సహజముగ వాలి బలము కన్న తక్కువదై యుండుట వలన పరాజయము పొందినాడు. పైగా, వాలికి వైజయంతిమాల కారణముగ ఇంద్రుని బలమున్నది. వాలిని గెలుచుటకు సుగ్రీవునికి రాముని బల మవసరము కాని యుద్ధమున రాముడు గుర్తుకు రాకపోవడము వలన అపజయము కలిగినది.

మానవులు నిత్యము దైవప్రార్థన చేయుచున్నను, కార్యము లందు నిమగ్నమై యున్నపుడు దైవసాన్నిధ్యము గుర్తుండకుండుట సర్వసామాన్యము. కాని నిత్యము సాన్నిధ్యమును గుర్తు చేయు చిహ్న మున్నచో తను తానుగ నుండుటకు, దైవముతో కూడి యుండుటకు, తత్కారణముగ కార్యసిద్ధి కలుగుటకు అవకాశమున్నది.

శ్రీరాముడు సుగ్రీవుని మరల పోరునకు ప్రోత్సహించుచు లక్ష్మణునితో సుగ్రీవుని మెడలో ఒక గజమాలను అలంకరింప జేసినాడు. గజమాల యుద్ధమున తాను దర్శించినపుడెల్ల తనకు రామలక్ష్మణుల బలమున్నదని సుగ్రీవునికి జ్ఞప్తి వచ్చుచుండుటచే,

ఉత్సాహముతో యుద్ధము గావించినాడు. తానెవరో తనకు గుర్తుండి యుద్ధము చేయుట వలన రామసహాయము లభించినది. ఇది ఒక రహస్యము. తనకు తాను గుర్తుండుట వలన తాను దైవాంశయని కూడ గుర్తుండును. తనకు తాను గుర్తుండకపోవుట వలన సంసార మందలి ద్వంద్వముల పడును.

దైవ చిహ్నము ధరించినవారు తరచు ఆ చిహ్నమును దర్శించుట వలన తమ నిజస్థితిని కోల్పోవక యుందురు. నిజస్థితి కోల్పోయినవాడు ఆత్మబలము, దైవబలము కూడ కోల్పోవుట జరుగును. సుగ్రీవుడు వాలిని సంహరించుటలో లక్ష్మణుని గజమాలయే రామునికి సుగ్రీవునికి మధ్య వారిధిగ నిలచినది. లక్ష్మణుడు రామానుజుడు, రామ దాసుడు, రామ భక్తుడు. రామునితో అభేద స్థితిని నిత్యమనుభవించు వాడు. అట్టి వాని నుండి లభించిన గజమాల రామ సాన్నిధ్యమును ప్రస్ఫుటముగ ప్రకాశింప జేయును. కనుక సుగ్రీవుడు రామానుగ్రహమును పొందగలిగినాడు.

# 85. సత్వగుణ ప్రాధాన్యత

రామాయణమునందు వాలి, ఇంద్రజిత్తు, రావణుడు వరప్రసాదితులు. భారతమున భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ వరప్రసాదితులు. దైవారాధన, ధర్మాచరణము ఆధారముగ దివ్య వరములు దేవతలచే ప్రసాదింపబడును. వరప్రసాదియైన వారు దైవమును వీడి అహంకరించినచో పొందిన వరము లన్నియు నిష్ఫలము లగును. వరగర్వము వినాశనమునకు దారితీయును. అధర్మము వలన రజస్తమస్సులు ఆవరించి సత్యదర్శనము మరుగున పడును.

దైవారాధనము, ధర్మాచరణము స్వభావము నందున్న వారు నిత్యము సత్వగుణము నాశ్రయించి యుండవలెను. సత్వగుణమే సత్యదర్శనమునకు తెర తొలగించును. లేనిచో తామెరిగినదే సత్యమని పొరపాటు పడుట యుండును.

కిష్కింధలో తార మహావీరుల నడుమ సత్యము నాశ్రయించి జీవించినది. లంకలో విభీషణుడు కూడ అట్లే సత్వమునందు ఒద్దికగ నిలచినాడు. మండోదరి కూడ సత్వము నందు నిలచినను, వైధవ్యము తప్పలేదు.

పై సన్నివేశములను గమనించినచో వరప్రసాదిత జీవితముల కన్న సత్వగుణము నాశ్రయించిన వారు తమ జీవితములను

నిర్మలముగ నిర్వర్తించుకొనుచు, దివ్యానుభూతిని పొందుచు, కడకు పరమపదము చేరినట్లు గోచరించును. తీవ్రమగు తపస్సు చేసి, దేవతా వరములను పొంది, శక్తుల నార్జించిన వారెవరును జీవితమును అనాయాసముగ నిర్వర్తించినట్లు గోచరింపదు. ఎత్తుపల్లముల జీవితము కన్న సమతూకమగు జీవితమునందు రస స్వరూపుడగు దైవము అనుభూతిని మెండుగ నీయగలడు.

రజస్తమస్సులు ఆకర్షణముగ ప్రపంచమున గోచరించినను అవి తాత్కాలిక సుఖమే ఇచ్చును. పరువెత్తి పాలు త్రాగుట కన్న నిలబడి నిర్మలమగు నీరు త్రాగుట నిజమగు జ్ఞానము. కనుకనే సత్వగుణము ప్రధానముగ గల భాగవత మూర్తులను ఆశ్రయించుట ధర్మ సూక్ష్మములలో నొకటి. అట్టి వాని ననుసరించుటలో అపాయ ముండదు. సత్వమునకు బాహ్యాడంబరము లుండవు కాని అందుబాటులో యుండును.

# 86. వాలికి రాముని సమాధానము

రామ బాణముచే నేలకూలిన వాలి, రాముని వర్తనమును ప్రశ్నించినాడు. శక్యమైనచో సమాధానము చెప్పుమని కూడ కోరినాడు. శ్రీరాముడు ధర్మార్థములను వాలికి తెలియపరచుటకు, వాలి సమాధానపడుటకు ఇట్లు చెప్పినాడు :

1. ఓ వాలి! నీవు బాలుడవు. నీకు ధర్మము తెలియదు. అర్థము నెట్లు ఆర్జింపవలెనో తెలియదు. లోకములో పెద్దల నడవడి ఎట్లుండవలెనో నీకు తెలియదు.

2. తెలియనివారు బుద్ధిసంపన్నులైన పెద్దలను ఆశ్రయించి హిత మేదియో, అహిత మేదియో తెలియవలెను. నీవు జీవితమున అట్లెన్నడును ఎవరిని ఆశ్రయించి ధర్మమును తెలుసుకొనలేదు.

3. నీవు వానర రాజైనప్పటికిని నీ రాజ్యము ఇక్ష్వాకుల రాజ్యమందే యున్నది. జంబూద్వీపమంతయు ఇక్ష్వాకు వంశము వారిది. మా రాజ్యమున అధర్మముగ ప్రవర్తించువారిని శిక్షించు బాధ్యత నాకున్నది.

4. ఇక్ష్వాకు వంశమునకు ప్రస్తుతము నేనే రాజును. నా పాదుకులను సింహాసనముపై నుంచి భరతుడు నరులను శాసించు

చున్నాడు. నా ప్రతినిధిగ నరుల నతడు శాసించు చుండగ, నేను వనమున సంచరించుచు నరేతర జీవులను శాసించుచు నున్నాను.

5. నా మిత్రుడైన సుగ్రీవునికి నీవపకారము చేసినావు. అధర్మముగా అతనిని రాజ్యమునుండి వెడలగొట్టినావు. అతని భార్యను చెరబట్టినావు. అతని భార్యను, భవనములను, సంపదను బలగర్వమున నీవాక్రమించి అనుభవించు చున్నావు. కనుక రాజుగ నిన్ను శిక్షింపవలసి వచ్చినది.

6. నీవు చేసిన పని శాస్త్రములచే, పెద్దలచే నిందింపదగిన పని. ధర్మ విరుద్ధమైన కామము నాశ్రయించి తమ్ముని, అతని భార్యని ఆక్రమించినావు. ఇది ఎవరును హర్షించదగిన విషయము కాదు.

7. కనిష్ఠ సోదరుడు కుమారుని వంటివాడు. శిష్యునివంటి వాడు. అతనిని తండ్రివలె కాపాడవలసిన నీవు బద్ధ శత్రువువలె ప్రవర్తించుచున్నావు. ఇది ధర్మ విరుద్ధము. ధర్మము ప్రత్యక్షముగ ఎరుగ తగినది కాదు. అనుమానముతో ఊహింపదగినది కాదు. ఇంద్రియములతో తెలియదగినదీ కాదు. మనస్సునకు కూడ తెలియుటకు జీవుని యందు సత్వ ముండవలెను. సామాన్యులు ధర్మమెరుగుట అసత్యము.

8. నీవు జాతిచే చపలమతివి. ఇంద్రియములకు, మనస్సునకు లొంగి వర్తించినావు. కనుక నీకు ధర్మమేమి తెలియగలదు?

9. ధర్మము హృదయమందలి గుహలో నిహితమై యున్నది.

దానిని తెలియుటకు మనసు తన మూలములోనికి చేరవలెను. అట్లు కానిచో మనకు తోచినదే ధర్మ మనిపించును.

10. తామెంతో ముచ్చటపడి ఆర్జించినది తాము దాచుకొనుట ధర్మముగ తోచును. కాని తాను ప్రేమించిన ధనమును ఇతరుల కొసంగుట ధర్మము అని వేదము చెప్పుచున్నది. సామాన్యులకు ధర్మమేమి తెలియును?

11. ప్రస్తుత మాచరించు అధర్మమే తరువాత కాలమున కష్టమును, దుఃఖమును, మరణమును అందించును. అట్టి వరము ప్రసాదించువాడే దైవము. కాలగతిని నీ కృత్యముల యొక్క ఫలము నీవిపుడు అనుభవించుచున్నావు. (దైవము ప్రత్యక్షముగను, పరోక్షముగ కూడ ధర్మాధర్మముల ఫలముల నిచ్చును. శ్రీరాముడు పరోక్షముగ వాలి కర్మఫలము వాలి కందించినాడని తెలియవలెను.)

12. నీ తమ్ముని భార్య నీకు కోడలితో సమానము. నీ తమ్ముడు బ్రతికి యుండగనే నీ వామెతో రమించినావు. అట్టి అధర్మమును నిర్వర్తించిన నిన్ను, నేను రాజుగ దండించుట తప్పనిసరి యైనది. నీ వొనర్చిన అధర్మమునకు మరణదండనమే శాస్త్రము సూచించు చున్నది గనుక నిన్ను సంహరించవలసి వచ్చినది.

13. సుగ్రీవునితో మైత్రి ధర్మముతో నే నేర్పరచుకున్న మైత్రి. సీతమ్మకొరకు మాత్రమే కాదు. ప్రయోజనాపేక్షతో నేను సుగ్రీవుని మిత్రునిగ చేసుకోలేదు. నేను ధర్మబద్ధుడను. సత్యమునే పరిపాలించు

వాడను. సత్య ధర్మముల నెరిగి, సుగ్రీవుని మిత్రునిగ అంగీకరించి, అధర్మపరుడగు నిన్ను సంహరించుట జరిగినది.

14. నీ చరిత్రయే నీ చావునకు కారణమైనది. ధర్మాచరణము లేని నీ జీవితము వ్యర్థము. అధర్మాచరుని శాస్త్రానుసారము రాజు శిక్షించిననాడు అతడు పవిత్రుడు కాగలడు. రాజునకు కూడ పాపమంటదు. శాస్త్రము ననుసరించియే నిన్ను శిక్షించుటవలన నీవు తరించితివి. నాకును పతనము కలుగదు.

15. నీవు తిర్యక్ జాతికి చెందిన వాడవగుటచే నిన్నెట్లు చంపినను అధర్మము కాదు. కనుకనే చాటుగ నుండి చంపినాను. మృగములను మాటువేసి, వలవేసి, ఉరిపోసి పలురకములుగ చంప వచ్చును. ఎదురుగా వెళ్లిగాని, దాగివుండి గాని మృగములను చంపుట రాజర్షులకు ధర్మమే. రాజర్షులు వేటగావించి అతిక్రమించు మృగము లను చంపుట ధర్మము. లోకమున బాధించు వానిని, బలగర్వముచే అధర్మముగ పీడించువారిని, హింసించువారిని చంపుట ధర్మమే. రాజు ధర్మ నిర్వహణమున చేయు వధ, వర్జింపబడిన వానిని కూడ ఉత్తమగతిని ప్రసాదింపగలదు. జాతిచే నీవు నరుడవు కావు గనుక, అతిక్రమించి వర్జించుచున్నావు గనుక, నిన్నెట్లు చంపినను దోషము లేదు. నిన్ను చంపుట వలన నీకు ఉపకారమే జరిగినదని తెలుసు కొనుము.

# 87. హనుమ ఉపదేశము

దుఃఖముతో తార నేలపడియున్న వాలినిచూచి విలపించు చున్న సందర్భమున తారకు హనుమ ఉపదేశము గావించెను. జీవులందరికిని ఈ ఉపదేశము అత్యంతావశ్యకమై యున్నది. అది ఇట్లున్నది.

"జన్మనెత్తిన ప్రతి ప్రాణియు వెనుక జన్మలలో చేసిన కర్మ ఫలమును అనుభవింపక తప్పదు. తెలిసిగాని, తెలియకగాని చేసిన కర్మల వాసనలు జీవుని అంటిపెట్టుకొని యుండును. వాని ఫలముగ సుఖ దుఃఖములు అనుభవింపవలసి వచ్చును. ఏ లోకమున కేగినను శుభాశుభ కర్మలు ఫలముల నిచ్చుచుండును.

"వాలిని సుగ్రీవుడు చంపలేదు. శ్రీరాముడును చంపలేదు. అతని కర్మమే అతనిని చంపినది. కర్మ అచేతనము గనుక, సుగ్రీవుడు నిమిత్తమాత్రుడైనాడు. జనన మరణములకు చేసిన కర్మయే కారణము.

"ఈ శరీరము నీటిబుడగ వంటిది. అస్థిరమైనది. ఎప్పుడు బ్రద్దలగునో తెలియదు. ఇది అందరి విషయమునను సత్యమే. నీ శరీరము గూడ అంతమగును కదా! దానిని గూర్చి శోకింపుము. అంతమైన వాలి శరీరమును గూర్చి శోకించి ఏమి ప్రయోజనము. నీ దేహము స్థిరముగ నున్నచో చనిపోయిన వానిని గూర్చి శోకింప వచ్చును. నీ శరీరము కూడ పోవునదే. స్థిరచిత్తు లెవ్వరును పోయిన

వారిని గూర్చి శోకింపరు. తాను కూడ ఒకనాడు దేహము వదలవలసి యుండునని జ్ఞప్తి చేయుటకే ఇతరుల మరణము. గతించిన వారిని గూర్చి శోకించుట మాని, ఉన్నవారి యెడల కర్తవ్యమేమో గమనించి వర్తించుట తెలివి.

"ఇట్టివాడు పుట్టునని ముందుగ ఎవరికిని తెలియదు. అతడెట్లు పోవునో కూడ తెలియదు. ఎవడైనను వాని ప్రవర్తన యందలి ధర్మాధర్మములను ఎదుర్కొనక తప్పదు. కనుక పరివారమున ఒక మరణము సంభవించినపుడు పోయిన వారి యెడల, ఉన్న వారియెడల మనకున్నది కర్తవ్యమే. ప్రస్తుత కర్తవ్యము తెలుసుకొని ఆచరించుట ఉత్తమము."

# 88. ధర్మ రహస్యము

ధర్మము ప్రత్యక్షముగ ఎరుగదగినది కాదు. పరోక్షముగ ఊహింపదగినది కాదు. ఇంద్రియములతో గ్రహించి, మనసుతో మాత్రమే ఆలోచించువారికి ధర్మము ఎరుగ శక్యము కాదు. సామాన్యులకు, సత్పురుషులకు కూడ తెలియుటకు శక్యము కానిది ధర్మము.

ఇంద్రియములకు, మనసునకు లొంగి వర్తించువానికి ధర్మము తెలియుట అశక్యము. సర్వజీవరాశుల హృదయములలో అంతర్యామియై యున్న ఈశ్వరుడొక్కడే ధర్మమెరుంగ గలడు. ఈశ్వరుడు ఆత్మలకు ఆత్మ. అతడే సర్వసాక్షి. అతడే మంచి చెడులను గుర్తింప గలవాడు. అతడు జీవుల హృదయములలో నుండును. ధర్మము అతని నాశ్రయించి యుండును. కనుక ధర్మము గుహయందు నిహితమై యున్నదని, ఈశ్వరునికే తెలియబడుచున్నదని తెలియవలెను.

సుఖ దుఃఖములకు లోనగు జీవులకు బుద్ధిచే కూడ ధర్మము తెలియబడదు. ధర్మము సుఖ దుఃఖముల కతీతము. సుఖము నిచ్చునది ధర్మమని, దుఃఖము నిచ్చునది అధర్మమని భావించుట వాస్తవము కాదు. ధర్మమున నిలచినవారు, సుఖ దుఃఖముల కతీతముగ నిలచిన వారు శ్రీరాముడు, యుధిష్ఠిరుడు, నలుడు, హరిశ్చంద్రుడు. అట్టి ధర్మమును అనుసరించుటచే వీరు మార్గదర్శకులైనారు. శాశ్వతముగ పూజనీయులైనారు.

ఎంత గొప్పవారికైనను తాము చేసిన పనులలో అధర్మ

మున్నదని అనిపించదు. ఏ పాపము చేయకయే దుఃఖము ననుభవించు చున్నాము అనిపించును. ఏ పాపము చేయనపుడు దుఃఖమెందుకు కలిగినది అనెడి ప్రశ్నకు సమాధానము లభించదు. ఆత్మవంతుడైన వానికి మాత్రమే అది స్పష్టముగ తెలియును.

ఈ శరీరము వీడిన తరువాత ఉత్తమమైన గతులను పొందుటకు సాయపడునది ధర్మము. ధర్మముచే శిక్షింపబడినపుడు సంభవించు మరణము వలన, మరణించిన జీవునకు పాపము పరిహరింపబడి ఉత్తమ జన్మ లభించును.

వాలికి శ్రీరాముడు అట్టి ఉత్తమగతులను ప్రసాదించెను. అదృశ్యముగ శ్రీరాముడు వాలి నుద్ధరించినాడు అనునది ఒక ధర్మ రహస్యము. కనుకనే వాలి కూడ రోషము తగ్గినవాడై, ప్రశాంత స్థితిలో ధర్మమేదియో నిశ్చయముగ తెలిసినాడు. శ్రీరాముడు తనని చంపుట తనకే ఉపకారమని తెలిసినాడు. తన తప్పులను మన్నించ మనినాడు. తాను ధర్మమును గుర్తింపలేకపోయినాను అనినాడు.

అంతేగాక రాము నుద్దేశించి, నీవు యథార్థమును ఉన్నది ఉన్నట్లుగ తెలియగలవాడవు. మరణ దండనమే నా పాపమునకు పరిష్కారమని నిర్ణయించినావు. నేనాచరణము లేనివాడను. చేయరాని పని చేసితిని. నీవు నన్ను క్షమించితివని ఒక్కమారు పలికి నన్ను పాలింపుము. నన్ను గూర్చిన విచారము నాకిక యుండదు. నేను భాగ్యశాలి నగుటచే నీ ద్వారా పొందవలసిన గతిని పొందెదను.

పై విధముగ రామబాణ స్పర్శచే వాలికి కనువిప్పు కలిగి, ధర్మము తెలిసి సంతృప్తిగ దేహము వీడినాడు.

# 89. తార సాత్వికత

వాలి మరణమున తార ఎంతయో దుఃఖించినది. గుండెలు బాదుకొనుచు విలపించినది. వాలి లేని తన జీవితము, తాను లేని జీవితము వాలికిని దుర్భరమని భావించినది. పరలోకములందు తాను లేకపోవుటచే వాలి సుఖించలేడని భావించినది. అట్లే వాలి లేక తాను భూలోకమున వసించుట శక్యము కాదని భావించినది.

యుద్ధమున మరణించి పడియున్న వాలికి సమీపమున కోదండము ధరించి శ్రీరాముడు గోచరించినాడు. వాలిని చంపినది శ్రీరాముడే అని తెలిసియుండుటచే, ఒక్కమారుగా రామునిపై కోపము పెల్లుబికినది. పరుషమగు వాక్కులతో తనకు దుఃఖము కలిగించిన రాముని బాధింపవలెనని భావించినది. దూషింపవలెనని నిశ్చయించు కొనినది. కాని రామునకు చేరువగ వచ్చిన తారకు రాముని దివ్య మంగళ విగ్రహము గోచరించగనే ఆమె యందలి శుద్ధసత్వము ఉవ్వెత్తున పుట్టుకొచ్చినది. మనసులోని కాలుష్య మంతయు వీడిపోయినది. రజోగుణ ప్రకోపము ఉపశమించి అప్రయత్నముగ రాముని కీర్తించినది. సహజ సత్వగుణ సంపన్నులకు మాత్రమే ఇట్టి అనుభవము కలుగును. విముఖతతో గాని, వినికిడి వలన గాని సత్పురుషుల యందేర్పడిన దురభిప్రాయము సత్పురుష దర్శనమున పటాపంచలగు చుండును. దురభిప్రాయములు తొలగి దివ్యమగు సత్వానుభూతి కలుగును.

ఋషులలో కొందరు రాముని చూచువరకు భిన్నమగు అభిప్రాయములు కలిగి యుండిరి. రాముని చూడగనే అవి పటాపంచలై మాయమైనవి. రామునిపై మోహము కూడ కలిగినది. ప్రథమముగ శ్రీరాముని దర్శించిన రావణునికి కూడ "లో సత్వము" వెల్లుబికినది. తార సహజముగ సత్వగుణ సంపన్ను రాలగుటచే పరుషముగ దూషించవలె ననెడి భావము అదృశ్యమై భక్తితో ప్రశంసించినది. సత్వగుణమునకున్న బలమట్టిది. రాముడు శుద్ధ సత్వ స్వరూపుడు. శుద్ధ బ్రహ్మము. అందువలన తార ఈ క్రింది విధముగ ప్రశంసించినది.

"ఓ రామా! నీవప్రమేయుడవు. జితేంద్రియుడవు. మనసుచే ఇంద్రియములచే చేరుటకు శక్యము కానివాడవు. ఉత్తమ మగు ధార్మికుడవు. అక్షయమగు కీర్తి కలవాడవు. విచక్షణ కలవాడవు. భూమి యంతటి ఓర్పు కలవాడవు. ఆగ్రహానుగ్రహములు కలవాడవు" అని కీర్తించినది.

రాము డింతటి వాడని ఎరుంగుట కెవరికిని శక్యము కాదు. రామానుగ్రహమున్నపుడే రాముని గూర్చి ఎరుంగుటకు వీలుపడును. జ్ఞానులకు కూడ ఇంతటి వాడని ఎరుంగుటకు సాధ్యపడదు. అట్టి శ్రీరాముని దివ్యత్వమును గుర్తించిన తార ఎంతటి అనుగ్రహ పాత్రురాలో స్పష్టముగ తెలియనగును. కిష్కింధలో హనుమంతుని తరువాత రాముని దివ్యత్వమును దర్శించినది తారయే. వీరిరువురును ప్రథమ దర్శనముననే గ్రహించిరి. సుగ్రీవునికి కొంత సమయము పట్టినది.

# 90. శ్రీరాముని బోధ

1. చనిపోయిన వారి గూర్చి పరితపించుటచే, చనిపోయిన వారికి శ్రేయస్సు కలుగదు. వారికి ఉత్తరక్రియలు నిర్వర్తించుట వలన శ్రేయస్సు కలుగును. చనిపోయిన వారు తరువాత పొందెడు లోకములను పొందుటకు ఆ సంస్కారములే కారణములు. వానిని సవ్యముగ నిర్వర్తించుట ఉన్నవారి కర్తవ్యము. సహజముగ కొంత ఏడ్వవచ్చును గాని ఎప్పుడునూ శోకించుచు నుండుట శ్రేయస్సు కాదు.

2. సృష్టి యందెవ్వరును స్వతంత్రులు కారు. కాలముచే నియమింపబడి, పాలింపబడు చుందురు. కాలము నెవ్వరునూ అతిక్రమించలేరు. లోకులు, లోకములు, లోకేశ్వరుడు కూడ కాలమునకు లోబడియే యుందురు.

3. కాలమన్నను, ఈశ్వరుడన్నను ఒక్కటియే. ఈశ్వరుని అధీనమై లోకములు ప్రవర్తించుచున్నవి. కాలము, నియతి, స్వభావము అని ఈశ్వరునే వ్యవహరింతురు. ఈశ్వరుడు తప్ప మరి ఎవ్వరికిని స్వతంత్రత లేదు. అందరునూ పరతంత్రులే. కాలమునకు వశపడి జీవించు చుందురు.

4. లోకములో వర్తించు వస్తువులన్నియు ఆరు మార్పులకు గురియగు చుండును. పుట్టుట, పెరుగుట, మారుట, తరుగుట, నశించుట, ఉండుట. ఎప్పుడునూ మార్పు లేకుండ యుండునది ఈశ్వరుడే.

5. కాలము, ఈశ్వరుడు తనంతట తాను నడచునది. స్వతంత్రముగ నడచునది.

6. కాలమునకు బంధుత్వము లేదు. పక్షపాతము లేదు. కాలమును వశపరచుకొనుటకు ఉపాయము లేదు. అనుకూల ప్రతికూలములు కాలమున ఏర్పడినపుడు తలవంచుటయే గాని మరియొక మార్గము లేదు.

7. ధర్మార్థకామములు కూడ కాలానుగుణముగ వచ్చుచు పోవుచు నుండును. కర్మానుగుణముగ ఏది రావలెనో అది వచ్చుచు పోవుచు నుండును. శోకించుట, హర్షించుట సహజమే అయినను సమయమునకు తగిన విధముగ కార్యము నిర్వర్తించుటయే జీవుల కర్తవ్యము.

8. వాలి అర్థకామములకు పరవశుడై దుష్కర్మకు లోనైనాడు. యుద్ధమున మరణించి పరిశుద్ధుడైనాడు. ప్రాయశ్చిత్తము కూడ జరిగినది. అతడు శ్రేష్ఠమగు మార్గమున చనుటకు సంస్కారములు సవ్యముగ నిర్వర్తించుటయే చేయవలసిన కర్తవ్యము.

పై భాషణమున రాముని గంభీరమగు భావము ఆవిష్కృత మైనది.

# 91. లక్ష్మణుని అశోక సూక్తము

1. బాధపడుట, శోకించుట తగని పని.

2. శోకించువానికి సర్వ కార్యములు చెడిపోవును.

3. కార్యసిద్ధికి ప్రయత్నము చేయుట శోకించువాని ప్రథమ ప్రయత్నమై యుండవలెను.

4. దైవమును, శాస్త్రమును విశ్వసించువారు కర్తవ్యమున నిలుతురేగాని, శోకమునకు వశము కారు.

5. శోకమునకు విరుగుడు పట్టుదలతో కర్తవ్యముల నాచరించుట.

6. క్రుంగిపోవుట, శోకించుట త్వరితగతిని వీడుట తెలివి.

7. వర్షకాలము గతించి శరదృతువు వచ్చినట్లు శోకము నుండి జీవుడు కర్తవ్యమునకు ఉద్యమించవలెను.

8. భస్మముచే అగ్ని కప్పబడినట్లు, శోకముచే అగ్ని స్వరూపు డగు జీవుడు నశింపరాదు. కర్తవ్యముచే ప్రజ్వలింపవలెను.

# 92. మిత్ర సూక్తము

హనుమ సుగ్రీవుని కాప్తుడు, మిత్రుడు. తండ్రియగు సూర్యునికి శ్రేష్ఠమగు శిష్యుడు. ధర్మార్థ కామముల నెరిగినవాడు. నియతి గలవాడు. సుగ్రీవునికి ప్రీతిపాత్రుడు. సదా సుగ్రీవుని మేలుకోరువాడు. సుగ్రీవునికి హనుమ అనిన పై కారణముగ ప్రీతి. అట్టి హనుమ సుగ్రీవునికి అవసరమగునపుడు హితవాక్యములను నిర్భీతిగ తెలిపెడివాడు. అట్లే ఈ క్రింది మిత్ర ధర్మము తెలిపెను.

1. మిత్రునికి చేయుదనని చెప్పిన మాట నిలుపుకొనవలెను.

2. మిత్రుని వలన ధనము, రాజ్యము, కీర్తి, సంపద కలిగినపుడు, అట్టివాని పనిని అత్యవసరముగ నిర్వర్తించవలెను.

3. కాలమును, దేశమును ఎరిగి మిత్ర కార్యములు నిర్వర్తించువానికి అనర్థము కలుగదు.

4. మిత్రుడు తనకు దూరము కాకుండ కాపాడుకొనుట అతి ముఖ్యము.

5. మిత్రుని అవసరమును గమనించి, ఆదుకొనని వానికి హాని కలుగుట తథ్యము.

6. ఎన్ని పనులున్నను మిత్ర కార్యమునకు ప్రాధాన్యమిచ్చువాడు అనర్థములను పొందడు.

7. మిత్రుని పని సకాలములో నిర్వర్తింపవలెను. ఆలస్యము జరుగరాదు.

8. మిత్రుడు తన కార్యము ఎట్టి త్రికరణశుద్ధితో నిర్వర్తించు చున్నాడో గమనించి, అట్లే ప్రతిస్పందించవలెను.

9. మిత్రుడు కోరకయే మిత్రకార్య మెరిగి వర్తించువాడు నిజమగు మిత్రుడు.

10. కోరకయే నీకుపకారము చేయు వానికి, నీవు ప్రత్యుపకారము కోరకయే చేయవలెను.

11. మిత్రకార్యమున శక్తివంచన జరుగరాదు.

12. స్వకార్యముకన్న మిత్ర కార్యమునకు ప్రాధాన్యత నిచ్చు వాడు ఉత్తమగతిని పొందును.

# 93. పునః సమాగమము

సద్గురువులు తమ శిష్యులకు చాల చనువిత్తురు. వాత్సల్య ముతో వర్తింతురు. ప్రీతితో వారిని ఆదరింతురు. శిష్యులకు సద్గురువు సామీప్యత సుఖము నిచ్చును. సద్గురువు కూడ తమ శిష్యులు సుఖ సంతోషములతో కూడి తన ననుసరించ వలెనని భావించును. అనుసరణము శిష్యుని బాధ్యతయే!

సుఖ సంతోషముల కలవాటు పడిన శిష్యులు గురుసామీప్యత విలువను గమనింపలేక అశ్రద్ధ చేయుదురు. గురువు ఏర్పరచిన మార్గమున వర్తించుట యందు అలసత్వము చూపుదురు. సద్గురువు సహనముతో శిష్యుల పునరాగమనము, సహగమనము కొరకు వేచి యుండును. అట్టి సద్గురువుల యొద్దగల శ్రద్ధాళువులైన శిష్యులే ఇతరులకు హెచ్చరిక చేయవలెను. లేనిచో శిష్యులు పురోగమనము లేక సంసారబంధమున చిక్కుపడి నశింతురు. ఈ ధర్మము శ్రీమద్రామాయణ గాథలో ఒక ఉదంతముగ దర్శింపవచ్చును.

సుగ్రీవుడు శ్రీరామునితో మిత్రత్వము కలిపెను. తన బంధ స్థితినుండి శ్రీరాముడు తనను విముక్తుని చేయగలడని విశ్వసించెను. రామ సహకారమున వాలిని సంహరించెను. కిష్కింధకు రాజయ్యెను. శ్రీరాముడు విశ్వాసముతో, వాత్సల్యముతో సుగ్రీవుని రాజ్యాభిషిక్తుని గావించి, కొంత తడవు రాజ్యసుఖము లనుభవింపుమని, అటుపైన

కర్తవ్యోన్ముఖుడవు కావచ్చునని తెలిపెను. సుఖ భోగముల మునిగిన సుగ్రీవుడు శ్రీరాముని యెడల తన కర్తవ్యమును అశ్రద్ధ చేసినాడు. రాముడిచ్చిన చనువు దుర్వినియోగము కావించినాడు. తత్ఫలితముగ రామలక్ష్మణుల ఆగ్రహమునకు గురియైనాడు.

రాముని దూతగ లక్ష్మణుడు సుగ్రీవునకు అతని కర్తవ్యమును నిష్కర్షగ, పరుషముగ గుర్తు చేసినాడు. సుగ్రీవుడు శ్రీరాముని కార్యము నెరవేర్చ సంకల్పము కలిగియున్నాడేకాని అప్రమత్తత తగ్గినది. మత్తుడై భోగములయం దాసక్తిచే రామసన్నిధిని చేరుట కాలస్యము చేసినాడు. అతడాలస్యము చేసినాడని శ్రీరాముడు బాధపడినాడు. లక్ష్మణుడు తన కర్తవ్య మెరిగి, సుగ్రీవుని హెచ్చరించినాడు. అందులకై వన వాసియైన లక్ష్మణుడు, సుగ్రీవుని అంతఃపురమున ప్రవేశించుటకు జంక లేదు. హనుమంతుడు కూడ జరుగుచున్నది గమనించుటచే, సుగ్రీవునితో నిష్కర్షగా ఇట్లు పల్కెను. "సుగ్రీవా! నీవు తప్పు చేసితివి. అందుకు ప్రాయశ్చిత్తముగ నీవు లక్ష్మణునకు నమస్కరించి, అనుగ్రహింప జేసుకొనుము. లక్ష్మణు డనుగ్రహించినచో శ్రీరాముడు కూడ ప్రసన్నుడు కాగలడు." సుగ్రీవుడు సహజముగ సద్గుణోపేతు డగుటచే అహంకరించక హనుమ చెప్పినట్లు చేసి, మరల రామ కార్యమున పునః నిర్మితుడైనాడు.

సమర్థుడైన వాడు తనలో దోషమున్నను తననే సమర్థించు కొనును గాని, సుగ్రీవునివలె తనను తాను బయట పెట్టుకొనడు. కనుకనే సుగ్రీవుడు రామ పరివారము చేరగలిగినాడు. సదాచార సంపన్నులగు శిష్యులు అహంకారము విడిచి తమ దోషముల

నంగీకరించి, సద్గురువుతో పునః సమాగమము చెందవలెను. లేనిచో పరిష్కారములు లభించక, వంచింపబడుదురు.

లక్ష్మణ హనుమలు రామాజ్ఞను శిరసావహించి వర్తించు ఆప్త శిష్యులు. సుగ్రీవుడు కూడ తన దోషముల నంగీకరించి శ్రీరాముని మరల చేరి, ఆప్తుడైనాడు. సుగ్రీవుడు శిష్యకోటికి ఆదర్శవంతుడై నిలచినాడు.

# 94. సుగ్రీవుని ప్రతిభ

సుగ్రీవుడు భూమండల మందలి సమస్త వానరులను పక్షము రోజుల లోపల రమ్మని కబురంపగా, దానిని యముని ఆజ్ఞవలె వానరులందరు భావించినారు.

1. నల్లనైన పర్వతములనుండి మహాకాయులగు వానరులు మూడు కోట్లమంది వచ్చిరి.

2. పశ్చిమ పర్వతము నుండి పదికోట్ల వానరులు బంగారు కాంతి గలవారు వచ్చినారు.

3. హిమవత్ పర్వతము నుండి వెయ్యికోట్లమంది వానరులు వచ్చినారు.

4. వింధ్య పర్వతముల నుండి వేయికోట్ల ఎర్రనైన, భయం కరమైన వానరులు వచ్చినారు. మొత్తము రెండు వేల పదమూడు కోట్ల (2,013) వానరులు సుగ్రీవుని చెంతన చేరినారు.

వీరు కాక కోటానుకోట్ల వానరులు కామరూపము కలవారు ఆకాశమున నిలచినారు. మరియు శతవలి అనెడి వానరుడు మేరు పర్వతమునుండి పదివేలకోట్ల వానరులతో వచ్చినాడు. కొండవంటి ఆకారముగల సుషేణుడు పదివేలకోట్ల సైన్యముతో వచ్చినాడు. తారుడు అనెడి వానరుడు వెయ్యికోట్ల వానరులతో వచ్చినాడు. కేసరి అనెడి వానరుడు వేలకోట్ల వానరులతో వచ్చినాడు.

వీరుకాక గోలాంగూలములు, వెలుగుబంట్లు, ఇతర మహా వీరులు ఎన్నివేల కోట్లతో వచ్చినారో లెక్క లేదు. ఇది అంతయు వానర సైన్యము. వీరంతా సుగ్రీవుని ఆజ్ఞకు లోబడి జీవింతురు.

వీరిలో వినీతుడు అనెడి వానరుడుని తూర్పు దిశకు; హనుమ, జాంబవంతుడు, నీలుడు, అంగదుడు దక్షిణ దిక్కుకు; సుశేణు డనెడి వానరుని పశ్చిమ దిక్కునకు; శతవలి అనెడి వానరుని ఉత్తర దిక్కునకు వారి వారి సహచరులతో పంపుచు, సీతమ్మ జాడను తెలియ రమ్మన్నాడు.

ఆ సందర్భమున ఏయే దిక్కుల యందు, ఏయే పర్వతము లున్నవో, లోయ లున్నవో, గుహ లున్నవో, నదులు సముద్రములు ఉన్నవో అత్యంత వివరములతో సుగ్రీవుడు వెదకబోవు వానరులకు సవివరముగ తెలుపగా శ్రీరాముడు ఆశ్చర్యచకితు డయ్యెను. భూమండలము నంతను క్షుణ్ణముగ వివరించి, వెదకబోవు వానరులకు అద్భుతమైన సూచనల నిచ్చిన సుగ్రీవుని వంక చూచి “ఇంత లోతైన భూమండల జ్ఞానము నీ కెట్లేర్పడినది” అని ప్రశ్నింపగా సుగ్రీవు డిట్లనెను.

“రామా! అన్నగారు వాలి నాపై ఆగ్రహించి నన్ను హత మార్చుటకు పట్టుదలతో ప్రయత్నము చేయగా అన్ని దిక్కులకు పారితిని. పర్వతములు, లోయలు, గుహలు, నదులు, సముద్రములు, అడవులు ఇత్యాది వానియందు జొరబడి దాగుకొన ప్రయత్నము చేసితిని. బలశాలియగు అన్నగారు నాతో సమానముగ అన్నిటి యందు ప్రవేశించి వెంటబడెను. సంహరింప జూచెను. తుదకు

హనుమ సలహా సహకారముల వలన ఋష్యమూక పర్వతము చేరి ప్రాణములను కాపాడుకొంటిని. మతంగ మహర్షి శాపమువలన వాలి ఋష్యమూకమునకు రాలేడు.”

శ్రీరాముడు విస్తుపోయినాడు. ప్రాణముల కొరకు పరువెత్తు జీవుడు అదే సమయమున అనేకానేక విశేషములను భూమి నలుదిక్కుల దర్శించుట, కేవలము దర్శించుటే గాక, సమస్తము వివరములతో గుర్తుండుట అనునది సాధ్యపడని విషయము. సుగ్రీవుని ప్రజ్ఞా పాటవములు, ప్రతిభ ప్రత్యక్షముగ దర్శించిన రాముడు, ఇట్టి మిత్రుడు లభించిననాడు లోకములన్నియు జయించవచ్చును. అమితముగ హృదయమున సుగ్రీవుని శ్లాఘించెను.

# 95. దైవ విలాసం

దైవ విలాసమును ఊహించుటకు ఎవ్వరికిని శక్యము కాదు. వాలి సుగ్రీవుని హతమార్చుటకు వెంటపడగా, సుగ్రీవుడు భూమండల మంతయు పరువెత్తుచు భూమండల జ్ఞానమును పొందెను. ప్రాణ భయముతో పరుగెత్తువాడు పరిసరముల నన్నిటిని గమనించుట, ధారణ చేయుట అనునది అసామాన్యమైన విషయము. తాను ధారణ చేసిన విషయము భవిష్యత్తున తనకు వినియోగపడునను భావము ఆ సమయమున లేదు. అవకాశము కూడ లేదు.

భూమండల మంతయు తన నలుగురు మంత్రులతో తిరుగాడెను. భూమంతయు తిరుగాడిననూ, వాలి నుండి తనకు ఎచ్చటనూ రక్షణలేదని భయపడుచుండగ, వెంటనున్న హనుమంతునికి మతంగముని ఆశ్రమము, వాలికి గల శాపము గుర్తు వచ్చినది. అది ఏమి చిత్రము! బుద్ధిమంతుడు, జ్ఞానవంతుడు అగు హనుమకు ముందెందుకు గుర్తురాలేదు? తరువాతనే ఎందుకు గుర్తు వచ్చినది? సత్పురుషులు కష్టకాలమున పడు శ్రమనుండి దైవమేదో ఒక మంచి విషయమును అంతర్హితముగ నేర్పుచు నుండును. ముందు గుర్తు రాకుండుట, భూమి నలు దిక్కుల తిరుగాడిన వెనుక హనుమకు గుర్తు వచ్చుట దైవ విలాసము కాక మరియేమి! శ్రమపడు కాలమున, శ్రమనే గుర్తుంచుకొను వారు సామాన్యులు. శ్రమయందలి అనుభవ జ్ఞానమును వినియోగించువారు అసామాన్యులు.

సమయమునకు ఒక విషయము గుర్తు వచ్చుట, రాకుండుట దైవవశమున యుండును గాని, జీవుల వశ మందుండదను సత్యము ఈ ఉదంతమున తేటతెల్లమైనది. తెలిసిన విషయమే అయినను సమయమునకు స్ఫురించుట అనునది దైవానుగ్రహము. స్ఫురింప కుండుట అనునది దైవ విలాసము. కనుక ఎంత తెలిసిన వారైనను, తమకు తెలుసను అహంకారము వలన ఉపయోగము లేదు. స్ఫురణ కలుగుట, కలుగకుండుట అనునది ఎవరి వశమునందు లేదు. ఎంతటి వారైనను దైవమునకు లోబడి వర్తించుటయే శ్రేయస్కరము.

సుగ్రీవుని భూమండల పర్యటన, జీవితములో తరువాతి ఘట్టముల యందు ప్రాముఖ్యత వహించినది. అతడత్యంత సమర్థతతో వానర వీరులను భూమి నలుదిశలకు పంపుటయే కాక, వారికి చక్కని మార్గదర్శకత్వము వహించినాడు. వానర రాజుగ సముచిత ముగ వర్తించినాడు.

# 96. దైవము తోడ్పాటు

స్వయంప్రభ, సంపాతి అను ఇరువురి దయ వలన దక్షిణ దిక్కున కేగిన హనుమంతాది వానరులకు మార్గము సుగమమైనది. దైవ మనుకూలించినపుడు అయాచితముగ కార్యసిద్ధికి మార్గములు తెరువబడును.

దక్షిణ దిక్కుగ సీతాన్వేషణమునకై బయలుదేరిన వానర సమూహము ఆశ్వయుజ మాసమున సుగ్రీవాజ్ఞగ బయలుదేరిరి. సుగ్రీవుడు నలుదిక్కులకు చనిన వానరులకు అన్వేషణకై గడువు నేర్పరచినాడు. ఆ గడువులోపలే ఇతర దిక్కులకు చనిన వారందరును విఫలులై తిరిగి వచ్చిరి. నెలరోజుల గడువులో వారు చేసిన ప్రయత్న ములు ఫలించలేదు. కాని దక్షిణ దిక్కునకు ఏగిన హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు, తారుడు గడువు మించిపోయినను అన్వేషణ మాపలేదు. ఆకలిదప్పులకు ఓర్వలేక ఒక బిలమున ప్రవేశించిరి. అచట స్వయంప్రభ అను తపస్వినిని దర్శించి ఆమె అనుగ్రహముచే బిలమందలి ఫలములను, రసములను గ్రోలినారు.

ఆకలిదప్పుల బాధ తీరగనే గడువు తప్పిన భయము ఆవేశించినది. సుగ్రీవు డేర్పరచిన గడువులో సీతాన్వేషణము జరుగక పోవుట వలన, గడువు తప్పి సుగ్రీవుని చేరినచో అతడు మరణ దండనము విధించునని భయపడి ప్రాయోపవేశమునకు సంసిద్ధులైరి. హనుమ వారించినను ప్రాయోపవేశమునకే నిశ్చయించుకొనిరి.

హనుమంతునికి అంగదుని ప్రాణములు ప్రధానము. అట్లే ఇతర వానరుల ప్రాణములు కూడ ప్రధానము. తన బుద్ధి చాతుర్యముతో రకరకములుగ అంగదాదులను ప్రాయోపవేశ కార్యము నుండి విముఖులను చేసెను.

ఇంతలో దైవానుగ్రహముగ సంపాతి ప్రవేశము జరిగినది. సంపాతి వలన వానరులందరికి సీతమ్మ జాడ తెలిసినది. సంపాతి దూరదృష్టి గలవాడు. జ్ఞానమను నేత్రముతో దక్షిణ దిక్కునకు దృష్టి సారించి చూడగా, లంకా పట్టణమున రాక్షస స్త్రీల పర్యవేక్షణలో నున్న సీతాదేవి దర్శనమైనది. తాను సీతను లంకయందు చూచిన విధము వానరులకు తెలియజేసి, లంక దక్షిణ సముద్రమున నూరు యోజనముల దూరమున నున్నదని, వాయు మార్గమున చేరవచ్చునని తెలిపెను.

వానరులందరు అమితముగ సంతోషించిరి. అప్పటికే శరదృతువు, శిశిర ఋతువులు పూర్తి అయి, వసంత ఋతువు ఏర్పడి యున్నది. సీత జాడ తెలిసినది గనుక, ఆమెను దర్శించి, ఆమె సందేశముతో తిరిగి సుగ్రీవుని చేరినచో, రామసుగ్రీవులు సంతోషింతురని, కనుక ప్రస్తుతము మరణింప అవసరము లేదని వారందరు భావించిరి. కాలము రూపమున దైవము తోడ్పాటు చేయుట అనునది సామాన్య జీవితములలో గూడ దర్శింపబడును. యజ్ఞార్థ జీవనమునకై తమను తాము సమర్పించుకొను వారికి ఆపదల నుండి గట్టెక్కుట, కాలము ద్వారా సహాయము లభించుట సృష్టి ధర్మములలో నొకటి.

# 97. జాంబవంతుని ప్రశంస

సీతమ్మజాడ సంపాతి తెలుపగా, వానరులందరు ఉత్సహించి, దక్షిణ దిక్కునగల సముద్రమునకు చేరిరి. అపారమగు సముద్రమును చూడగనే దానినెట్లు దాటవలెనను ప్రశ్న పుట్టినది. వంద యోజనముల దూరములో నున్న లంకను చేరుటకు తగిన బలము గలవారు ఎవ్వరునూ కనబడలేదు. జాంబవంతుడు పూర్వము తనకున్న బలము, ఇపుడు వృద్ధాప్యమున లేదని తెలిపినాడు. అంగదుడు తాను నూరు యోజనములుగల సముద్రమును దాటగలను గాని తిరిగి రాలేనని సందేహ పడినాడు. అపుడు జాంబవంతుడు ఈ కార్యము నెరవేర్చ గలిగిన పరాక్రమశాలి హనుమంతుడే అని భావించి, హనుమంతుని చేరి ఇట్లు ప్రశంసించినాడు.

1. హనుమా! నీవు వానర రాజగు సుగ్రీవునకు సరి సమానుడవు.

2. తేజస్సులో, బలములో రామలక్ష్మణులకు సరితూగ గలిగిన వాడవు.

3. గరుత్మంతుని రెక్కలకు ఎంత బలమున్నదో, నీ భుజములకు అంత బలమున్నది. నీ వేగము, పరాక్రమము గరుత్మంతునితో సమాన ముగ నున్నవి.

4. నీ బలము, తేజస్సు, బుద్ధి, సత్వము, సర్వభూతములలో అతి విశిష్టమైనది.

5. వాయుదేవునికి గల వేగము, బలము, తేజస్సు, పరాక్రమము నీయందున్నది.

6. బాలునిగనే నీవాకాశమున కెగిరి, మూడువందల యోజనముల దూరమున యున్న బాలసూర్యుని ఫలముగ భావించి నోట కరచినావు. వందయోజనముల దూరమున నున్న లంకను చేరుటకు నీకెట్టి ప్రయాసము ఉండదు.

7. బ్రహ్మదేవుడు ఎట్టి శస్త్రాస్త్రములకు బంధింపబడని వరము నీకిచ్చెను.

8. ఇంద్రుడు నీకు స్వచ్ఛంద మరణ మనుగ్రహించెను.

9. నీ గమనశక్తి సర్వభూతములలో ఏ ఒక్కరికిని లేదు.

10. నీవు భూమి చుట్టును కూడ ఒక్కమారుగ ప్రదక్షిణము చేయగల బలశాలివి.

ఇట్లు జాంబవంతుడు హనుమకు అతని తేజోబలమును, బుద్ధి బలమును, పరాక్రమమును, అజేయత్వము, వేగము స్ఫురణకు తేగా, హనుమంతుడు స్ఫురణమాత్రమున తన నిజస్వరూపమును ధరించుట ఆరంభించెను.

పై తెలిపిన గుణ విశేషములేకాక, ఆంజనేయుడు రుద్రాంశ సంభూతుడని, సూర్యుని చుట్టును పరువెత్తుచు సకల వేదములు నేర్చెనని, సహజమగు బంగారు దేహము కలవాడని, తపశ్శక్తిచే వజ్ర దేహమును కూడ పొందెనని మన వాఙ్మయము తెలుపుచున్నది. అట్టి మహాత్ముడు పరతత్త్వముతో ముడిపడి ఎప్పుడునూ ఉండుట

వలన, తనను గూర్చిన అస్తిత్వము మరచి యుండును. కాని గుర్తు చేసినపుడు తనకు గల అమితమగు దివ్యబలము లన్నియు భాసించినవి.

అంతటి విశేష ప్రతిభ కలిగిన హనుమంతుడు సముద్ర తీరమున మౌనముగ, ఒంటరిగ ఒకచోట ఆసీనుడై ఉలుకక, పలుకక నుండెను. అనన్య భక్తునకు గల గుణ విశేషము లన్నియు హనుమలో గోచరించును. అతడు బుద్ధిమంతుల కంటె బుద్ధిమంతుడు. జ్ఞాన వంతుల కంటె జ్ఞాని. పరాక్రమవంతుల కంటె పరాక్రమవంతుడు. యోగులకే యోగి. విరాగులకు కూడ అందని విరాగి. “నేను” అను అహంకారముగాని, “నాది” అనెడి మమకారము గాని వెంట్రుక వాసియైనను లేనివాడు. జగత్తున తనదగు కర్తవ్యము గాని, కార్యము గాని లేక దివ్యత్వమునకు ప్రతీకయై నిలచినాడు. సృష్టియందు అతడు నిర్వర్తింపలేని కార్యము లేదు. అతనిని ఎదుర్కొని నిలబడగల శక్తియూ లేదు. అయిననూ వినమ్రుడై ఒదిగి నిగూఢముగ నుండువాడు.

# 98. హనుమద్రూపము

**జాం**బవంతునిచే ప్రేరణ పొందిన హనుమ క్రమముగ అతని రూపము పెంచెను. బంగారు కాంతితో పెరిగిపోవుచున్న హనుమ రూపమును చూచి, వానరులకు విషాదము అదృశ్యమైనది. ఆనందము ఆవిష్కృతమైనది. వారందరు హనుమను స్తుతించుట ఆరంభించిరి. అతడంతకంతకు పెరిగి, భూమ్యాకాశముల వ్యాప్తి చెందగ, ఆశ్చర్యపడి వానరులందరును హనుమను త్రివిక్రముని వలె భావించి స్తుతించిరి. రూపమునందు, తేజస్సునందు పెరిగిపోవుచున్న అతని రూపము సాటిలేనిదై యుండెను. అతని ముఖము ఎర్రటి సూర్యబింబమువలె ప్రజ్వలించుచుండెను.

శరీరమందలి ఒక్కొక్క రోమము నిఠారుగ శూలమంత బలముగ నుండెను. పరాశర మహర్షి హనుమంతుని విశ్వరూపమును వర్ణించెను. పంచముఖుడుగ ఆంజనేయుని ప్రశంసించెను. అనగా నాలుగు దిక్కులకు, ఊర్ధ్వమునకు కూడ పరిమితి లేకుండగ తిరుగు వాడని అర్థము.

పెరుగుచున్న హనుమంతుడు పెద్దలందరికి నమస్కరించి ఇట్లు పలికెను. వాయుదేవుడు నా తండ్రి, అగ్నిహోత్రుడు నా తాత, అగ్ని వాయువులు సాటిలేని బలము గలవారు. ఆకాశమున పయనించగల వేగము నా అంతగ ఎవ్వరికిని లేదు. ఈ ఆకాశము ఒక చివరి నుండి మరియొక చివరివరకు స్పృశింప గలవాడను. నా వేగముచే, బలముచే నదులను, పర్వతములను, సముద్రమును గూడ అల్ల

కల్లోలము చేయగలను. అంతేగాదు, అతివేగవంతుడైన గరుత్మంతుని చుట్టునూ వేల పర్యాయములు ప్రదక్షిణము చేయగలను. సూర్య కిరణముల కన్న వేగముగ దాటిపోగలను. నూరు యోజనముల సముద్రమే కాదు, భూమి చుట్టునూ ఆకాశమున సాగి రాగలను. నా వాయుబలముచే సాగరమును ఎండింపగలను. భూమిని బ్రద్దలు చేయగలను. నేను వేగముతో సముద్రముపై ఎగురునపుడు సముద్రమును నాతో లాగిపోగలను. ఆకాశమార్గమున నేను చని నపుడు నా వెనుకనే స్పష్టమగు వెలుగుమార్గ మేర్పడగలదు. క్షణములో ఆకాశమున కనబడగలను. నా రూపము త్రివిక్రముని రూపము వలె కన్పట్టగలదు.

నేను సీతమ్మను తప్పక చూచెదను. సంతోషముగ నుండుడు. వజ్రమును దాల్చిన ఇంద్రుడుగాని, మరే స్వయంభూదేవతగాని, వారి రక్షణలో యున్న అమృతమును గూడ తేగలను. ఇన్ని మాటలేల లంకను పెకలించి ఇక్కడ తెచ్చిపెట్టగలను.

విశ్వరూపము ధరించి హనుమంతుడు పలికిన పలుకులకు వానరు లందరు సంతోషించిరి. జాంబవంతుడు హనుమ నుద్దేశించి "హనుమా! నీ రూపము నుపసంహరించుకొనుము. ప్రస్తుత కార్యము నకు తగిన రూపమును మాత్రము ధరించుము. లేనిచో ఈ భూమి కృంగిపోవును. నీ వెగిరినపుడు, పాదముతో నొక్కిపెట్టి ఎగురుచో భూమి, పర్వతములు బ్రద్దలు కాగలవు. నీకంతయు శుభమగును'' అనుచు హనుమను శాంతింపజేయగ, హనుమ చేయవలసిన కార్యమునకు సముచితమగు రూపమును ధరించినాడు.

స్వస్తి.

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 19. | Book of Prayers | E |
| 20. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 21. | Bricks for the Temple | E |
| 22. | Cow | K/T/E/Hi |
| 23. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 24. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 25. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 26. | Dhanakamuni Katha | T |
| 27. | Doctrine of Eternal Presence | E |
| 28. | From the Teachers Pen | E |
| 29. | Gayatri Mantra Avagahana | T |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 30. | Geetopanishad - Sankya Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Gnana Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 35. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 36. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 37. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 38 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 39. | Good Friday | E/S |
| 40. | Gurusisya Samvadamu | T |
| 41. | Healers Handbook | E |
| 42. | Health & Harmony | E/G |
| 43. | Health & Harmony-2 | E |
| 44. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 45. | Himalaya Guruparampara | T/Hi/K |
| 46. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 47. | Just Adjust | E |
| 48. | Jyotirlinga Yatra | T |
| 49 | Jyothisha Vignanamu | T |
| 50. | Kapila and Kardama | E/G/S |
| 51. | Katha Deepika | T |
| 52. | Kumara Sambavam | T |
| 53. | Lectures on Secret Doctrine - I | S/E |
| 54. | Lectures on Secret Doctrine - II | E |
| 55. | Lectures on Secret Doctrine - III | E |
| 56. | Listening to the Invisible Master | E/S/K |
| 57. | Lord Maitreya - The World Teacher | E/S |
| 58. | Life and Teachings of Master Jupiter | E |
| 59. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 60. | Mana Master garu | T |
| 61. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 62. | Mars - The Kumara | E/G/S |
| 63. | Mercury - The Alchemist | E/G/S |
| 64. | Maria Magdalena | E/S |
| 65. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 66. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 67. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 68. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 69. | MASTER C.V.V. - Yogamu | T |


| | | |
|---|---|---|
| 70. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 71. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 72. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 73. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 74. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 75. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 76. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 77. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 78. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 79. | Master CSG | E |
| 80. | Messages of Master E.K. | E |
| 81. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 82. | Moon - The Key | E |
| 83. | New Age Hospital Management | E |
| 84. | Nutrients For Discipleship | E |
| 85. | OM | T/K/E |
| 86. | Occult Meditations | E/G/S |
| 87. | Om Namo Narayanaya | E/G/S |
| 88. | On Change | E/S |
| 89. | On Healing | E |
| 90. | On Love | E/G/S |
| 91. | On Service | E/G/S |
| 92. | On Silence | E/G/S |
| 93. | PARIKSHIT-The World Disciple | E |
| 94. | Pranayamam | T |
| 95. | Prayers | E/G/S |
| 96. | RUDRA | E |
| 97. | Rukmini Kalyanam | T |
| 98. | Sai Sukthulu | T/K |
| 99. | Sai Ki Amruthavani | Hi |
| 100. | Sanghaneethi | T |
| 101. | SAM | E |
| 102. | Saraswathi-The Word | E/G/S |
| 103. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 104. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 105. | Shodosopachara Pooja - Avagahana | T |
| 106. | SOUND-The Key and its Application | E/G/S |
| 107. | Spiritualism-Business and Management | E/G |
| 108. | Spiritual Healing | S/G |
| 109. | Sri Dattatreya | E/G/S/T |

| | | |
|---|---|---|
| 110 | Sripada Srivallabha Charitamrutam | E |
| 111. | Srimadramayana Dharmakusumalu | T |
| 112. | Sri Guru Paadukastavamu | T |
| 113. | SRI LALITHA (Set 10 Books) (Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 114. | SRI SASTRY GARU | T/K/E/S |
| 115. | Sri Krishna Namamrutham | T |
| 116. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 117. | Sri Suktam | E |
| 118. | Steps of Silence | E |
| 119. | Sun that Iam | E/G/S |
| 120. | Temple and the Work | E |
| 121. | Teachings of Lord Maitreya-1 | E |
| 122. | Teachings of Lord Maitreya-2 | E |
| 123. | The Aquarian Cross | E/G/S |
| 124. | The Aquarian Master | E/G/S |
| 125. | The Doctrine of Ethics | E/S |
| 126. | The Etheric Body | E/G/K |
| 127. | The Golden Stairs | E/S |
| 128. | The Path of Synthesis | E |
| 129. | The Splendor of Seven Hills | E |
| 130. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 131. | THE TEACHER-Meaning and Significance | E |
| 132. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 133. | The Teachings of Lord Kapila | E/G |
| 134. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 135. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 136. | The Theosophical Movement | E/G/S |
| 137. | The White Lotus | T/E/S/K |
| 138. | The World Teacher | E |
| 139. | The Mysteries of Sagittarius | E |
| 140. | Time - The Key | E/G |
| 141. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 142. | Varuna Graha Prabhavamu | T/K |
| 143. | VENUS-The Path to Immortality | E/S |
| 144. | Violet Flame Invocations | E |
| 145. | Vrutrasura Rahasyam | T |

**Please visit our website**


(www.dhanishta.org / info@dhanishta.org) for prices


## ధనిష్ఠ ప్రచురణలు

























ప్రతులకు : ధనిష్ఠ ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org



దైత్యులనుండి జీవులను రక్షించుటకే పరతత్త్వము రామునిగ అవతరించినది. అసురత్వమును దగ్ధముచేసి అమృతత్త్వము నావిష్కరించునది రామశబ్దము. రామమంత్రము వలన అసురశక్తులు నశించును. జీవచైతన్యము అమృతతుల్యమై భాసించును.

అట్టి రాముని కీర్తనము ప్రతి హృదయమున జరుగుచు నుండవలెను. ప్రతి గృహమున కూడ జరుగుచు నుండవలెను. రామ స్మరణమున ఆత్మారాముడు అపరిమిత ఆనందము నిచ్చుచుండును. ఇది పెద్దలు మనకిచ్చిన సంపద.

ధనిష్ఠ

ISBN 978-81-89467-59-3